



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

బిజెపి నూతన జాతీయ కార్యవర్గంలో

## రాష్ట్రానికి మొండిచేయి!

బండి సంజయ్, డికె అరుణ, కె.లక్ష్మణ్ జాతీయ పదవుల తొలగింపు

10

సంపుటి 09, సంచిక: 259 | మంగళవారం | 18-08-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00







యుజిసి నెట్ పునఃపరీక్షపై

# భగ్గుమన్న విద్యార్థి సంఘాలు

ఎన్‌టిఎ తప్పులు చేస్తే శిక్ష విద్యార్థులకా? 07

### నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన

**న్యూఢిల్లీ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) మూడు సబ్జెక్టులకు యుజిసి నెట్ పరీక్షలను తిరిగి నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం పై పలు విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. సోమవారం ఢిల్లీలో ఆందోళనకు దిగాయి. పదేపదే జరుగుతున్న లోపాల వల్ల విద్యార్థుల విద్య, వృత్తిపరమైన ప్రణాళికలు ప్రమాదంలో పడ్డాయని వారు ఆరోపించారు. ప్రశ్నపత్రాలలో వాస్తవపరమైన, అక్షర దోషాలు, అనువాద, భాషా సంబంధిత లోపాలు భారీగా ఉన్నాయని నిపుణుల కమిటీ గుర్తించిన తర్వాత, ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు ఎన్‌టిఎ మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఈ పునఃపరీక్షలు సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జరగనున్నాయి. కాగా, ఈ పునఃపరీక్ష నిర్ణయంపై ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా), ఎఐఎస్‌ఎఫ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్ఐ), క్రాంతికారీ యువ సంఘటన్ (కెవైఎస్) వంటి అనేక విద్యార్థి తరువాయి 8లో

### ఎన్‌టిఎను రద్దు చేయాలి

డి.రాజా డిమాండ్

ప్రవేశ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఘోరంగా విఫలమైందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. తాజాగా జిసి నెట్ పరీక్ష ప్రశ్నపత్రాల్లో లోపాలు వెలుగు చూడటంతో మూడు సబ్జెక్టులకు మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఎన్‌టిఎ ఆదేశించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. 'ఎన్‌టిఎ రాజ్యాంగబద్ధమైన సంస్థ కూడా కాదు. అయినప్పటికీ లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దాని చేతుల్లో పెట్టారు. విద్యార్థులు తరువాయి 8లో

# 96 లక్షల మందికి నోటీసులిస్తాం

## రాష్ట్రంలో 'సర్ 'ముసాయిదా విడుదల

- ఎఎస్‌డి జాబితాలో 73 లక్షల మంది
- నోటీసులు అందుకున్న వారు సెప్టెంబర్ 16లోగా సమాధానం ఇవ్వాలి
- మొత్తం ఓటర్లు 2,64,87,213
- సర్‌కు ముందు మొత్తం ఓటర్లు 3,38,26,448
- ఓటర్ల జాబితాలో పేర్లు లేనివారు ఫామ్ 6ఎ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

| ఓటరు ముసాయిదా | |
|---|---|
| సర్‌కు ముందు మొత్తం ఓటర్ల సంఖ్య | 3,38,26,448 |
| ముసాయిదా జాబితాలో ఓటర్ల సంఖ్య | 2,64,87,213 (78.30శాతం) |
| క్లెయిమ్స్, అభ్యంతరాల సమర్పించే గడువు | 17.08.2026 నుంచి 16.09.2026 వరకు |
| నోటీసుల జారీ ,అభ్యంతరాల పరిష్కారం | 17.08.2026 నుంచి 15.10.2026 వరకు |
| తుది ఓటర్ల జాబితా ప్రచురణ | 19.10.2026. |

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓటరు జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) ప్రక్రియ తర్వాత తెలంగాణ రాష్ట్రంలో 2,64,87,213 మందితో (78.30శాతం) రాష్ట్ర ఎన్నికల సంఘం 'ఓటరు ముసాయిదా' జాబితాను విడుదల చేసింది. సర్‌కు ముందు మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, ఇందులో శాశ్వతంగా వలస/అందుబాటులో లేనివారు/ఇతరులు 57,46,803 మంది (16.99 శాతం), ఇతర రాష్ట్రాలకు వెళ్లినవారు, క్షేత్రస్థాయిలో అందుబాటులో లేనివారు, ఫారా లు సమర్పించని, మరణించిన ఓటర్ల సంఖ్య 9,22,229 (2.73 శాతం) ఉన్నట్టు ముసాయిదా జాబితాలో పొందుపర్చారు. ఒకటి కంటే ఎక్కువ చోట ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్న వారు 6,70,203(1.98 శాతం) ఉన్నట్టు ఎన్నికల



సంఘం గుర్తించింది. 92 లక్షల మందికి నోటీసులు జారీ చేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఒ) పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఓటరు జాబితాలో పేర్లు లేనివారు ఫామ్ 6ఎ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. హైదరాబాద్‌లోని సిఇఒ కార్యాలయంలో సోమవారం ఆయన ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నోటీసులు అందుకున్న వారు సెప్టెంబర్ 16వ తేదీలోపు సమాధానం చెప్పాలని, 73 లక్షల మంది అబ్‌సెంట్, షిఫ్టెడ్, డూప్లికేట్ జాబితాలో ఉన్నారని వివరించారు. అర్హులకు మళ్లీ అవకాశం (ఫారం6): ఎన్యూమరేషన్ సమయంలో ఫారం ఇవ్వలేకపోయిన లేదా అందుబాటులో లేని అర్హులైన పౌరులు తమ పేర్లను తిరిగి జాబితాలో చేర్చుకునేందుకు సెప్టెంబర్ 16 వరకు ఫారం6తో పాటు నిర్దేశిత డిక్లరేషన్‌ను సమర్పించేందుకు అవకాశం కల్పించారు. అలాగే 01 అక్టోబర్, 2026 నాటికి 18 ఏళ్లు నిండే యువతీయువకుల నమోదు కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఓటర్ల సంఖ్య 1,200 మించకుండా హేతుబద్ధీకరణ చేపట్టడంతో రాష్ట్రంలో పోలింగ్ కేంద్రాల తరువాయి 8లో



## కేరళ ఇక 'కేరళం'

పేరు మార్పు బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం

**న్యూఢిల్లీ :** కేరళ రాష్ట్రం పేరు మారనుంది. కేరళ పేరును 'కేరళం'గా మార్చే బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. గత మంగళవారం లోక్‌సభ 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను ఆమోదించగా, మరుసటి రోజు రాజ్యసభ కూడా దీనికి ఆమోదం తెలిపింది. రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మాట్లాడుతూ, రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చేలా చట్టం తీసుకురావాలని కోరుతూ కేరళ అసెంబ్లీ 2024లో ఒక తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. 'కేరళ రాష్ట్రాన్ని ఇకపై 'కేరళం' రాష్ట్రంగా పిలవాలని ఈ బిల్లు నిర్దేశిస్తోంది. అందుకే కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చే ప్రతిపాదన చేయబడింది' అని ఆయన పేర్కొన్నారు. పేరు మార్పునకు సంబంధించి రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని కేరళ ప్రభుత్వం 2024 జూన్‌లో కేంద్రానికి పంపింది. ఆ తర్వాత, రాష్ట్రపతి ముర్ము ఈ బిల్లుపై అభిప్రాయం కోసం దానిని రాష్ట్ర శాసనసభకు పంపారు. దీనికి స్పందనగా అసెంబ్లీ బిల్లుకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ బిల్లులోని ఉద్దేశాలు, కారణాల ప్రకటన ప్రకారం, 'కేరళ (పేరు మార్పు) బిల్లు' రాష్ట్రం పేరు మార్పునకు వీలు కల్పిస్తుంది.

### ముగిసిన 60 రోజుల గడువు 10

పెరిగిన ఇరాన్‌–అమెరికా విభేదాలు




కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్

## కొనసాగిస్తాం

- గత ప్రభుత్వ జిఒల లోపాల వల్లే ప్రస్తుత సమస్య
- హైకోర్టు స్టేపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్: మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సోమవారం మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నేతలు పథకాల తరువాయి 12లో

2027 డిసెంబర్ 9 లోపు

# ఉస్మానియా, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులు

ప్రతి ఆరునెలలకొక్కటి చొప్పున పూర్తి చేస్తాం

- విద్య, వైద్యంపై చేసే వ్యయం భవిష్యత్తుకు పెట్టుబడి
- ప్రభుత్వ వైద్యులు ఆస్పత్రుల్లో అదనపు సేవలందిస్తే ప్రోత్సాహకాలు
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరోగ్యశ్రీకి రూ.2,700 కోట్లు చెల్లింపు
- సనత్‌నగర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- టిమ్స్‌లకు టెంకాయలు కొట్టిన బిఆర్‌ఎస్, నిర్మాణాలు మరిచిందని ఎద్దేవా



ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చే ఏడాది(2027) డిసెంబర్ 9 వరకు ప్రతి ఆరు నెలల చొప్పున ఉస్మానియా, ఎల్‌బినగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రైవేటు ఆస్పత్రులు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులతో పోటీ పడలేని విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వ వైద్య నిపుణులు పేదలకు అదనంగా సేవలు అందిస్తే, వారికి 'ఆరోగ్యశ్రీ, సిఎం రిలీఫ్ ఫండ్' ద్వారా ఇన్‌సెంటీవులను చెల్లించే అంశాన్ని తరువాయి 8లో

# జెఎస్ఎస్‌సి-సిజిఎల్ పరీక్ష రద్దు

- విద్యార్థుల ఆందోళనతో దిగొచ్చిన జార్ఖండ్ ప్రభుత్వం
- 2014 నుంచి నిర్వహించిన అన్ని పరీక్షలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి హేమంత్ సోరన్
- నిరాహారదీక్ష విరమించిన దేవేంద్రనాథ్ మహతో



**రాంచి :** నియామక పరీక్షలలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల తో విద్యార్థులు 24 రోజులుగా చేస్తు న్న ఆందోళనల నేపథ్యంలో జార్ఖండ్ ప్రభుత్వం దిగొచ్చింది. జార్ఖండ్ స్టాఫ్ సెలక్ష న్ కమిషన్ – కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (జెఎస్ఎస్‌సిసిజిఎల్) పరీక్షను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం రాత్రి ప్రకటించారు. అదే విధంగా టిఎస్ఆర్ డేటా ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (టిడిపిఎల్) ద్వారా నిర్వహించిన పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపికైన అభ్యర్థుల వివరాలతో సహా ఆ సంస్థకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. జైపాల్ సింగ్ స్టేడియంలో మీడియాతో మాట్లాడిన సోరెన్, ఆందోళన చేస్తున్న విద్యార్థుల ప్రధాన డిమాండ్ అయిన జెఎస్ఎస్‌సిసిజిఎల్ పరీక్షను రద్దు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు. టిడిపిఎల్ నిర్వహించిన పరీక్షలు, ప్రకటించిన ఫలితాలు, ఎంపికైన లేదా పాల్గొన్న అభ్యర్థులు, ఆ సంస్థ చేపట్టిన ఇతర కార్యకలాపాలతో సహా టిడిపిఎల్‌కు సంబంధించిన అన్నింటినీ రద్దు చేయాలని తాము నిర్ణయించామని సోరెన్ పేర్కొన్నారు. 2014 నుండి ఇప్పటి వరకు నిర్వహించిన అన్ని నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని తరువాయి 10లో



## '22-ఎ' భూములపై ఉన్నతస్థాయి కమిటీ

- 15 రోజుల్లో దరఖాస్తుల పరిష్కారం
- ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రైవేటు ఆస్తులకు సంపూర్ణ రక్షణ : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నిషేధిత భూములపై వచ్చే దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించడంతో పాటు, సమస్యల పరిష్కారం కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార–పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై పెండింగ్ దరఖాస్తులు, భూ వివాదాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. 22ఏ భూముల అంశంపై సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్‌డిఒలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానంగా తరువాయి 8లో



ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
మంగళవారం
18-08-2026
www.prajapaksham.in



# 'దిమాగీ నక్సల్స్' అర్థం చెబుతారా మోదీజీ!!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పదాలు కూర్చటంలో, ప్రయోగించటంలో దిట్ట. ఆయనకు పొగడ్తలు తప్ప విమర్శలు నచ్చవు. ప్రజలు తమ బాధలగూర్చి, హక్కుల గూర్చి మాట్లాడటం అసలే గిట్టదు. పెట్టుబడిదారులకు పరమ మిత్రుడు; రైతులు, కార్మికులకు బద్ధ వ్యతిరేకి. గిట్టుబాటు ధరలకోసం నాలుగేళ్లుగా పోరాటం చేస్తున్న పంజాబ్–హర్యానా రైతులు నిరసన తెలిపేందుకు దేశ రాజధానికి రాకుండా సరిహద్దుల్లోనే అణచివేత, నిర్బంధం. రైతులు ముందుకు రాకుండా రహదారిపై మేకులు కొట్టించిన తొలి ప్రభుత్వం మోదీ జీ దే. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి – మూడు రైతు వ్యతిరేక చట్టాలు ఉపసంహరించుకున్నాక కూడా ఆయనలో రైతుల పట్ల సానుభూతి పెరగలేదు. నిన్నకూడా ఢిల్లీ వస్తున్న రైతులను పంజాబ్–హర్యానా సరిహద్దులలో పోలీసులు అడ్డుకున్నారు. పెట్టుబడిదారుల లాభాల కోసం 'వ్యాపారాలు సులభతరం' విధానం అమలు చేస్తున్న ప్రధాని మోదీ కార్మికుల సంఘటితశక్తిని, ఆ శక్తితో సాధించుకున్న హక్కులను హరించేందుకు 29 చట్టాలు రద్దుచేసి నాలుగు సంహితలను (కోడ్‌లు) చట్టాలుగా కూర్చారు. వాటికి వ్యతిరేకంగా నాలుగేళ్లుగా 10కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు నిర్విరామ ఆందోళన చేస్తున్నా, పలుమార్లు సార్వత్రిక సమ్మె చేసినా ఆయనకు చీమకుట్టినట్లు లేదు. జాతీయ విద్యావిధానం పేరుతో విద్యను హిందూత్వ సిద్ధాంతంలో పొదిగినారు. విద్య కేంద్రీకరణ, పోటీ పరీక్షలు కేంద్రీకరణ. పరీక్షల నిర్వహణలో తప్పులు, అవకతవకలు, అక్రమాలు, అవినీతి కేంద్రీకరణ. మరోవైపున మావోయిస్టులను (నక్సలైట్‌లకు) భౌతికంగా ఏరివేశామన్న ఉత్సాహంలో ఉన్న ప్రధాని మోదీ, ఆయన అనుంగుశిష్యుడు హోంమంత్రి అమిత్ షాలను అనూహ్యమైన దెబ్బకొట్టారు కాక్రోచ్ జనతాపార్టీ (సిజెపి) ఆన్‌లైన్ పిలుపుపై జెన్ జీ యువత.

ఈ నేపథ్యంలో, ఎర్రకోటనుంచి 80వ స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంలో ప్రధానమంత్రి యువతకు కొన్ని వరాలు ప్రకటించారు. అదే సమయంలో 'దిమాగీ నక్సలైట్‌లు' అని కొత్త పదం ఉపయోగించా రు. దీని అర్థం ఏమిటి మహాశయా అని దేశంలోని రాజకీయ స్పృహ కలిగిన విద్యావంతులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు. మోదీజీ సామాన్యంగా వ్యర్థ పదాలు (రాజకీయ సభల్లో తప్ప) ఉపయోగించరు. 'అడవుల్లోని నక్సలైట్లను ఏరివేస్తున్నాం – పట్టణాల్లో నక్సలైట్‌లు మరీ ప్రమాదకారులని' గత సంవత్సరం హెచ్చరించిన మోదీ, ఇప్పుడు 'అడవుల్లోని నక్సలైట్లను ఏరివేశాం' అని ఘనంగా చెప్పుకుంటూ, 'దిమాగీ (మేధావులు, విద్యావంతులని అర్థం)నక్సలైట్ల' ప్రస్తావన చేశారు. వీరు ఇన్నాళ్లదాకా ప్రభుత్వంలో సలహాదారులుగా మావోయిస్టు భావజాలంతో విధానాలను ప్రభావితం చేశారట! ఇప్పుడు సమాజాన్ని ప్రభావితం చేయటం కొనసాగిస్తున్నా రట! 'వారు మన చుట్టూ ఉన్నారు, గుర్తించి ఏకాకులను చేయాలి' అన్నారు. వామపక్ష మేధావుల గూర్చి ప్రధాని ఈ పదం వాడారన్నది స్పష్టం. ఆ భావజాలం పట్ల అప్రమత్తంగా ఉండాలి అంటున్నారంటే, ఇటీవల యువత, రైతులు, కార్మికుల ఆందోళనల వెనుక ఆ మేధావులు ఉన్నారనే అన్యాపదేశం స్ఫురిస్తుంది. వామపక్ష భావజాలాన్ని అణచివేసే పేరుతో యూనివర్శిటీల్లో హింసాత్మక దాడులు ప్రేరేపించటం, అందుకు ఆర్‌ఎస్‌ఎస్, ఎబివిపిలను ప్రోత్సహించటం చూశాం, చూస్తున్నాం. బయట వామపక్ష మేధావులకు మావోయిస్టులు, అర్బన్ నక్సల్స్ అనే ముద్రవేసి దేశద్రోహం, ప్రధాని హత్యకు కుట్ర వంటి ఆరోపణలు బనాయించి బెయిలుకు అవకాశంలేని జాతీయ భద్రత, ఉపా చట్టాల కింద అరెస్టు చేశారు. ఇది అసమ్మతిపై, భిన్నాభిప్రాయంపై దాడి. మానవ మేధస్సుకు, ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన శిలా సదృశ సమాజ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ వారి సిద్ధాంతం కదా! మత మార్గాల్లో దేశాన్ని విభజిస్తూ ఒకే ఆహార్యం, ఒకే భాష, శాఖాహారం, సనాతన ఆచారాలు, నమ్మకాల ఆరాధన సిద్ధాంతం అసమ్మతిని, నిరసనను సహించక పోవచ్చు. కాని ఈ 21వ శతాబ్దంలో నిరసనను అణచాలను కోవటం మూర్ఖత్వం.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదంబరం ''దిమాగీ నక్సల్‌గా ఉండటానికి నేను గర్విస్తాను'' అని ఎక్స్‌లో పెట్టిన పోస్టు ఎష్టాబ్లిష్‌మెంట్‌ను కలవరపరిచినట్లుంది. పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరణ్ రిజిజు హడావిడిగా మేల్కొని (తన ప్రకటనలోని వరుస సంఖ్యల్లో 3 అంకె లేకపోవటం సైతం గమనించలేదు) ప్రధాని వ్యాఖ్య ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ఉద్దేశించింది కాదని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఆయన ప్రధానమంత్రి బుర్రలోకి దూరి ప్రధాని వ్యాఖ్యలు ''మావోయిస్టులను బలపరిచే వారికీ, భారత రాజ్యాంగాన్ని తిరస్కరించేవారికీ, వేర్పాటు వాదులను బలపరిచే వారికీ, ఆర్టికల్ 370ని బలపరిచేవారికీ, భారత్ నుండి ఈశాన్య రాష్ట్రాలను వేరుచేసేందుకు చికెన్ నెక్ ప్రాంతాన్ని వేరుచేయాలని కోరేవారికీ వ్యతిరేకంగా'' ఎక్కుపెట్టబడినట్లు వివరించారు.

అయితే బిజెపి ఎంపి నిషికాంత్ దూబె, బిజెపి ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌లు చిదంబరంపై ఎదురుదాడికి దిగి అణుబాంబుపై గతంలో ఆయన ప్రకటన 'దిమాగీ నక్సల్' ప్రకటనగా ఉందని, యుపిఎ ప్రభుత్వంలో 'కాషాయ టెర్రరిజం ప్రాజెక్టుకు ఆయన కన్సల్టెంట్' అని నిందించారు. ప్రధాని ప్రకటన రాజకీయ ప్రత్యర్థులపై ఎక్కుపెట్టబడిందే నని వీరి వ్యాఖ్యలు చెబుతున్నాయి.

జాతీయవాదులు, ప్రగతిశీలురు, వామపక్షవాదులు, నియంతృత్వ వ్యతిరేక ప్రజాస్వామ్యవాదులు ప్రధాని లేబుల్‌ను ముక్తకంఠంతో ఖండించాలి. విద్యారంగ సమస్యలపై మధ్యప్రదేశ్‌లో స్కూలు పిల్లలు సైతం తమంతటతాము ఉద్యమిస్తున్నారు. అది జన్ జీ జాతీయస్థాయి ఆందోళన తెచ్చిన చైతన్యం. దాన్ని ఆపటం ఎవరితరం కాదు. ●



## దేశభక్తి గురించి అమిత్ షా నేర్పిస్తాడా?

నాపై, సోనియాగాంధీపై, గాంధీ కుటుంబంపై అమిత్‌షా వ్యతిరేకంగా మాట్లాడుతుంటారు. నేను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఆయన చిన్న పిల్లవాడు. ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడాడా? ఏ ఒక్క బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ వారైనా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారా? మాకు దేశభక్తి గురించి అమిత్ షా నేర్పిస్తాడా? మేము దేశభక్తులం కాదంటావా.. మేము భారతదేశ వ్యతిరేకులమా.. మత వ్యతిరేకులమా.. అసలు దేశవ్యతిరేకులు, మత్య వ్యతిరేకులు మీరే.. నేను ఉత్తరాఖండ్‌లో ప్రసంగించి వచ్చాక.. వేదికను బిజెపి వారు శుద్ధి చేశారు. ఇలా చేయమని వారికి ఏ మతం చెప్పింది. బిజెపి గురువులు నేర్పింది ఇదేనా?

– కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే

## బహుజన విప్లవ పతాక సర్వాయి పాపన్న



పద్దెనిమిదో శతాబ్దపు తొలినాళ్లలో దక్కన్ ప్రాంతంలో మొఘల్ సామ్రాజ్య నిరంకుశత్వానికి, జమీందారుల దోపిడీకి వ్యతిరేకంగా ఎదురుతిరిగిన విప్లవ వీరుడు సర్వాయి పాపన్న (పాపడ రాయుడు). సాధారణ గీత కార్మిక కుటుంబంలో జన్మించిన ఆయన, తన ధైర్య సాహసాలు, నాయకత్వ పటిమతో ఒక సైన్యాన్ని నిర్మించి, గోల్కొండ కోటపై తన జెండాను ఎగురవేశారు. బహుజన వర్గాల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన తొలి తరపు తిరుగుబాటు నాయకుడిగా పాపన్న చరిత్రలో నిలిచారు.

సర్వాయి పాపన్న 1650 ఆగస్టు 18న తెలంగాణలోని వరంగల్ జిల్లా (ప్రస్తుత జనుగామ జిల్లా) రఘునాథపల్లి మండలానికి చెందిన కిలాషాపూర్ గ్రామంలో జన్మించారు. ఆయన గౌడ (గీత కార్మిక) సామాజిక వర్గానికి చెందిన సర్వమ్మ, నాసగోని ధర్మాన గౌడ్ అనే దంపతుల కుమారుడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో తల్లి సంరక్షణలోనే పెరిగారు. ఆనాటి సామాజిక పరిస్థితుల వల్ల పాపన్నకు సాంప్రదాయ పాఠశాల విద్య లేదా అక్షరాభ్యాసం లభించలేదు. అయితే, చదువు లేకపోయినప్పటికీ ఆయన వృత్తిపరమైన పనుల్లో, ప్రకృతి పరిశీలనలో, గ్రామీణ వాతావరణంలో గొప్ప ఆచరణాత్మక జ్ఞానాన్ని సంపాదించారు. చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు, ఎదురుతిరిగే తత్వం, సాహసం ఆయనలో పుష్కలంగా ఉండేవి. సాంప్రదాయ విద్యకు దూరమై నా, కత్తిసాము, విలువిద్య, గుర్రపుస్వారీ వంటి సమర విద్యల్లో ఆరితేరి, తన చుట్టూ ఉన్న గ్రామీణ యువతను సమీకరించి ఒక క్రమశిక్షణ కలిగిన సైన్యంగా తీర్చిదిద్దే స్థాయిలో విజ్ఞానాన్ని సొంతంగా పెంపొందించుకున్నారు. యుక్తవయస్సుకు వచ్చేసరికి పాపన్న గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అన్యాయాలను దగ్గరుండి గమనించారు. ఆనాటి పాలకులు, జమీందారులు పేదలపై మోపుతున్న అపారమైన పన్ను లు,అణచివేత ఆయనను తీవ్రంగా ఆలోచింపజేశాయి. పాపన్న కేవలం ఆయుధాలు పట్టిన తిరుగుబాటుదారుడు మాత్రమే కాదు; గొప్ప ప్రజా సంక్షేమ కాముకుడు. జమీందారులు, నవాబుల వద్ద ఉన్న అక్రమ సంపదను దోచుకుని, దానిని పేదలకు పంచిపెట్టేవారు. గన్‌పౌడర్ తయారీ, ఫిరంగుల నిర్మాణం, గెరిల్లా యుద్ధ తంత్రాలలో ఆరితేరిన ఆయన, తాటికొండ, షాపూర్ వంటి ప్రదేశాలలో బలమైన కోటలను నిర్మించారు. ఆనాటి గోల్కొండ సుబేదార్లను, మొఘల్ పాలకుల సైన్యాలను పలుమార్లు ఓడించి, సామాన్యుడు కూడా పాలకుడు కాగలడని నిరూపించా రు. 1709లో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని, కొన్ని నెలల పాటు స్వతంత్ర పాలన సాగించడం ఆయన పోరాటంలో అత్యున్నత ఘట్టం. ఆనాటి ఢిల్లీ సుల్తాన్ బహదూర్ షా సైతం పాపన్న ఎదుగుదలను చూసి అప్రమత్తమై, భారీ సైన్యాన్ని పంపి ఆయనను దగాతో అంతమొందించాల్సి వచ్చింది. ప్రాణాలు విడిచినా, పాపన్న స్థాపించిన ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తి ఇప్పటికీ అమరంగానే ఉంది.

*(ఆగస్టు 18 సర్వాయి పాపన్న జయంతి )*


సుధాకర్ ఏవి, 9000674747

# ప్రశ్నిస్తే నక్సల్స్... విమర్శిస్తే దిమాగీ నక్సల్స్

## అసమ్మతిపై ప్రధాని సరికొత్త ఆయుధం

ప్రధాని నరేంద్రమోదీ భయపడుతున్నారా? భయపెడుతున్నారా? నిన్నటి వరకు అర్బన్ నక్సల్స్ అంటూ మాట్లాడిన మోదీ... దేశంలో యువత తిరుగుబాటుతో దిమాగీ నక్సల్స్ అంటూ కొత్త పదాన్ని తెరపైకి తీసుకొచ్చారు. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనతో పరువుపోయిన ఎన్‌డిఎ సర్కారుకు మోదీ సరికొత్త ఊపిరిపోయాలనుకుంటున్నారా? జంతర్‌మంతర్ విద్యార్థి, యువతను పరోక్షంగా దిమాగీ నక్సల్స్ అంటున్నారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. నక్సల్స్ పోయారు... దిమాగీ నక్సల్స్ వచ్చారంటూ అసమ్మతికి మోదీ కొత్త ముద్ర వేశారు. అసమ్మతిని కళంకితం చేయడం... మేధావులను, విద్యావేత్తలను భయపెట్టడం... ప్రజాస్వామిక చర్చకు స్థలాన్ని కుదించడమే ప్రధాని పంద్రాగస్టు ప్రసంగం లక్ష్యమన్న విమర్శలు ఉన్నా యి. ప్రశ్నించే ప్రతి గొంతుకా 'నక్సల్' అయితే ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ఎలా అన్న ప్రశ్న వినిపిస్తోంది. అందుకే మోదీ 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యను హెచ్చరికగా చూడాలని విమర్శకులు అన్నారు. ఒకప్పుడు సాయుధ తిరుగుబాటుదారులను గుర్తించేందు కు ఉపయోగించిన భాష, ఇప్పుడు ప్రభుత్వాన్ని మేధోపరంగా, రాజకీయంగా ప్రశ్నించే వారికీ విస్తరిస్తోందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. 'దిమాగీ నక్సల్స్' అనేది రాజకీయ వ్యాఖ్య మాత్రమే కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాలక వర్గాలను విద్యావేత్త లు, జర్నలిస్టులు, మేధావులు, పౌర సంఘాలు ప్రశ్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజమే కాగా విమర్శకుడిని 'దిమాగీ నక్సల్'గా ముద్ర వేస్తే ప్రశ్నలకు సమాధానమివ్వడం కంటే ఆ ఉద్దేశా న్ని అనుమానించడమే సులువు. అందుకోసమే ఈ పదప్రయోగంపై ప్రతిపక్షాలు, మేధావి వర్గం విమర్శలు తీవ్రతరం చేశాయి.

నక్సల్స్ బలహీనపడ్డారని, నక్సలిజం భావజాలాన్ని కొనసాగించేందుకు 'దిమాగీ నక్సల్స్' అవకాశాలు వెత్తుక్కుంటున్నారని, వారిని గుర్తించి, ఒంటరి చేయాలని స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలతో నక్సలిజం అంటే తుపాకీనా లేక ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ఆలోచనా అనే ప్రశ్న మార్మోగింది. ప్రతిపక్షాలు, పౌర హక్కుల వర్గాలు, మేధావి వర్గం మండిపడ్డాయి. ప్రజాస్వామ్యంలో అసమ్మతిని, విమర్శలను, భావజాల భేదాన్ని 'నక్సలిజం'తో ముడిపెట్టే ప్రమాదకర రాజకీయ భాష వినియోగాన్ని దుయ్యబట్టాయి. గతంలో అర్బన్ నక్సల్ వ్యూహాన్ని విస్తరిస్తూ దిమాగీ నక్సల్స్ పద ప్రయోగం జరిగిందని వ్యాఖ్యానించాయి. సర్కారు సిద్ధాంతాలను, రాజకీయ అజెండాను సవాల్ చేసే విద్యావేత్తలను, మేధావులను, సామాజిక హక్కుల కార్యకర్తలను, ప్రభుత్వ విమర్శకులను ఇలా వర్గీకరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని హెచ్చరించాయి. తుపాకీ పట్టిన వారితో పోరాడటం ఒక అంశమైతే ఆలోచనాపరులను శత్రువుగా ప్రకటించడం మరో అంశమని విమర్శకులు అన్నారు. రెండింటినీ కలిపేస్తే ప్రజాస్వామ్య అసమ్మతికి, సాయుధ తిరుగుబాటుకు మధ్య ఉన్న తేడా మసకబారుతుందని హెచ్చరించాయి. అర్బన్ నక్సల్‌గా ముద్ర పడితే ఏం జరుగుతున్నది దేశానికి తెలుసు. ఫాదర్ స్టాన్ స్వామితో పాటు వందల





'దిమాగీ నక్సల్' కావటం నాకు గర్వకారణం – చిదంబరం

మంది విద్యావేత్తలు, మేధావు లు ఈ ఒక్క పదం కారణంగా వేధింపులు ఎదుర్కొన్నారు. బీమా కోరేగావ్ కేసులో వీళ్ల 2020, అక్టోబరు 8న ఎన్‌ఐఎ అరెస్టు చేసింది.

నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేసినాగానీ సమాజంలో తమకు సైద్ధాంతిక శత్రువును గుర్తించేందుకు దిమాగీ నక్సల్ పదాన్నీ వినియోగించే అవకాశం లేకపోలేదు. ఈ పదాన్ని తేలికగా తీసుకోరాదు. సాయుధ కార్యకలాపాల పరిధి తగ్గిన తర్వాత అదే పదజాలాన్ని మేధో, రాజకీయ, సామాజిక రంగాపైకి అస్త్రంగా వినియోగించేందు కు అవకాశం ఇవ్వరాదు. ప్రభుత్వ విధానాలపై విద్యా సంస్థల్లో ప్రశ్న లు రావచ్చు. విశ్వవిద్యాలయాల్లో భావజాలంపై చర్చలు జరగవచ్చు. విధానాలను పౌర సమాజం విమర్శించవచ్చు. అధికారాన్ని మీడియా నిలదీయవచ్చు. ఇవన్నీ ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియలే. అయితే వీటిని 'నక్సల్ భావజాలం'తో ముడిపెడితే మాత్రం క్యాంపస్ చర్చను భద్రతా సమస్యగా, విమర్శలను దేశ వ్యతిరేక చర్యగా చిత్రీకరించే ప్రమాదం ఏర్పడుతుందని విమర్శకులు హెచ్చరించారు. విద్య, ఉపాధి, పోటీ పరీక్షలు, భవిష్యత్తుపై అనిశ్చితి వంటి అంశాలపై మోదీ ప్రసంగంలో ప్రస్తావనే లేదు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, నీట్ పేపర్ లీక్ వివాదం, పోలీసుల దుశ్చర్యల ఆరోపణలు, విద్యా వ్యవస్థలో తీవ్ర సంక్షోభం గురించీ మాట్లాడలేదు. నాణ్యమైన విద్య, ఉద్యోగం, జవాబుదారీతనం కోసం యువత డిమాండ్ చేస్తు న్న నేపథ్యంలో సైద్ధాంతిక/భావజాల శత్రువులుగా పరిగణిస్తామని హెచ్చరించడానికి ప్రధాని మొగ్గు చూపడటంపై ఆందోళన వ్యక్తమైంది. నక్సలిజాన్ని అంతం చేశామనే వారు అందు కు దారితీసే సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలపై ఎందుకు దృష్టి పెట్టరన్న ప్రశ్న ఉత్పన్నమైంది. బలవంతపు భూసేకరణ, నిర్వాసితులు చేయడం, అటవీ హక్కులు... ఆదివాసీ హక్కుల హరణ, అభివృద్ధి నవనా వంటి అంశాలపై ప్రశ్నిస్తే నక్సలిజమా అన్న ప్రశ్న వినిపించింది. ప్రజాస్వామ్యంలో అభివద్ధి అంటే ఆర్థిక వృద్ధి మాత్రమే కాదని, జవాబుదారీతనం, పారదర్శకత, పౌర స్వేచ్ఛలు, అసమ్మతికి స్థలం కూడా అన్న అభిప్రాయం వ్యక్తమైంది.

దిమాగీ నక్సల్స్ అన్నది ప్రభుత్వ విధానాలను విమర్శించే ప్రతి ఒక్కరినీ ఉద్దేశించిన పదం కాదని సర్కారు తరపున కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు వివరణ ఇచ్చారు. 'అర్బన్ నక్సల్' భావజాలాన్ని వ్యాప్తి చేసే వారినే దిమాగీ నక్సల్స్ అన్నట్లుగా చెప్పుకొచ్చారు. అయితే దీనిని ఎలాంటి ప్రమాణాల ఆధారంగా నిర్ణయిస్తారన్న ప్రశ్న ఘోషిస్తోంది. ఇందుకు ప్రభుత్వ స్పష్టత కోసం డిమాండ్ వినిపిస్తోంది.

# పారిశుద్ధ్య కార్మికులు మనుషులు కారా?

భారతదేశంలో మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధించి మూడు దశాబ్దాలకు పైగా గడిచింది. సెప్టిక్ ట్యాంకులు, మురుగు కాలువలను యంత్రాలతోనే శుభ్రం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రకటించి మూడేళ్లు దాటింది. సుప్రీంకోర్టు కూడా పలుమార్లు 'ఏ మనిషినీ మురుగు కాలువలోకి దింపకూడదు' అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అయినప్పటికీ దేశంలో ప్రతి కొన్ని రోజులకు ఒక పారిశుద్ధ్య కార్మికుడు విషవాయువులకు బలవుతున్నాడు. చట్టాలు, ప్రభుత్వ పథకాలు, న్యాయస్థానాల ఆదేశాలు ఒక వైపు ఉంటే, నేలమీద జరుగుతున్న వాస్తవం మరోవైపు కనిపిస్తోంది. ఈ పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఈనెల 4న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సఫాయి కర్మచారి ఆందోళన్(ఎస్‌కెఎ) ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, మురుగు కాలువల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పెద్దఎత్తున నిరసన చేపట్టారు. 'మమ్మల్ని చంపడం మానుకోండి' అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల మరణాలను అరికట్టడంలో విఫలమైందని ఆరోపిస్తూ ప్రధానమంత్రి దేశానికి క్షమాపణ చెప్పాలని, మురుగు కాలువల్లో మనుషులను దింపే పద్ధతిని పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళన సహేతుకం. అత్యవసరం కూడా. ఎంతోమంది కార్మికులు మృతి చెందుతున్నా, ప్రభుత్వాల నుంచి స్పందన లేకపోవడం, కనీస ఆసరా కూడా కనిపించకపోవడం దుర్మార్గం. ఈ ఉద్యమంలో అత్యంత ఆందోళనకరమైన అంశం మరణాల సంఖ్యలో కనిపిస్తున్న వ్యత్యాసం.

సఫాయి కర్మచారి ఆందోళన్ సేకరించిన వివరాల ప్రకారం 2021 జనవరి నుంచి 2026 జులై వరకు దేశవ్యాప్తం గా 593 మంది సెప్టిక్ ట్యాంకులు, మురుగు కాలువలు శుభ్రం చేస్తూ ప్రాణాలు కోల్పోయారు. అయితే ఇదే కాలానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో అంగీకరించిన సంఖ్య332 మాత్రమే. అంటే 261 మంది మరణాలు అధికారిక లెక్కల్లోనే కనిపించడం లేదని ఉద్యమకారులు ప్రశ్నిస్తున్నారు. ఎస్‌కెఎ ప్రకారం 2021లో 47 మంది, 2022లో 93 మంది, 2023లో 102 మంది, 2024లో 117 మంది, 2025లో 121 మంది, 2026 జులై వరకు మరో 113 మంది మరణించారు. జులై ఒక్క నెలలోనే 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సంస్థ పేర్కొంది. అంటే పరిస్థితి మెరుగుపడడం కాదు, మరింత దిగజారుతోందని వారి వాదన. ప్రభుత్వం ఈ మరణాలను 'పని సమయంలో జరిగిన ప్రమాదాలు' గా పేర్కొంవడం విడ్డూరం. ఇవి ముమ్మాటికీ ప్రమాదాలు కావు, చట్టవిరుద్ధంగా మనుషులను విషవాయువులతో నిండిన మురుగు కాలువల్లోకి దింపడం వల్ల జరిగే నివారించగల మరణాలు. భారత రాజ్యాంగంలోని సమానత్వ హక్కు (ఆర్టికల్ 14), అంటరానితన నిర్మూలన (ఆర్టికల్ 17), జీవించే హక్కు (ఆర్టికల్ 21) లను ఈ మరణాలు ఉల్లంఘిస్తున్నాయి. చట్టాలు ఉన్నప్పటికీ వాటి అమలు జరగకపోవడం వల్లే ప్రతి మరణం రాజ్యాంగ వైఫల్యంగా మారుతోందన్న ఎస్‌కెఎ వాదనలో నిజం లేకపోలేదు. అంతేకాదు, పారిశుద్ధ్య పనులు ఇప్పటికీ ప్రధానంగా దళిత వర్గాల భుజాలపైనే ఉండడం యాదృచ్ఛికం కాదని, అది శతాబ్దాల కులవివక్ష కొనసాగింపేనని సామాజిక ఉద్యమకారులు పేర్కొంటున్నారు. పరిశుభ్రత గురించి గొప్పగా మాట్లాడే సమాజం, ఆ పరిశుభ్రత కోసం ప్రాణాలు పణంగా పెట్టే కార్మికుల భద్రత విషయంలో మాత్రం మౌనం గా ఉంటోందని వారు విమర్శిస్తున్నారు. మురుగు కాలువల్లో మరణిస్తున్నవారు ఎక్కువగా దళితులే కావడం వల్లే ఈ విషాదాలకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఎస్‌కెఎ నాయకులు ఆరోపిస్తున్నారు. అందుకే ఈ సమస్యను కేవలం కార్మిక భద్రత అంశంగా కాకుండా సామాజిక న్యాయం కోణంలో కూడా చూడాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ఈ మరణాలకు సంబంధించిన గణాంకాల వెనుక ఎన్నో కుటుంబాల విషాదం దాగి ఉంది. 2009లో ఢిల్లీలోని నరేలా ప్రాంతంలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేస్తూ





మరణించిన అశోక్ కుమార్ కుటుంబ సభ్యురాలు సత్యవతి జంతర్ మంతర్ నిరసనకు హాజరై తన బాధను పంచుకున్నారు. 'పనికి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. పదిహేడేళ్లు గడిచినా న్యాయం జరగలేదు' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరో పారిశుద్ధ్య కార్మికుడు పాలేరాం చెప్పిన అనుభవం పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలియజేస్తుంది. ఇరవై ఐదేళ్లుగా సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తున్న తనకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదని, కొన్నిసార్లు చేతి తొడుగులు కూడా లేకుండానే ట్యాంకుల్లోకి దిగాల్సి వచ్చేదని చెప్పారు. ఇటీవల ట్యాంకులో జారి కాలు విరిగినా జీవనోపాధి కోసం అదే పని కొనసాగిస్తున్నానని ఆయన వాపోయారు. ఇలాంటి అనుభవాలు ఎన్నో. పారిశుద్ధ్య కార్మికులకు జరుగుతున్న నష్టం ఎంతో. చట్టాలు ఉన్నప్పటికీ, కోర్టులు తీర్పులు ఇచ్చినప్పటికీ, వారి పరిస్థితులు మెరుగుపడడం లేదు. జీవితాల్లో వెలుగులు నిండడం లేదు. 1993లోనే మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధిస్తూ మొదటి చట్టం వచ్చింది. తర్వాత 2013లో మరింత కఠినమైన చట్టాన్ని తీసుకొచ్చి మాన్యువల్ స్కావెంజింగ్ ను నేరంగా ప్రకటించారు. పునరావాసానికి కూడా నిబంధనలు రూపొందించారు. అయినప్పటికీ అమలు మాత్రం ఆశించిన స్థాయిలో జరగలేదు. 2023లో కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్' (ఎన్‌ఎఎంఎఎస్‌టిఇ/నమస్తే) పథకాన్ని ప్రారంభించింది. దాదాపు రూ. 350 కోట్లతో యంత్రాల ద్వారా మాత్రమే మురుగు కాలువలను శుభ్రం చేస్తామని ప్రకటించింది. అయితే మూడు సంవత్సరాలు గడిచినా చాలా ప్రాంతా ల్లో యంత్రాల స్థానంలో మనుషులనే ఉపయోగిస్తున్నారని ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు. పథకం లక్ష్యం నెరవేరలేదని, దానిని పునర్వ్యవస్థీకరించాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై సుప్రీంకోర్టు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 2023లో మురుగు కాలువల్లో మరణించిన వారికి పరిహారాన్ని రూ.30 లక్షలకు పెంచింది. 2025లో ఆరు మహానగరాల్లో మాన్యువల్ మురుగు కాలువ శుభ్రపరిచే విధానాన్ని పూర్తిగా నిషేధించాలని ఆదేశించింది. అయినా మరణాలు ఆగకపోవడంతో ఇటీవల పలువురు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. తన ఆదేశాలు అమలు కాకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. అంటే న్యాయవ్యవస్థ కూడా ప్రభుత్వ యంత్రాంగం పనితీరు పై తీవ్ర అసంతృప్తితో ఉందని ఈ పరిణామాలు సూచిస్తున్నా యి.

ఇలాంటి పరిస్థితుల్లో ఎస్‌కెఎ కేవలం పరిహారం మాత్రమే కోరడం లేదు. దేశంలో జరిగిన అన్ని మురుగు మరణాల నిజమైన సంఖ్యను ప్రభుత్వం వెల్లడించాలని, ప్రధానమంత్రి దేశానికి క్షమాపణ చెప్పాలని, మురుగు కాలువల్లో మనుషులను దింపే విధానాన్ని పూర్తిగా నిషేధించాలని, ఈ మరణాలపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరపాలని, కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేస్తున్నది. పారిశుద్ధ్య కార్మికుల మరణాలను కార్మిక భద్రత వైఫల్యం ప్రమాదాలుగా చూడడం సమంజసం కాదు. వాస్తవానికి అవి చట్టాల అమలులోని లోపాలను, కులవివక్ష కొనసాగింపును, పరిపాలనా నిర్లక్ష్యాన్ని, మానవ గౌరవం పట్ల సమాజం చూపుతున్న ఉదాసీనతను బయటపెడుతున్నాయి. ప్రతి మరణం ఒక కుటుంబాన్ని శాశ్వత విషాదంలోకి నెట్టేస్తోంది. అదే సమయంలో రాజ్యాంగం హామీ ఇచ్చిన జీవించే హక్కును ప్రశ్నార్థకం చేస్తోంది. పరిశుభ్రమైన నగరాలు, స్వచ్ఛమైన గ్రామాలు కావాలంటే వాటికోసం పనిచేసే కార్మికుల ప్రాణాలకు ముందు విలువ ఇవ్వాలి. యంత్రాలు అందుబాటులో ఉన్న కాలంలో ఇప్పటికీ మనుషులను విషవాయువులతో నిండిన గుంతల్లోకి దింపడం నాగరిక సమాజానికి తగదు. చట్టాలు చేయడం మాత్రమే సరిపోదు. వాటిని కచ్చితంగా అమలు చేయడం, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం, పూర్తిస్థాయి యాంత్రీకరణ చేపట్టడం, పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడం ద్వారా మాత్రమే ఈ మరణాలకు శాశ్వత ముగింపు పలకగలం. అప్పటివరకు ప్రతి కొత్త మరణం ఒక వ్యక్తి ప్రాణనష్టమే కాదు, భారత రాజ్యాంగం ముందు నిలిచే మరో బాధాకరమైన ప్రశ్నగానే మిగులుతుంది.

ఎస్వీఆర్

# స్మార్ట్‌సిటీతో 2 లక్షల మందికి ఉపాధి

- రూ.15 వేల కోట్ల పెట్టుబడులే లక్ష్యం.. 2028 మార్చి నాటికి పనులు పూర్తి
- 3,245 ఎకరాల్లో పారిశ్రామిక వాడ అభివృద్ధి
- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. 3,245 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక స్మార్ట్ సిటీకి సుమారు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులన్నింటినీ 2028 మార్చి నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ నిర్వహించిన నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్‌బాబు సచివాలయం నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు ఈ సమావేశానికి హాజరయ్యారు. జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ విధానంలో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెహికల్‌కు అభివృద్ధి ప్రణాళికను అందజేసినట్లు వివరించారు.

**నీరు, విద్యుత్ పనులకు వేగం..**

స్మార్ట్ సిటీకి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. నీటి సరఫరా పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, విద్యుత్ సరఫరా పనులను కూడా నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం భవ్య పథకం కింద దేశవ్యాప్తంగా ప్రకటించిన 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల్లో నాలుగింటిని తెలంగాణకు కేటాయించాలని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌ను శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు ఈ పార్కులు దోహదపడతాయని తెలిపారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వానికి భూమి రూపంలో 51 శాతం వాటా ఉందని, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేస్తోందని మంత్రి వివరించారు. పరిశ్రమలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత భారీగా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు రావడంతో జహీరాబాద్ తెలంగాణలో కీలక పారిశ్రామిక కేంద్రంగా ఎదగనుందని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో టిజి2సి ఎండి శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలకు నైపుణ్యాభివృద్ధి కీలకం

- జాబ్ పోర్టల్ యాప్ ప్రారంభించిన మంత్రి వివేక్ వెంకటస్వామి
- నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడమే లక్ష్యమని వెల్లడి



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మెదక్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీసీ పరిశ్రమ సహకారంతో రూపొందించిన జాబ్ పోర్టల్ నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల యాప్‌ను సోమవారం మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఉన్న కాంతా బయోటెక్ పరిశ్రమలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత భవితకు భరోసా కల్పించాలని ఉద్దేశంతో అనేక ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాలకు ఆర్థిక చేయూతనందిస్తుందన్నారు. మెదక్ జిల్లాలో (ఎంఇఎస్‌ఐసి) ఈ పోర్టల్ అనేది విద్యార్థులు, ఉద్యోగార్థులు, నైపుణ్య సంస్థలు స్థానిక పరిశ్రమలను ధృవీకరించబడిన వ్యవస్థపై అనుసంధానించడానికి జిల్లా స్థాయిలో అభివృద్ధి చేయబడిన ఒక డిజిటల్ వేదిక అని తెలిపారు. ఐటిసి లిమిటెడ్ పరిశ్రమ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయబడిన (ఎంఇఎస్‌ఐసి), జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేకమైన, సమీకృత ఉపాధి-నైపుణ్య వేదికను ప్రారంభించిన తెలంగాణలోని తొలి జిల్లాలలో మెదక్‌ను ఒకటిగా నిలబెట్టింది అని అన్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా ఉన్న ఐటిఐలు, పాలిటెక్నిక్‌లు, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల కోసం (ఎంఇఎస్‌ఐసి) అనేది ఒక రెండు దశల (టాస్క్ రిజిస్ట్రేషన్ ప్లాట్‌ఫామ్), ఇది ధృవీకరించబడిన విద్యార్థి ప్రొఫైల్‌లను యజమానులను అవకాశాలతో సరిపోల్చడానికి వీలు కల్పిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి రిజిస్ట్రేషన్ ప్రత్యేక ప్రసారం కాకముందే వారి సంస్థచే ధృవీకరించబడటం నిర్ధారిస్తుంది అని తెలిపారు. అలా కాకుండా మన జిల్లాలోని నిరుద్యోగ యువత వారి నైపుణ్యాలకు అనుగుణంగా ఈ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకుని సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు అన్నారు. ఈ పోర్టల్ ద్వారా అన్ని ఇండస్ట్రీకు లాగిన్ పాస్వర్డ్ ఇస్తున్నామని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిట్యాల మహిపాల్ రెడ్డి, ఎల్లన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు జావెద్ మల్లా రెడ్డి, సర్పంచులు రాజనర్సింహ, రాము యాదవ్, మద్దూరి నవ్య నాగరాజు గౌడ్, పాలకవర్గ సభ్యులు తూప్రాన్ ఆర్డీఓ జయచంద్ర రెడ్డి, ఎమ్మార్వో ఆంజనేయులు, పంచాయతీ సెక్రటరీ ప్రియాంక, ఐల చైర్‌పర్సన్ సుబ్బారావు, ఐటిసి ఆనంద్, ఈడియం సందీప్, నాయకులు పాల్గొన్నారు

# త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు

- వారి ఉపాధికి పూర్తి రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత
- ఛార్జీల పెంపుపై పరిశీలన.. ఆర్‌టిసి ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయదు: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం త్వరలోనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో కార్మికులకు మరింత మేలు చేసేలా త్వరలోనే శుభవార్త చెబుతామని, వారి ఉపాధికి పూర్తి రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో సోమవారం తెలంగాణ కెకెసి యూనియన్ ప్రతినిధులు మంత్రిని కలిసి ఆటో కార్మికుల సమస్యలను వివరించారు. ఆటో కార్మికుల సమస్యలను ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని మంత్రి తెలిపారు. రవాణా శాఖ తరఫున కార్మిక శాఖతో చర్చించి త్వరలో పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఆటో ఛార్జీల పెంపు కోసం కార్మిక సంఘాలు చేస్తున్న విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలిస్తోందని చెప్పారు. 2012లో ఛార్జీలు పెంచిన తర్వాత దాదాపు 14 ఏళ్లుగా పెంపు జరగలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల ధరలు, నిర్వహణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ఆటో కార్మికుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులపై అదనపు భారం పడకుండా అన్ని అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఆర్‌టిసి ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేయదు**

ఆర్‌టిసి ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసి నడుపుతుందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆటో కార్మికుల ఉపాధిని దెబ్బతీసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. లాస్ట్‌మైల్ కనెక్టివిటీని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఆర్‌టిసి, రైల్వే, మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను పరస్పరం అనుసంధానించి ప్రయాణికులకు ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సౌకర్యవంతమైన రవాణా అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రెట్రోఫిట్‌మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చుకునేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించాలని కేబినెట్ నిర్ణయించిందని మంత్రి తెలిపారు.

# ఒబిసి వివరాలపై స్పష్టత ఇవ్వాలి

- బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 2027 జనగణనలో ఓబిసి, ఎస్‌ఇబిసి కులాల వివరాలను కులాల వారీగా నమోదు చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పష్టత ఇవ్వాలని తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సెస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్‌కు సోమవారం లేఖ రాశారు. ఈ నెల 14న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో 2027 జనగణనకు సంబంధించిన 10వ అంశంలో ఎస్‌సి, ఎస్‌టి కులాల ప్రస్తావన మాత్రమే ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఓబిసిల కులాల వారీ జనాభా వివరాలను సేకరిస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో, గెజిట్‌లో దీనిపై స్పష్టమైన ప్రస్తావన లేకపోవడం పలు సందేహాలకు తావిస్తోందన్నారు. నోటిఫికేషన్‌కు సవరణ (కరెండమ్) జారీ చేసి దేశ జనాభా కుల వివరాలను సేకరిస్తామని స్పష్టం చేయాలని కోరారు.

రాష్ట్రాల వారీగా ఓబిసి, ఎస్‌సి జాబితాలను పరిగణనలోకి తీసుకుని మాస్టర్ కులాల డైరెక్టరీ రూపొందించాలని, ప్రతి కులానికి ప్రత్యేక డిజిటల్ కోడ్ కేటాయించాలని సూచించారు. జాబితాలో లేని లేదా వివాదాస్పద కులాల వివరాలను నమోదు చేసి, వాటి ధ్రువీకరణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. వ్యక్తి వెల్లడించిన కుల వివరాలతో పాటు పరిపాలనా వర్గీకరణను కూడా నమోదు చేయాలని కోరారు. 2011 సామాజిక, ఆర్థిక, కుల గణనలో ఓపెన్ ఎండెడ్ విధానం కారణంగా కులాల పేర్లలో అక్షర దోషాలు, స్థానిక పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాల నమోదులో అనేక సమస్యలు తలెత్తాయని నిరంజన్ గుర్తుచేశారు. జనగణన సన్నాహక ప్రక్రియ కొనసాగుతున్నందున కేంద్రం త్వరితగతిన స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఆయన కోరారు.

# సోనియా గాంధీ దేశభక్తిని శంకించడం దుర్మార్గం

- ప్రభుత్వ సలహాదారు హనుమంతరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వందేమాతరం గేయాన్ని దేశ ప్రజలు ఎప్పటి నుంచో పాడుకుంటున్నారని, అలాంటి దేశంలో సోనియా గాంధీ దేశభక్తిని శంకించడం దుర్మార్గమని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను బిజెపి వక్రీకరించి ప్రచారం చేస్తోందన్నారు. దేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే జాతీయ జెండాను ప్రజలు ఎగురవేస్తున్నారని విహెచ్ అన్నారు. దేశంలోని ముస్లింలు సైతం జాతీయ జెండాను గౌరవంగా ఎగురవేస్తారని చెప్పారు. జాతీయ జెండాను అవమానించింది ఆర్‌ఎస్‌ఎస్ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేయలేదని విమర్శించారు. పార్లమెంట్‌కు రావాలని పిలిస్తే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పారిపోయారని విహెచ్ విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆయనకు కుర్చీ వేయాలని సోనియా గాంధీ కోరారని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలను బిజెపి రాజకీయంగా వక్రీకరిస్తోందని విహెచ్ మండిపడ్డారు.

# టిజి–సేఫ్ సేవలు వినియోగించుకోవాలి

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజల భద్రత, రక్షణ, శ్రేయస్సు తదితర ప్రతి అంశానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిచ్చిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. చట్టబద్ధమైన పాలనను స్థాపించడం, దానిని అమలు చేయడం, జవాబుదారీతనాన్ని అందించడం ప్రభుత్వ నిబద్ధత అన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ఒక ట్విట్ చేశారు. ఆహారం, ఔషధాలలో భద్రత, ప్రమాణాలను నిర్ధారించడానికి ఒకే శాఖతో తెలంగాణ ఆహార, నిత్యావసర ఔషధాల ప్రమాణాల ప్రాధికార సంస్థ (టిజి–సేఫ్) అమల్లోకి వస్తున్న సందర్భంగా, సురక్షితమైన తెలంగాణ కోసం పౌరులందరూ దీనిని స్వాగతించి, దీని సేవలను వినియోగించుకోవడంలో తనతో ఏకీభవిస్తారని ఆశిస్తున్నానని సిఎం తన ట్విట్‌లో పేర్కొన్నారు.

# జీతాల పెంపు.. ఎఐటియుసికి రూ.లక్ష నిధి



- సబ్బు రాజమౌళి ఆధ్వర్యంలో నగదు అందజేత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నెలవారీ జీతాల పెంపునకు కృషి చేసిన ఎఐటియుసికి ఉద్యోగుల తరఫున రూ.లక్ష నిధిని అందజేశారు. తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఆధ్వర్యంలో ఈ మొత్తాన్ని యూనియన్‌కు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు చాడ వెంకటరెడ్డి, అధ్యక్షులు విఎస్ బోస్‌కు ఉద్యోగుల తరఫున సబ్బు రాజమౌళి రూ.లక్ష నగదును అందజేశారు. ఉద్యోగుల వేతనాల పెంపు కోసం కృషి చేసిన సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు డాక్టర్ కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి, విఎస్ బోస్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ నాయకులు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులకు సబ్బు రాజమౌళి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి వేతనాల పెంపునకు సహకరించిన నాయకుల కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల కోసం ఏఐటీయూసీతో కలిసి పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సిపిఐ కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో సంక్షోభంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్


**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇస్రోలో పనిచేస్తున్న సుమారు 100 మంది శాస్త్రవేత్తలు ఇటీవల ఒకేసారి రాజీనామా చేయడం దేశ చరిత్రలోనే తొలిసారి అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ అన్నారు. ఈ పరిణామం ప్రభుత్వ విధానాలపై శాస్త్రవేత్తల్లో నెలకొన్న అసంతృప్తికి, ఇస్రో పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశంలో ఇస్రో స్థాపన, అభివృద్ధికి గత ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించాయని ఆయన గుర్తుచేశారు. ఇస్రో అనేక ప్రతిష్టాత్మక ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా దేశ ఖ్యాతిని పెంచిందని, ఈ విజయాల వెనుక శాస్త్రవేత్తల కృషి కీలకమని పేర్కొన్నారు. అయితే ఇస్రోలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం, సంస్థ పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రభావం శాస్త్ర, సాంకేతిక రంగాలపై పడుతోందని ఆరోపించారు. గతంలో సోవియట్ యూనియన్‌తో పాటు పలు సోషలిస్టు దేశాలు అందించిన సహకారంతో భారత్‌లో శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాయని బోస్ అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంతో పాటు రక్షణ రంగంలోనూ దేశం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. ఇస్రో వంటి ప్రతిష్టాత్మక సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇస్రోలో నెలకొన్న సంక్షోభంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో సమగ్ర విచారణ జరిపించాలని బోస్ డిమాండ్ చేశారు. రాజీనామాలకు దారితీసిన కారణాలు, సంస్థలో నెలకొన్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రభావంపై వాస్తవాలను దేశ ప్రజల ముందు ఉంచాలని కోరారు. ఇస్రోతో పాటు దేశంలోని ఇతర కీలక శాస్త్ర, సాంకేతిక సంస్థలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలపై జరుగుతున్న జోక్యాలకు వ్యతిరేకంగా దేశభక్తులు ఐక్యంగా పోరాడాలని బోస్ పిలుపునిచ్చారు.

# పిట్టల శ్రీధర్‌కు అభినందనల వెల్లువ





శ్రీధర్ తీసిన ఫొటో



- ఉత్తమ వార్త ఫోటోగ్రఫీ పోటీలలో రాష్ట్ర స్థాయి బహుమతికి ఎంపిక

**ప్రజాపక్షం/కరీంనగర్ :** 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం (టి.ఎస్. పి.జె.ఏ) నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్త ఫోటోగ్రఫీ పోటీలలో కరీంనగర్ జిల్లా ప్రజాపక్షం ఫోటోగ్రాఫర్ పిట్టల శ్రీధర్‌కు రాష్ట్ర స్థాయి బహుమతికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌ను పలు ప్రజాసంఘాల నాయకులు సోమవారం కరీంనగర్‌లో అభినందించారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. పిట్టల శ్రీధర్ ఫోటోగ్రఫీ పోటీలలో రాష్ట్రస్థాయిలో బహుమతి పొందడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అట్టడుగు ప్రజల జీవితాలను తన కెమెరా ద్వారా వెలుగులోకి తెచ్చి అట్టడుగు వర్గాల పక్షపాతిగా నిలవాలని, మరిన్ని ఉత్తమ చాయా చిత్రాలను తీసి బహుమతులు, అవార్డులు గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ అందె స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బావండ్లపల్లి యుగంధర్, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని తిరుపతి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు బూడిద సదాశివ, ప్రజాపక్షం స్టాఫ్ రిపోర్టర్ సిహెచ్. వెంకటరాజు, టౌన్ రిపోర్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఫోటో జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచడంతోపాటు వారిని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి ఉత్తమ వార్త ఫోటోగ్రఫీ పోటీలు తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం (టి.ఎస్.పి.జె.ఏ) నిర్వహిస్తుంది. ఈ సంవత్సరం కూడా 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ వార్త ఫోటోగ్రఫీ పోటీలు 2026కు మొత్తం రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి దాదాపు 102 ఎంట్రీలు అంటే 306 ఛాయాచిత్రాలు వచ్చాయని, జ్యూరీ సభ్యులైన ప్రముఖ సంపాదకులు దేవులపల్లి అమర్, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఛాయా చిత్రగ్రహకులు, నటుడు కొమ్మిడి విశ్వేందర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఛాయా చిత్రగ్రహకులు కమలా సుధాకర్ రెడ్డిలు వాటిని పరిశీలించి, ఉత్తమ ఛాయాచిత్రాలని ఎంపిక చేసారని తెలంగాణ రాష్ట్ర ఫోటోజర్నలిస్టుల సంఘం అధ్యక్షులు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరిలు హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్, టి.ఎస్.పి.జె.ఏ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం తెలిపారు.

# '22ఎ' సెక్షన్ పేరుతో భూములు నిషేధిత జాబితాలోకి..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో చేర్చి, ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిని కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారని, సిఎంకు సెగ తగిలే సరికే ప్రభుత్వంలో హడావిడి మొదలైందని, స్వయంగా సిఎం పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. డిసెంబర్ 7, 2023 నుంచి ఇప్పటి వరకు నిషేధిత జాబితాలో ఉన్న భూ వివరాలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని, వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఆ ఆస్తులన్నింటినీ 22ఎ పరిధి నుంచి మినహాయించాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు జర్నలిస్టులతో సోమవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎయిర్‌పోర్ట్, ఔటర్‌రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారని, ఇది అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా 22ఎలో పెట్టడం దుర్మార్గమన్నారు. 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఎక్కడికి పోవాలన్నారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారన్నారు. దేశ వ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారని, ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆనాడు సీలింగ్ పరిధి నుంచి క్లియరైన భూములను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో చేర్చడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎన్‌ఒసి జారీ చేసిన భూములకు బ్యాంకులు రుణాలను మంజూరు చేశాయని, ప్రస్తుతం ఆ భూములను కూడా 22ఎలో పెట్టారని, తద్వారా ప్రజలు, బ్యాంకులు ఇద్దరూ ఆగమవుతున్నారన్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను కూడా ప్రొహిబిషన్‌లో పెట్టారన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ఎ నుంచి భూమిని మినహాయించాలన్నా, 30 శాతం కమీషన్ ఇవ్వాలనేది బహిరంగ రహస్యమన్నారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో చేర్చి, ఆ తర్వాత దానిని సరిచేసేందుకు జిఒలు తీసుకొస్తామని, సమీక్షలు చేస్తామంటూ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందన్నారు.

# ప్రవేశాలలో మార్గదర్శకాలను పాటించండి

- ఉన్నత విద్యామండలికి టిజిహెచ్‌ఆర్‌సి సిఫార్సు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంజినీరింగ్ కళాశాలల్లో కేటగిరీ బీ (మేనేజ్‌మెంట్/ఎన్‌ఆర్‌ఐ) సీట్ల ప్రవేశాలకు సంబంధించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టిజిహెచ్‌ఆర్‌సి) స్పష్టం చేసింది. అర్హులైన విద్యార్థులకు పారదర్శంగా, నిష్పక్షపాతంగా, సమాన అవకాశాలను కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి (టిఎస్‌సిహెచ్‌ఇ) సిఫార్సు చేసింది. ఈ మేరకు కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ ఉత్తర్వులను జారీ చేసింది. 2021–22 విద్యా సంవత్సరానికిగాను ధూలపల్లి సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాల, శంషాబాద్ వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో కేటగిరీ బీ ప్రవేశాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఉస్మానియా యూనివర్సిటీ జెఎసి నాయకులు పాలడుగు శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ, అర్హులైన విద్యార్థులకు దరఖాస్తులు సమర్పించేందుకు సముచిత అవకాశం కల్పించలేదని, నిర్దేశిత ప్రవేశ విధానాన్ని సక్రమంగా పాటించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్ విచారణ చేపట్టింది. ఈ రెండు కళాశాలలు సెప్టెంబర్ 18, 2021న మూడు దిన పత్రికల్లో నోటిఫికేషన్లు జారీ చేసి, నిర్దేశిత మార్గదర్శకాలు, షెడ్యూల్ ప్రకారం ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేసినట్టు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (టిఎస్‌సిహెచ్‌ఇ) కార్యదర్శి నివేదికను సమర్పించారు. ఫిర్యాదుదారు ఈ నివేదికను వ్యతిరేకిస్తూ పలు పత్రాలను సమర్పించారు. వీటిని పరిశీలించిన కమిషన్ కేటగిరీ బీ ప్రవేశాలకు సంబంధించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, ఏకపక్ష లేదా అనధికారిక విధానాలను అనుసరించకుండా, సమాన అవకాశాలను నిర్ధారించాలని టిఎస్‌సిహెచ్‌ఇకి సిఫార్సు చేసింది.


తెలంగాణ ప్రభుత్వం
**రోడ్లు మరియు భవనాల శాఖ**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

జిల్లా రోడ్లు & భవనాల శాఖ అధికారి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్), నాగర్‌కర్నూల్ జిల్లా: NIT సంక్షిప్త టెండర్ నోటీసు నం. EE/R&B/NGKL/AM/3no.s/2026-27, తేదీ: 12.08.2026

1. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1 (ఒక) పనికి సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించచమైనవి (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) NGKL వారి నోటీసు నం. EE/R&B/NGKL/AM/3no.s/2026-27/ , తేదీ: 12.08.2026 ప్రకారం).
2. టెండర్ దరఖాస్తుదారులు https://tender.telanagana.gov.in అనే ఇ-మార్కెట్ ప్లేస్ నుండి 20.08.2026 ఉదయం 11.00 గంటల నుండి టెండర్ షెడ్యూళ్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్లను సమర్పించడానికి చివరి తేదీ మరియు సమయం: 27.08.2026 సాయంత్రం 3.30 గంటల వరకు.

మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telanagana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) డివిజన్: నాగర్‌కర్నూల్.
DIPR R.O. No. : 8039-PP/CL/ADVT/2026-27, Date: 17-08-2026

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
**జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్ కార్యాలయం**
పి.ఐ.యు డివిజన్, జనగామ.

టెండర్ నోటీసు నెంబర్. NIT. No. 2/D3/SDF-2025-26, MPLADS-2026-27, CDP -2022-23 & CDP-2023-2024, Dt: 17.08.2026.
(7) పనులు రిజిస్టర్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానిచడమైనది.

1. పనుల సంఖ్య : 6 పనులు (మూడవ పిలుపు), 1 పని (మొదటి పిలుపు)
2. అంచనా విలువ : రూ.70.00 లక్షలు
3. టెండర్ ప్రారంభ తేది : 22.08.2026 ఉదయం 10.30 గంటల
4. టెండర్ ముగింపు తేది : 31.08.2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు
5. మొదటి పిలుపు టెండర్ ముగింపు తేదీ : 10.09.2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు

మరిన్ని వివరాల కొరకు www.tenders.telangana.gov.in వెబ్‌సైట్‌లో పనుల పూర్తి వివరములు కలవు, ఈ కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శించబడిన టెండర్ నోటీసు లోని ఏదయినా వివరణ కొరకు సంబంధిత అధికారి ఫోన్ నెంబర్: 9948526286 కు సంప్రదించవలెను.

సం/- జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్, పి.ఐ.యు డివిజన్, జనగామ
DIPR R.O. No. : 8059-PP/CL/ADVT/2026-27, Date: 17-08-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25-సంతోష్‌నగర్, చార్మినార్ జోన్.

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | కార్యాలయం పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 11/EE-25/ CRZ/ GHMC/2026-27 | క్ర.సం. 01 నుండి 02 వరకు | రూ. 1.34 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 18.08.2026 ఉ.10.30గం.లకు<br>బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 21.08.2026 మ.03.00గం.ల వరకు | శ్రీ ఆర్.యాదగిరి, ఇఇ, సర్కిల్-25, చార్మినార్ జోన్ మస్కతి గ్రౌండ్, దరబ్ జంగ్ కాలనీ, సంతోష్ నగర్, హైదరాబాద్. ఫోన్ నెం. 9030478364 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25-సంతోష్‌నగర్, సిఆర్‌జెడ్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
DIPR R.O. No. : 8091-PP/CL/ADVT/2026-27, Date: 17-08-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 21/ SE/MKJZ/ MMC/2026-27, 27, Date: 17.08.2026 | ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్ పరిధిలోని కీసర సర్కిల్‌లో కీసర సర్కిల్ కార్యాలయం, యానిమల్ కేర్ సెంటర్, RCC వరద నీటి కాలువ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సంబంధించి DPR (డిజైన్లు, ప్రణాళికలు, అంచనాలు, 3D వాక్-త్రూ, BoQలు మరియు టెండర్ పత్రాలతో సహా) తయారీ మరియు నిర్మాణ పర్యవేక్షణ కోసం కన్సల్టెంట్‌ను నియమించే నిమిత్తం ప్రతిపాదనల ఆహ్వానం (RFP). | RFP బిడ్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం | 18.08.2026 మ.12.30 గం.లకు | సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. సెల్ నెం. 9154796465, 8008066855 |
| | | బిడ్ సమర్పణకు ఆఖరి తేది | 25.08.2026 మ.12.30 గం.ల వరకు | |

సంప్రదించవలసిన అధికారి చిరునామా: సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎంకెజెజెడ్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.inలో చూడవచ్చు.
కాపీ సమర్పించబడినది: 1. చీఫ్ ఇంజనీర్-M, MMC (సమాచారం కోసం).

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 8068-PP/CL/ADVT/2026-27, Date: 17-08-2026



## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

● మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, వాష్ రూమ్ సౌకర్యాలు మెరుగుపరచాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ టౌన్ అధ్యక్షుడు కేతా సంతోష్ డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, తయారీ, పంపిణీలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. బాలురకు సరైన వాష్‌రూమ్ సౌకర్యాలు కల్పించి, నీటి వసతి మెరుగుపరచాలని సూచించారు. పాఠశాలలో సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రమైన తరగతి గదులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. విద్యుత్, ఫ్యాన్లు, బెంచీలు, విద్యా సామాగ్రి వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. విద్యార్థుల సమస్యలపై ప్రధానోపాధ్యాయులు రామ్‌జీకు వినతిపత్రం అందజేశారు. సమస్యలను పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రధానోపాధ్యాయులు హామీ ఇచ్చారు. విద్యార్థుల హక్కులు, విద్యా సమస్యల పరిష్కారం కోసం ఎఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని సంతోష్ తెలిపారు. ఎఐఎస్ఎఫ్ సభ్యులు గణేష్, ఆకాష్, జగన్, ఉదయ్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజావాణి



**ప్రజాపక్షం/కృష్ణ :** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీఓ కిషోర్ కుమార్ తెలిపారు. సోమవారం కృష్ణ మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో కిషోర్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, మండల విద్యాధికారి నిజముద్దీన్, వ్యవసాయ శాఖ అధికారి సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ శాఖల నుంచి 28 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో గ్రామ పంచాయతీ శాఖకు 14, విద్యాశాఖకు, 6 రెవెన్యూకు, 5 విద్యుత్ శాఖకు, 1, హౌసింగ్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని సమస్యలను పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కిషోర్ కుమార్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి 24 ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా, 17 మంది హాజరవ్వగా, 7 మంది గైహాజరైయ్యారు. ప్రజావాణికి కార్యక్రమానికి కొంతమంది అధికారలు హాజరు కాకపోవడంపై ఎంపీడీఓ స్పందించారు. విధులకు గైర్హాజరైన అధికారుల వివరాలను జిల్లా కలెక్టర్ సమాచారం వంటి ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధికారులు బాధ్యతగా స్పందించాలి

● మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/పెబ్బేరు :** ప్రజల సమస్యలకు అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కారం చూపాలని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. నూతనంగా ప్రారంభమైన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులను సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు అందించే ప్రతి వినతిపత్రాన్ని అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సమస్య తీవ్రత, ప్రజల అవసరాలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాంరెడ్డి, కొంతం దయాకర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ గౌడ్, మోతే రాములు, సత్యనారాయణ, రాములు యాదవ్, యుగంధర్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసరమైతే 112కు కాల్ చేయండి

● టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం జాతీయ టోల్‌ఫ్రీ నంబర్ 112 ను సద్వినియోగం చేసుకోవాలని టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. 112 నంబర్‌పై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమవారం నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అత్యవసర పోలీస్ సేవల కోసం గతంలో వినియోగించిన డయల్ 100కు బదులుగా ప్రస్తుతం 112 జాతీయ అత్యవసర సేవల నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఈ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రమాదాలు, నేర సంఘటనలు, మహిళలు బాలికల భద్రతకు ముప్పు ఏర్పడినప్పుడు అలాగే ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ప్రమాదం ఉన్న సందర్భాల్లో ఆలస్యం చేయకుండా 112 కు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ, కృష్ణ, చైతన్య, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండలంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఎంపీడీవో నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ ఆ ఫిర్యాదుల ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. మండలస్థాయి అధికారులు అంతా నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులు బాధితులు నుంచి తీసుకున్న ప్రతి దరఖాస్తులు ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి దరఖాస్తుదారుడికి ప్రత్యేక గ్రీవెన్స్ ఐడి రసీదును ఇచ్చారు. పోర్టల్ నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనా తక్షణమే పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం జిల్లాల వారీగా హెల్ప్ డెస్క్ అసిస్టెంట్లను నియమించింది. శ్రీరంగాపురం మండలంలో మొత్తం 7 దరఖాస్తులు, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ రెండు దరఖాస్తులు, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

● ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు : కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి, వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కరించిన వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తమ శాఖ పరిధిలో లేని ఫిర్యాదులను సంబంధిత శాఖకు పంపించి, ఆ విషయాన్ని సాధ్యం కాని సమస్యలను నిబంధనల ప్రకారం స్పష్టంగా వివరించాలని సూచించారు. పెండింగులో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి ప్రజావాణిలో 36 దరఖాస్తులు, 20 మండలాల్లో నిర్వహించిన ప్రజావాణిలో 103 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ పాండు, ఏఓ చంద్రశేఖర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో 13 ఫిర్యాదులు స్వీకరణ**

నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఫిర్యాదుదారులు నుంచి 13 అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అందిన ఫిర్యాదుల్లో భూమికి సంబందించి అధికారులకు సూచనలు చేశారు. ప్రజల సమస్యలను చట్టప్రకారం పరిష్కరిస్తూ పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తుందని అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.



## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 15 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్‌ఓ రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నాగుల పంచమి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/మక్తల్ :** నాగుల పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మక్తల్ పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం సమీపంలోని నాగుల పుట్ట వద్దకు సోమవారం ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పంచమి సందర్భంగా నాగుల పుట్టకు మహిళలు భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే పుట్ట వద్దకు చేరుకున్న భక్తులు నాగుల పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి పాలాభిషేకాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ప్రత్యేక పూజలు చేసి తమ కుటుంబాలు సుఖసంతోషాతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నాగేంద్రస్వామిని వేడుకున్నారు. శ్రావణ తొలి సోమవారం, నాగుల పంచమి ఒకే సారి రావడంతో పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం శ్రీ రేణుల ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తూ తీర్థ ప్రసాదాలను అందించారు.

## కుల వివక్షకు తావు లేకుండా రాజ్యాంగ విలువలు కాపాడాలి

● ఖర్గేకు జరిగిన అవమానంపై ఆగ్రహం.. సమగ్ర విచారణకు డిమాండ్

**ప్రజాపక్షం/నారాయణపేట :** రాజ్యాంగం కల్పించిన సమానత్వ విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలని డీసీసీ అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగిన ఘటనను నిరసిస్తూ ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సత్యాగ్రహ మహాధర్నా నిర్వహించారు. సీవీఆర్ భవన్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా అంబేద్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించిన అనంతరం అక్కడే సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభ అనంతరం సభా ప్రాంగణాన్ని శుద్ధీకరణ పేరుతో గంగాజలంతో శుభ్రం చేయడం కుల వివక్షకు సంబంధించిన ఆలోచనలకు తావిచ్చే చర్యగా కనిపిస్తోందన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం నిషేధించినప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. ఖర్గేకు జరిగిన అవమానం ఒక్క వ్యక్తికి జరిగింది.



కాదని, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి ఒక్కరికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ప్రశాంత్ కుమార్ రెడ్డి సూచించారు. బీఎల్ఏలపైన మొత్తం బాధ్యత వేయకుండా ప్రతి కాంగ్రెస్ నాయకుడు ఓటర్ల జాబితా పరిశీలనలో భాగస్వామి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు , జిల్లా, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల అద్యక్షులు, కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



● ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ప్రజాపక్షం/వంగూరు :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటూ అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా.మల్లు రవి, ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రంగాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తుందని వారు పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న ఎరువులను విత్తనాలను సద్వినియోగం చేసుకుని రైతుల అభివృద్ధి చెందాలని వారు పేర్కొన్నారు. ప్రజా పాలనలో మండలంలోని ప్రతి గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తానని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం జిల్లా అధికారి రాజా వర్దన్ రావు, సర్పంచు క్యామ మల్లయ్య, వైస్ చైర్మన్ బాలస్వామి, సీఈఓ విష్ణుమూర్తి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, ఏవో ప్రియదర్శిని సింగిల్ విండో డైరెక్టర్లు శంకర్ యాదవ్, ఆంజనేయులు, రాజా రంగారావుపాల్గొన్నారు.



## మండలాల్లో ప్రజావాణికి శ్రీకారం

● ప్రజల సమస్యలకు మండలంలోనే పరిష్కారం అధికారులకు కలెక్టర్ ప్రియాంక ఆదేశం

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మండల స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి నారాయణపేట్ జిల్లాలో సోమవారం శ్రీకారం చుట్టారు. నారాయణపేట్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి ప్రజావాణిని జిల్లా కలెక్టర్ సి.హెచ్ ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలు, వినతులతో కూడిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా మండల స్థాయిలో ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కొత్త ఫించన్ల కోసం వచ్చిన దరఖాస్తులపై కలెక్టర్ ఆరా తీశారు. దరఖాస్తుల వివరాలను కంప్యూటర్ ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ కార్యకలాపాలను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్ర, కృష్ణ, ఎంపీడీవో విజయలక్ష్మి , ఎంఈఓ బాలాజీతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా బంగారు మైసమ్మ బోనాలు

● అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** గ్రామంలో శ్రీశ్రీ బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలంతా ఐక్యంగా, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కల్వకుర్తి 100 పడకల ఆసుపత్రి పనులు వేగవంతం**


పట్టణంలో నిర్మాణంలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, అవసరమైన చోట సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. ఆసుపత్రి అందుబాటులో వస్తే నియోజకవర్గం ప్రజలకు అత్యవసర, నాణ్యమైన వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## కోటిలింగేశ్వర దేవస్థానంలో పూజలు

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయిపల్లి స్టేజి దగ్గర సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వర దత్తదేవస్థానము సోమవారం శ్రావణమాసం తొలిసోమవారం నాగపంచమి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు తెల్లవారుజామునుంచే దేవాలయానికి చేరుకొని శ్రీకోటిలింగేశ్వరస్వామి వారిని, స్వర్ణ కవచ పంచలోహ శివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి అక్కడే వున్న నాగదేవతలకు పాలు పోసి నైవేద్యాలు సమర్పించి మహామంగళహారతి సమర్పించడం జరిగింది.

# సంక్షేమాన్ని విస్మరించి పథకాలను ఎగ్గొట్టడమే



● మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి



**ప్రజాపక్షం/పానుగల్ :** కాంగ్రెస్ నాయకులు గొప్పగా చెప్పుకుంటున్న ప్రజా పాలన ప్రజా దగా పాలనగా మారిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం పానుగల్ మండలంలోని దవాజీపల్లి, పానుగల్, బండపల్లి, కేతేపల్లి గ్రామాలలో ఉన్న కెఎల్ఐ, బీమా సాగునీటి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పతకాలను ఎగ్గొటడమేనా ప్రజా ప్రభుత్వ పాలన అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీర సాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జ్యోతినందన్ రెడ్డి, వెంకటయ్య నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు రోడ్డ కృష్ణ, పార్వతి సురేష్, ప్రవీణ్, కోట్ల రాముడు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామాల బిఆర్ఎస్ పార్టీ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దామరగిద్ద :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాలను రద్దు చేసే ఆలోచనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో దామరగిద్ద మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి.సుభాష్, సీనియర్ నాయకులు వెంకట రెడ్డి, నింగం గోపాల్, సండపొల్ల లాలప్ప, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాల అమలును నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలో నిరసనలు చేపట్టారు. బీఆర్ఎస్ నారాయణపేట్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట్ పట్టణంతో పాటు కోయిలకొండ, మరికల్, ధన్వాడ, దామరగిద్ద, మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నాలు నిర్వహించారు. నారాయణపేటతో పాటు ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించిన ధర్నాల్లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**ప్రజాపక్షం/పానుగల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి , షాదిముబారక్, రైతు బీమా పథకాలను ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తుండటంతో అందుకు నిరసనగా పానుగల్ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తాహసీల్దార్ కార్తీక్ రావుకు, ఎంపీడీవో గోవిందరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెబ్బేటి వీర సాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జ్యోతినందన్ రెడ్డి, వెంకటయ్య నాయుడు, భాస్కర్ రెడ్డి, తిలకేశ్ గౌడ్, రాజేష్ రెడ్డి, బాలవర్ధన్ రెడ్డి, దశరథ్ నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు రోడ్డ కృష్ణ, పార్వతి, సురేష్ ప్రవీణ్, కోట్ల రాముడు, మాజీ ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామాల బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తున్న కళ్యాణలక్ష్మి , షాదీముబారక్ సంక్షేమ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయొద్దని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం వీపనగండ్ల మండల కేంద్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని, పెండింగ్ దరఖాస్తులను వెంటనే నిధులు విడుదల చేయాలని, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వేణు మాధవరెడ్డి, జొల్లు నారాయణ, ముంత శివ, గడల లక్ష్మ ణ్, విష్ణు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** తెలంగాణలో పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచిన కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలను పూర్తి ఎత్తేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు కుట్రలకు పాల్పడుతోందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, గద్వాల జిల్లా కేంద్రంలో మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ నేతృత్వంలో గులాబీ దండు ఉవ్వెత్తున ఉద్యమించింది. కాంగ్రెస్ ప్రభుత్వ ద్రోహపూరిత వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి పాత బస్టాండు కూడలి వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించారు. అనంతరం అక్కడ నుండి ఆర్టీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లి నిరసన తెలపడమే కాకుండా, న్యాయపు తాహసీల్దార్ శివ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల కింద రూపాయి వదలకుండా మళ్లీ పంపిణీ చేసే వరకు బిఆర్ఎస్ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ నిరసన సభలో కౌన్సిలర్లు చిత్తరి మంజుల రాణి కిరణ్, కమ్మరి సునీత రాము, లత రామకృష్ణ, గువ్వల గోపాల్, చంటన్న, మోహన్ యాదవ్, నరసింహులు, కోటేష్, జి.రాఘవేంద్ర రెడ్డి, బీచుపల్లి శ్రీనివాస్ గౌడ్, అల్లపాడు ప్రతాప్, వెంకటేష్ నాయుడు, బాసు గోపాల్, శ్రీకాంత్, రాజునాయుడు, శేఖర్, యు.తిరుమలేష్, గోవిందు, రాముడు, తిరుమల, మాలిక్, అరవింద్‌లతో పాటు వివిధ మండలాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ తీరును ఎండగట్టారు.



## శాస్త్రీయంగా, పారదర్శకంగా కేసుల దర్యాప్తు : ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేర నియంత్రణకు సమర్థవంతంగా పనిచేయడంతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పోలీస్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో నేర నియంత్రణ,పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నేరాల నివారణకు చేపడుతున్న చర్యలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై జిల్లా ఎస్‌పి పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరును, కేసుల దర్యాప్తు పురోగతిని సమగ్రంగా సమీక్షించాలన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిందితులకు శిక్ష పడే విధంగా పక్కా ఆధారాలు సేకరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, కేసుల పరిష్కారంలో నాణ్యతతో పాటు నిర్ణీత కాలపరిమితిని తప్పనిసరిగా పాటించాలన్నారు.కేసుల దర్యాప్తును మరింత శాస్త్రీయంగా,పారదర్శకంగా, సమర్థవంతంగా చేపట్టేందుకు ఈసాక్ష్య యాప్ ను ప్రతి దర్యాప్తు అధికారి తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రమేష్, డీఎస్‌పిలు మల్లారెడ్డి, శ్రీనివాస్ రావు, రవి కుమార్, లక్ష్మి నారాయణ, సీఐలు, ఎస్ఐలు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలల్లో నకిలీ సర్టిఫికెట్లపై విచారణకు ఆదేశం

సమాచారం ఇవ్వనందుకు డిఎస్ఇ అధికారికి కమిషన్ సమన్లు

**ప్రజాపక్షం/ మర్రిగూడ** :రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదర్శ పాఠశాలల్లో కొంత మంది ప్రిన్సిపల్స్ నకిలీ సర్టిఫికెట్లతో విధులు నిర్వర్తిస్తున్నారనే సమాచారంతో పీఆర్ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ చైర్మన్ చేల్లం పాండురంగారావు సమాచార హక్కు చట్టం 2005 కింద దరఖాస్తు చేశారు.ఈ సందర్భంగా పాండురంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ శాఖలో అయినా నకిలీ పత్రాలు,అభివృద్ధి నిధుల అవినీతికి సంబంధించిన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ప్రకారం తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనన్నారు. కొన్ని ఆదర్శ పాఠశాలల్లో విద్యా వాలంటీర్ల నియామకాల్లో కూడా సరైన విద్యార్హతలు లేకుండానే నియమించినట్లు ఆరోపించారు.సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయకుండా అధికారులు సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ అంశంపై స్పందించి చర్యలు చేపడుతున్నందుకు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ కు కృతజ్ఞతలు తెలిపారు. "మేము చేసిన దరఖాస్తు వల్ల నకిలీ పత్రాలు సమర్పించిన వారికి తప్ప మిగిలిన వారికి ఎలాంటి అన్యాయం జరగదు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న లోటుపాట్లను వెలికితీసేందుకే ఈ ప్రయత్నం అని స్పష్టం చేశారు.

## ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను అధికారులు ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలన్నారు. మండల సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ప్రజావాణిలో మొత్తం 95 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సిఈఓ శిరీష, డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, డిఇఓ అశోక్, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పత్తి,వరి,కూరగాయల పంటలపై సలహాలు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో ఆగస్టు 17న వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రంకంపాసాగర్ శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శనలు నిర్వహించారు.ఈ సందర్శనలో వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.అనిల్ కుమార్,డాక్టర్ వి. శ్రీధర్, ఉద్యాన శాస్త్రవేత్త టి.హేమబిందు,చిట్యాల ఉద్యాన అధికారి శైలజ,హెచ్ఈఓ రహీం,ఏఈఓ లు పాల్గొన్నారు.బ్రాహ్మణపల్లెం,ఔరవాణి గ్రామాల్లో పత్తి, వరి పంటలను పరిశీలించారు. పత్తిలో సూక్ష్మ పోషక లోపాలు, వేరుకుళ్లు తెగులు, రసం పీల్చే పురుగుల నివారణ చర్యలపై రైతులకు వివరించారు.శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడుతూ వరి, కూరగాయల పంటల్లో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. తడి, పొడి కాలానికి అనుగుణంగా సాగు చేయాలని సూచించారు.

## హాలియాలో రెండు తలల దూడ



**ప్రజాపక్షం / హాలియా:** మండలంలోని ఇబ్రహీంపేట గ్రామపంచాయతీ పరిధి అలీనగర్ కు చెందిన రైతు మహ్మద్ గేదె అరుదైన రెండు తలల దూడకు జన్మనిచ్చింది.ఆదివారం రాత్రి ఈనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న గేదెను చూసిన రైతు మహ్మద్ వెంటనే జూనియర్ వెటర్నరీ అధికారి హమీద్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారి హమీద్ గేదెను పరీక్షించి వైద్యం అందించారు. నొప్పులతో ఉన్న గేదెకు ప్రసవం చేయించగా రెండు తలలు, నాలుగు కళ్లు, రెండు నోర్లు ఉన్న దూడ జన్మించినట్లు జేవీఓ హమీద్ తెలిపారు.అరుదైన ఈ ఘటనతో గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. దూడను చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. తల్లి గేదె, దూడ రెండూ క్షేమంగా ఉన్నాయని వెటర్నరీ అధికారి చెప్పారు.

## నల్లగొండ జిల్లాలో 13.57 లక్షల ఓటర్లు

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ముసాయిదా జాబితా విడుదల



**ప్రజాపక్షం/నల్లగొండ:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా 2026 జనవరి 1 ను అర్హత తేదీగా తీసుకుని రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది.జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 13,57,618 మంది సాధారణ ఓటర్లు ఉన్నట్లు ముసాయిదా జాబితా వెల్లడించింది. వీరిలో 6,73,058 మంది పురుషులు,6,84,488 మంది మహిళలు,72 మంది ఇతరులు ఉన్నారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు:దేవరకొండ: 2,32,283 నాగార్జునసాగర్ 2,13,408 మిర్యాలగూడ: 2,09,162 నల్లగొండ 2,17,681,మునుగోడు 2,46,722 నకిరేకల్ 2,38,362 అదేవిధంగా జిల్లాలో 542 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. వీరిలో 515 మంది పురుషులు, 27 మంది మహిళలు ఉన్నారు. ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు తుది జాబితా విడుదల,అక్టోబర్ 19, 2026ఓటర్ల పేర్లకు సంబంధించి గైర్హాజరు,ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు,మరణించిన వారు,ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు నమోదైన వారి వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా సంబంధిత ఎన్నికల అధికారుల కార్యాలయాలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించినట్లు అధికారులు తెలిపారు.ఇంటింటి పరిశీలన వివరాలు ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి జిల్లాలో 15,16,253 మంది ఓటర్ల వివరాలను ఇంటింటి పరిశీలన ద్వారా సేకరించగా, 13,57,607 మంది ఓటర్ల వివరాలు ధ్రువీకరించబడ్డాయి.ఇంటింటి పరిశీలనలో గుర్తించ లేని ఓటర్లు 1,58,635 మంది ఉన్నారు. వీరిలో మరణించినవారు 32,517, శాశ్వతంగా తరలి వెళ్లినవారు 1,00,144, ఇతర చోట్ల నమోదైన వారు 18,834, గైర్హాజరైనవారు 6,978, ఇతర కారణాలు 162 మంది ఉన్నారు.ప్రజలు ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి తమ పేరు, వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే నిర్ణీత గడువులో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## కుటుంబ కలహం....తండ్రి చేతిలో కుమారుడు మృతి



**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం బుడ్డోనితండా గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్‌నాయక్ తండాలో ఆదివారం రాత్రి విషాద ఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహం నేపథ్యంలో తండ్రి చేతిలో 32 ఏళ్ల కుమారుడు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వెంటక్‌నాయక్ తండాకు చెందిన నేనావత్ మకట్‌లాల్ ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి తల్లిదండ్రులతో గొడవకు దిగాడు. తల్లితో వాగ్వాదం చేస్తుండగా తండ్రి లస్కర్, చిన్న కుమారుడు జవహర్‌లాల్‌లు కలుగజేసుకొని గొడవ చేయవద్దని మకట్‌లాల్‌తో వారించారు అయినప్పటికి మకట్‌లాల్ తల్లితో వాగ్వాదం చేస్తుండడంతో ఆగ్రహానికి లోనైన తండ్రి లస్కర్ ఇంట్లో ఉన్న గొడ్డలితో మకట్‌లాల్ తలపై దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలైన మకట్‌లాల్ అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఉదయం గ్రామస్తులు స్థానిక చందంపేట పోలీసులకు సమాచారం అందించడంతో చందంపేట ఎస్ఐ లోకేష్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు, స్థానికులను ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కుటుంబ కలహాలే హత్యకు దారి తీశాయని ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనతో వెంటక్‌నాయక్‌తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ కలహాలతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, సమస్యలను పరస్పరం మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని స్థానికులు తెలిపారు.

## పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కారం



ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ప్రజావాణిలో వచ్చిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారులు బాధ్యతతో, చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు.ఈ సోమవారం నుంచి మండల స్థాయిలో ప్రజావాణి ప్రారంభమైనందున జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా మండల ప్రజావాణికి హాజరై ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలన్నారు.ఇరిగేషన్ శాఖ దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించి,పెండింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని తెలిపారు.ప్రతి అధికారి వారానికొకసారి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించాలని సూచించారు.ఈ సోమవారం మొత్తం 146 దరఖాస్తులు అందగా రెవెన్యూ శాఖకు 82 ఇతర శాఖలకు 64 దరఖాస్తులు వచ్చాయి.జిల్లా స్థాయి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి పి.డి. శేఖర్ రెడ్డి తో పాటు జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



### దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 102 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 66, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్స్ 6, స్పెషల్ డిప్యూటీ యూనిట్ 4, గ్రామీణ అభివృద్ధి శాఖ 3, ఎస్సీ డెవలప్మెంట్ 2, ఇరిగేషన్ 2, హౌసింగ్ 2, విద్యాశాఖ 2, డిఎల్పిఓ 2, బీసీ సంక్షేమం, వైద్య ఆరోగ్య, చేనేత మరియు జౌళి, ఉపాధి కల్పన, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా పరిషత్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్, కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి పాల్గొన్నారు.

## కలెక్టర్ సంతకం ఫోర్జరీ

కోటక్ మహీంద్రా బ్యాంక్ మేనేజర్ అరెస్ట్

**ప్రజాపక్షం/చివ్వెంల** : సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంతకం ఫోర్జరీ జరిగింది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కోటక్ మహీంద్రా బ్యాంక్ మేనేజర్ కోదూరు రఘు ప్రసాద్ చేశారు. డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, జిల్లా కలెక్టర్ పేరిట ఉన్న జాయింట్ బ్యాంక్ ఖాతాకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో ఈ సంతకం ఫోర్జరీ చేసినట్లు సమాచారం. బ్యాంక్ ఖాతా కెవైసి కోసం డిఆర్‌డిఏ పిడితో సంతకం పెట్టించుకున్న బ్యాంక్ అధికారులు, కలెక్టర్‌తో సంతకం పెట్టించుకోవాల్సి ఉండగా వారే కెవైసి ఫామ్ పై సంతకం చేసి రౌండ్ సీల్ కోసం కలెక్టర్ ఛాంబర్‌లోని అటెండర్ వద్దకు వెళ్ళినట్లు తెలిసింది. అక్కడ ఉన్న అటెండర్ ఆ సంతకం సార్ చేశారా అని బ్యాంకు వారిని అడుగగా వారే చేశారని చెప్పారు. తమ కలెక్టర్ గ్రీన్ పెన్ను కాకుండా ఇతర కలర్ పెన్నుతో బ్యాంక్ సంతకాలు చేస్తారని తెలిసిన ఆయన దీనిపై అనుమానం వచ్చి కలెక్టర్ గన్‌మెన్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఈ విషయం చేరవేయగా పిడి సన్యాసయ్యను అడుగగా తాను బ్యాంక్ వారు వస్తే కెవైసికి సంతకం చేశానని నేను చేశానా అన్న విషయం వారు చెప్పారని వివరణ కోరగా వారు చేశారని చెప్పడం జరిగిందని తెలియజేయడంతో తన సంతకం ఫోర్జరీకి గురైందని గుర్తించారు. దీంతో సదరు బ్యాంక్ మేనేజర్ కోదూరు రఘు ప్రసాద్, బ్యాంక్ సిబ్బందిని తన కార్యాలయానికి పిలుచుకొని వివరణ కోరగా వాస్తవమేనని అంగీకరించడంతో దీనిని తీవ్రంగా పరిగణించి చివ్వెంల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బ్యాంక్ మేనేజర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది. కానీ దీనిపై పోలీసులు అధికారికంగా వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.

## అవినీతి రహిత సమాజం కోసం యువత పోరాటం



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : సమాజంలో పెచ్చరిల్లుతున్న అవినీతి,దోపిడికి వ్యతిరేకంగా యువత పోరాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి అన్నారు.సెప్టెంబర్8 నుండి 10వ తేది వరకు యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వమహాసభల వాల్ పోస్టర్‌ను యువజన సంఘం నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో విద్య,వైద్య దోపిడి విచ్చలవిడిగా జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు.ఉద్యోగాల కల్పన కోసం తెచ్చుకున్న రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడం నిరుద్యోగులను మోసం చేయడమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్,మండల అధ్యక్షుడు గుండెబోయిన భాస్కర్,కార్యదర్శి బరిగెల వేణు,నాయకులు ఉడుత రాజు,బత్తుల సాయితేజ,భాను, సిపిఐ నాయకులు ఉడుత రామలింగం,బద్దుల సుధాకర్,టంగుటూరి రాములు పాల్గొన్నారు.

## కోదాడలో గంజాయి ముఠా గుట్టురట్టు



1.2కిలలో గంజాయి స్వాధీనం-ఏడుగురు అరెస్టు

డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం శివారులో గంజాయి విక్రయానికి యత్నిస్తున్న ఏడుగురిని కోదాడ టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి 1.2 కిలోల గంజాయి, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీరంగాపురం శివారులోని మామిడితోట వద్ద పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఉదయం సమయంలో పది మంది వ్యక్తులు నాలుగు ద్విచక్ర వాహనాలపై అక్కడికి చేరుకున్నారు. గంజాయితో కూడిన బ్యాగును తీసుకొచ్చి విక్రయించే విషయమై చర్చిస్తుండగా పోలీసులు దాడి చేశారు. పోలీసులను గమనించిన ముగ్గురు అక్కడి నుండి తప్పించుకున్నారని మిగిలిని ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించిందన్నారు. గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయించేందుకు సమాయత్తమైనట్లు పేర్కొన్నారు. విచారణలో నిందితులు ఆంధ్రప్రదేశ్, ఒడిసా సరిహద్దు ప్రాంత నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి కోదాడ, మేళ్లచెరువు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు వెల్లడైందని తెలిపారు. గంజాయి రవాణకు ఉపయోగించిన నాలుగు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డిపిఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డిఎస్‌పి తెలిపారు. పట్టుబడిన నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. పరారైన మరో ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

**కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మేళ్లచెరువుకు చెందిన గంజాయి నిందితుడు పరారీ**

కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి నిందితులు 8 మందిని ఉదయం పట్టణ పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. డిఎస్‌పి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసే క్రమంలో 30 నిమిషాల క్రితం 8 మంది నిందితుల్లో ఒక నిందితుడు పరారైనట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పోలీసుల అసమర్థత, నిర్లక్ష్యం వల్లే స్టేషన్ నుండి నిందితుడు పరారీకావడం కోదాడ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు వారి అసమర్ధతను కప్పిపుచ్చుకునేందుకు 7గురి నిందితులనే అరెస్టు చేసి చూపిస్తు ముగ్గురు పరారీలో ఉన్నట్లు వారు వారి తప్పును కప్పిపుచ్చుకున్నారు.

## 14 టన్నుల పిడిఎస్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/నిడమనూరు:** నిడమనూరు మండల కేంద్రంలోని శ్రీనివాస రైస్ మిల్ నుండి అక్రమంగా తరలిస్తున్న 14 టన్నుల పిడిఎస్ పోయాని నిడమనూరు పోలీసులు సోమవారం ఉదయం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీనివాస రైస్ మిల్ నుండి అనుమానాస్పదంగా బయటకు లారీ హాలియా వైపు వెళుతుండగా వాహనం ఆపి పట్టాతీసి చూడగా అందులో పిడిఎస్ బియ్యం 14 టన్నులు బియ్యం ఉన్నట్లు వారు తెలిపారు. పిడిఎస్ బియ్యం రవాణాకి సంబందించి డ్రైవర్ మారేపల్లి సైద వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో లారీని డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఇందిరమ్మ కుట్టుమిషన్ల పథకానికి దరఖాస్తు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ రాష్ట్ర బిసి కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఇంటింటికి ఇందిరమ్మ కుట్టుమిషన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విశాల్ ధర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు తేది.13.08.2026 నుండి 13.09.2026 వరకు టిజిఓబిఎంఎంఎస్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా https://tgobmms.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే సమయంలో లబ్ధిదారులు తమ ఆధార్ వివరాలు, రేషన్ కార్డు వివరాలు, ఆదాయ వివరాలు, కుల ధృవీకరణ వివరాలు, విద్యార్హతల వివరాలు, గతంలో కుట్టుమిషన్ శిక్షణ పొందినట్లయితే అందుకు సంబంధించిన వివరాలు, సర్టిఫికెట్లు, ఫోటో, ప్రస్తుత చిరునామా తదితర వివరాలను పూర్తిగా నమోదు చేసి, సంబంధిత ధృవపత్రాలను సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం అర్హత సాధించిన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఇంటింటికి ఇందిరమ్మ కుట్టుమిషన్ పథకం కింద కుట్టుమిషన్లు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## లిటిల్ కార్ట్ డోర్ డెలివరీ యాప్




**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** పట్టణ ప్రజల సౌకర్యార్థం మేరకే లిటిల్ కార్ట్ డోర్ డెలివరీ యాప్ ను ప్రారంభించారని,ప్రజలందరూ పాల్గొని వ్యాపారం ప్రారంభించిన వారిని ఆశీర్వదించాలని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని మునంపల్లి రోడ్డులో గ ల ధరణి హోమ్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యాప్ ను ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు కావలసిన వస్తువులు సామాగ్రి అన్ని రకాల వస్తువులను ప్రజలకు సకాలంలో అందించడం కోసం ఈ యాప్ను ప్రారంభించడం అభినందించారు. లిటిల్ కార్ట్ డోర్ డెలివరీ ఆఫ్ సీఈఓ మేకల సతీష్ రెడ్డి మాట్లాడుతూ 10 నిమిషాల్లో ఫాస్ట్ డెలివరీ యాప్ ద్వారా అందిస్తామన్నారు. ఉదయం 8 గంటల నుండి మిడ్ నైట్ వరకు సేవలు అందుబాటులో ఉంచుతామన్నారు. వీటి కాలనీ సూర్యాపేట ప్రాంతాల్లో ఈ యాప్‌ను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోపరేటర్ స్వాతి,మేనేజర్ పోరెడ్డి ప్రమోద్ రెడ్డి,మర్రి నాగార్జున రెడ్డి,అలుగువెల్లి సత్యనారాయణ,సౌజన్య ,సృజన,జానకి,స్వాతి,ఝాన్సీ,దుర్గా విజయ, సత్యరాణి,సావిత్రి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార వేదిక ప్రజావాణి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** డివిజన్, మండల స్థాయి ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలనే ఉద్దేశంతో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో ఎస్.రమణారెడ్డి సూచించారు. సోమవారం మిర్యాలగూడలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమానికి డివిజన్ వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాల నుంచి బాధితులు విచ్చేసి వినతులు అందజేశారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో మొత్తం 17 దరఖాస్తులు నమోదయ్యాయి.అందిన వినతిపత్రాల్లో ఆర్డీవో కార్యాలయానికి 3, మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయానికి 4, దామరచర్ల తహసీల్దార్ కార్యాలయానికి 2 అర్జీలు వచ్చాయి. వీటితో పాటు మాడుగులపల్లి, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, అనుముల తహసీల్దార్లకు ఒక్కొక్కటి చొప్పున 4 దరఖాస్తులు, డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయానికి 2, మిర్యాలగూడ మున్సిపల్ ఆఫీస్‌కు 1, సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీస్‌కు 1 వినతిపత్రం అందాయి.

# ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం

హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్



**ప్రజాపక్షం/రంగారెడ్డి/ఎల్‌బి నగర్ :** ప్రభుత్వ భూములు, ప్రజల అవసరాలకు కేటాయించిన స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా అడ్డుకొని నిర్మాణాలను తొలగిస్తామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ పేర్కొన్నారు. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడడంలో కాలనీవాసులకు హైడ్రా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. కాలనీలలోని నివాసితులు, సంక్షేమ సంఘాల వారు ఎవరూ ఆందోళన చెందాల్సినవసరం లేదన్నారు. రంగారెడ్డి జిల్లా, హయత్‌నగర్ మండలం వనస్థలిపురం సాహెబ్‌నగర్‌లోని ఆఫీసర్స్ కాలనీలో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలంలో అక్రమ కట్టడం జరుగుతోందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ స్థలాన్ని కాపాడుకోడానికి కాలనీవాసులు రెండేళ్లుగా పోరాడుతున్నారు. ఇక్కడ ఆక్రమణలను అడ్డుకున్నవారిని కబ్జాదారులు బహిరంగంగా బెదిరించడమే కాకుండా.. హతమారుస్తామని హెచ్చరించిన వీడియో చూసి ఇక్కడికి వచ్చినట్టు కమిషనర్ తెలిపారు. 1987లో ఈ లే ఔట్ వేయగా.. అప్పటి సొసైటీకి బాధ్యతలు అప్పజెబుతూ ప్లాట్ నంబరు 39, 40లను ప్రజావసరాలకోసం కేటాయించడం జరిగింది. ఆ సొసైటీ 45 ఏళ్లుగా ఎలాంటి కార్యకలాపాలు చేయకుండా.. లెక్కలు చెప్పకపోవడంతో ఆ సొసైటీ పనిచేయనదిగా గుర్తించి రద్దు చేసినట్టు జిల్లా కోపరేటివ్ అధికారి హైడ్రాకు లేఖ కూడా రాశారు. వాళ్లంతా 2023లో ఈ రెండు ప్లాట్లను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేశారు. అక్కడి నుంచి కాలనీవాసుల పోరాటం ప్రారంభమైంది.ఈ వివాదం కోర్టులో ఉండగా.. గతంలో జి ప్లస్ 1 నిర్మాణానికి అనుమతి తీసుకుని 4 అంతస్తులు నిరాటంకంగా నిర్మాణాలు చేపట్టడం జరిగింది. దీనిని అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించగా.. వారిని అక్కడ నిర్మాణదారులు కిరాయి మనుషులతో బెదిరించడం జరిగింది. కోర్టుకు కూడా ఈ విషయాలన్నీ నివేదించి ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని కాపాడుతామని.. కాలనీవాసులు ఆందోళన చెందాల్సిన పని లేదని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రజా ఆస్తులు, పార్కులు, చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను కాపాడటంలో హైడ్రా రాజీపడదని ఆయన పేర్కొన్నారు. సంబంధిత రికార్డులు, భూహక్కులు, నిర్మాణ అనుమతులను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అంశాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వెంటనే హైడ్రా కమిషనర్ వచ్చి అండగా నిలబడ్డారంటూ కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మహిళలు, నివాసితులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి పబ్లిక్ కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

### ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని ఎలా అమ్ముతారు..

1987లో ప్రజా అవసరాల కోసం కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి 400ల గజాల స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలాన్ని ప్రజావసరాలకే వినియోగించాలి కాని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుని సొమ్ము చేసుకోవడం తగదని అక్కడి కాలనీవాసులు తెలిపారు. దొంగ అనుమతుల ప్రకారం గ్రౌండ్ ప్లస్ ఒక అంతస్తుకు మాత్రమే నిర్మాణానికి అనుమతి ఉన్నప్పటికీ, నాలుగు అంతస్తుల వరకు నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన పార్కు భూమి ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని వారు కోరారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి



**ప్రజాపక్షం/కొత్తూరు/షాద్‌నగర్:** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని కొత్తూరు మండల పరిషత్ అభివృద్ధి నోడల్ అధికారి డాక్టర్ సిహెచ్ అరుంధతి వివరించారు. సోమవారం కొత్తూరు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఇరిగేషన్, రెవిన్యూ, మున్సిపాలిటికి చెందిన మూడు ఫిర్యాదులు వచ్చాయి. సమావేశంలో కొత్తూరు మున్సిపల్ కమిషనర్ సాహితీరెడ్డి, తహసీల్దార్ ముంతాజ్ భేగం పాల్గొన్నారు.

**ఫరూక్‌నగర్ ప్రజావాణిలో 9ఫిర్యాదులు...** ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి తొమ్మిది ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపిడిఒ శ్రీకాంత్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీకాంత్ అధ్యక్షతన ప్రజావాణి నిర్వహించారు. రెవిన్యూ శాఖ నుండి ఐదు ఫిర్యాదులు, మున్సిపల్ శాఖ నుండి మూడు ఫిర్యాదులు, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ఒక ఫిర్యాదు చొప్పున తొమ్మిది ఫిర్యాదులు వచ్చాయి. షాద్‌నగర్ ఆర్‌డిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని అధికారులు తెలిపారు. కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, నందిగామ మండలాల్లో అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

## 16లోగా అభ్యంతరాలు తెలుపండి

షాద్‌నగర్ ఆర్‌డిఒ ఎన్ఆర్ సరిత



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** సెప్టెంబర్..16లోగా ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలపాలని షాద్‌నగర్ రెవిన్యూ డివిజన్ అధికారిణిని ఎన్ఆర్ సరిత అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డిఓ కార్యాలయంలో నియోజకవర్గ ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ సరిత మాట్లాడుతూ ఓటర్ల జాబితా నమోదు చట్టం 1960 నిబంధనల ప్రకారం రూపొంధించిన ఈ ముసాయిదా జాబితా ప్రజల పరిశీలనకు అందుబాటులో పెట్టినట్లు వివరించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ, కేశంపేట, ఫరూఖ్‌నగర్ మండలాలతోపాటు షాద్‌నగర్ మున్సిపాలిటిల్లో ఓటర్ల ముసాయిదాను అందుబాటులో పెట్టినట్లు తెలిపారు. ఏప్రిల్ నుండి అక్టోబర్ 1వ తేది నాటికి 18ఏళ్లు నిండిన యువతి, యువకుడు ఫారం..6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాను పరిశీలించి తప్పులు సరి చేసుకునేందుకు ఓటర్లు కృషి చేయాలని పేర్కొన్నారు. అధికారులు ఓటర్ల ముసాయిదాపై తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు.

## ఇందిరమ్మ రాజ్యం..ఇంటింటా సౌభాగ్యం



**ప్రజాపక్షం/కేశంపేట:** ఇందిరమ్మ రాజ్యంలోనే ఇంటింటి సౌభాగ్యం లభిస్తుందని నిర్ధవెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామంలో లబ్దిదారులు కొత్త సుజాత, కాలే సంతోషలు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇండ్లను సర్పంచ్ భాస్కర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల సొంతింటి కలను నేరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సపూర్ అమేర్, వార్డుసభ్యులు చంద్రయ్య, రిజ్వాన భేగం మోహిజ్, నాయకులు దిద్దెల జంగయ్య, ముత్యాలు, కమ్మరి రవి, వీరస్వామి, కొత్త శ్రీశైలం, బోడ మల్లేష్, బద్క లింగయ్య, బండ పర్వతాలు, బండ లింగయ్య, కారోబర్ శివ పాల్గొన్నారు.

## గరుత్మంతుడి ఆశిస్సులు ఉండాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శ్రీ మహావిష్ణువుకు పరమ భక్తుడైన గరుత్మంతుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని స్వామిని వేడుకున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. సోమవారం గరుడ పంచమిని పురస్కరించుకొని జానంపేటలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అవరణలో ఉన్న గరుత్మంతుడికి మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, కేకే కృష్ణ, నేతలుసాయి ఈశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిశోర్, కుమార్ గౌడ్, రాంభూపాల్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, మాజీ కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, కానుగు అనంతయ్య, పలభట్ల బాలరాజ్, లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ అశోక్, జాంగారి రవి పాల్గొన్నారు.

## బహుజనుల గుండెల్లో సర్వాయి పాపన్న చిరస్మరణీయుడు

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల గుండెలలో చిరస్మరణీయుడు అని పల్లె రవి కుమార్ అన్నారు. సోమవారం సరూర్ నగర్ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన గౌడ్ 376 జయంతి కార్యక్రమమానికి ముఖ్య అతిధిగా పల్లె రవి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సర్దార్ సర్వాయి పాపన ఒక్క గౌడ్ బహుజనులకు పోరాట పటిమను నేర్పిన యోధుడు అని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సమ రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మి ప్రసన్న, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కండికంటి శ్రీధర్ గౌడ్, జహంగీర్ బాబు గౌడ్, బొంగు రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా బాలకృష్ణ, కార్యదర్శిగా షేక్ మహమూద్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఆర్.బాలకృష్ణ, కార్యదర్శిగా షేక్ మహమూద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సోమవారం జరిగిన ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా 25వ మహాసభల రెండో రోజు ప్రతినిధుల సభలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగీవ్రంగా ఎన్నుకుంది. ఉపాధ్యక్షులుగా కే.మహేష్, వి.భగత్‌సింగ్, కె.కళ్యాణ్ సహాయ కార్యదర్శులుగా మజీద్ అలీ ఖాన్, నాగరాజు, అనిల్ కుమార్, కోశాధికారిగా హేమంత్‌తో పాటు మొత్తం 25 మందితో నూతన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి షేక్ మహమూద్ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యతో పాటు యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ఎఐవైఎఫ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# రంగారెడ్డి ముసాయిదా ఓటరు జాబితా విడుదల

సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, మార్పులు, సవరణలకు దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు17న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసినట్లు రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను ప్రతి అర్హత కలిగిన ఓటరు పరిశీలించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాలలో తప్పులు ఉన్నా లేదా మార్పులు, సవరణలు అవసరమైనా సెప్టెంబర్ 16, 2026లోగా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### జిల్లాలో 24,12,652 మంది ఓటర్లు

17–08–2026 నాటికి జిల్లాలోని సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం మొత్తం 24,12,652 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,12,381మంది పురుషులు,12,00,062 మంది మహిళలు, 209 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. కాగా జిల్లాలో అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 4,43,544 మంది ఓటర్లు ఉండగా, ఆ తరువాత రాజేంద్రనగర్‌లో 3,88,278 మంది, మహేశ్వరంలో 3,39,306 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

### అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు పరిశీలించుకోవాలి

అర్హత కలిగిన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, అనర్హుల పేర్లు లేకుండా పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యంగా సర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు సి.నారాయణరెడ్డి తెలిపారు. ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హత కలిగిన వ్యక్తులు, అలాగే ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు కోరుకునే వారు నిర్ణీత గడువులోగా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు లేదా సవరణలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముసాయిదా ఓటరు జాబితాపై అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తుది ఓటరు జాబితా రూపొందిస్తామని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణ రెడ్డి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఆయన కోరారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు**

| ఎసిక్రమ సంఖ్య | నియోజకవర్గం | ఓటర్ల సంఖ్య |
|---|---|---|
| 48 | ఇబ్రహీంపట్నం | 2,59,317 |
| 49 | ఎల్ బి నగర్ | 3,37,919 |
| 50 | మహేశ్వరం | 3,39,306 |
| 51 | రాజేంద్రనగర్ | 3,88,278 |
| 52 | శేరిలింగంపల్లి | 4,43,544 |
| 53 | చేవెళ్ల | 2,18,274 |
| 83 | కల్వకుర్తి | 2,16,890 |
| 84 | షాద్‌నగర్ | 2,09,124 |

# అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాం

'వన్ వార్డ్ ఎవరీ డే' కార్యక్రమంలో సిఎంసి కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారానికి వన్ వర్డ్ ఎవరీ డే కార్యక్రమం ఏర్పాటు చేశామని కార్యక్రమంలో భాగంగా సైబారాబాద్ మున్సిపల్ కమిషనర్ (సిఎంసి) కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ నారాయణ్ అమిత్‌లు ముత్తంగి, తెల్లాపూర్ సర్కిల్ ప్రాంతాలలో పర్యటించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ పరిధీలోని మత్తంగి, తెల్లాపూర్ సర్కిల్ ప్రాంతాలలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమంలో భాగంగా ప్రజలతో నేరుగా మమేకమై పౌర సమస్యల పరిష్కారంతో పాటు సుస్థిరమైన పట్టణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పౌర సమస్యలలో కాలనీలలో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో, మురుగు నీటి వ్యవస్థను పునరుద్దరించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులకు అదేశాలు అందించామన్నారు. ముప్పా ఇంద్రప్రస్థలో కమ్యూనిటీ కంపోస్టింగ్ ఫెసిలిటీని ప్రారంభించారు. నెట్ జీరో వేస్ట్ విదానాలను ప్రోత్సహించడంలో టీనా వాలంటీర్లు చేస్తున్న కృషిని అభినందించారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల కారణంగా దెబ్బతిన్న మంచినీటి పైపులైన్ల పునరుద్దరణ 100 అడుగుల రోడ్డుకు ప్రత్యామ్నాయ రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజల నుంచి వినతులు అందాయని, గ్రామలలో పారిశుధ్య కార్మికుల నియామకం వంటి అంశాలలో వినతులు అందాయని, ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత అధికారులతో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని సిఎంసి కమిషనర్ సృజన తెలిపారు.

## సిఎంసి ప్రజావాణిలో 43 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సైబారాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ శృజన పాల్గొన్నారు. సైబారాబాద్ పరిధీలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పౌరులు, ప్రజా సంఘాలు, కాలనీవాసులు తమ సమస్యలను, వినతులను ప్రజావాణి ద్వార తమ దృష్టికి తీసుకొచ్చారని, శాఖాధిపతుల సమక్షంలో పరిశీలించి సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని అదేశించామని తెలిపారు. మొత్తం 43 ఫిర్యాదులు అందగా శాఖల వారీగా టౌన్ ప్లానింగ్ 28, ఇంజనీరింగ్ 10, ఎంటమాలజీ 1, శానిటేషన్ 1,అర్బన్ బయోడైవర్సిటీ 3, ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం, పారదర్శకమైన బాధ్యతాయుతమైన పౌర సేవలను అందించడం లక్ష్యమని సిఎంసి కమిషనర్ సృజన తెలిపారు.



## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేయాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పేద కుటుంబాలకు అండగా ఉంటున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం విధించిన స్టేను ఎత్తి వేసేందుకు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కోరారు. సోమవారం షాద్‌నగర్ ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అంధించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కారణంగానే సంక్షేమ పథకాలపై స్టే వచ్చిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పేదల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని కల్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకాలను అందుబాటులోకి తీసుకువస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఇలాంటి సంక్షేమ పథకాలను నిలిపివేయడం అంటే పేదింటి మహిళలకు అన్యాయం చేసినట్లేనని పేర్కొన్నారు. హైకోర్టు పరిధిలో ఉన్న ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కౌంటర్ ఇవ్వలేదో సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ పథకాలను నిలిపివేయాలని చూడటం సరికాదన్నారు. పేద ఆడబిడ్డల ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయానైనా బిఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వి.నారాయణరెడ్డి, వై.రవీందర్ యాదవ్, రాజ్యలక్ష్మీ, లక్ష్మణ్‌నాయక్, ఈట గణేష్, విఠల్ ముదిరాజ్, రాంబల్‌నాయక్, లక్ష్మి నర్సింహ్మారెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, భీష్వ రామకృష్ణ, దేవేందర్ యాదవ్, రవి యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జీవిత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని ముందుకు సాగితేనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు అవకాశం ఉంటుందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్, ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. సోమవారం నందిగామ మండలం కన్హాశాంతి వనంలోని హరి యూనివర్సిటి ప్రథమ ఏడాది ఇంజనీరింగ్ విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను స్వాగతించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించుకునేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని వాటి సాధనకు అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హరి యూనివర్సిటి అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు నిరంతర అభ్యాసంతో సంపూర్ణ మార్పు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ అకాడమీ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ చాన్సలర్, హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ డాక్టర్ కమలేష్ డి పటేల్, హరి యూనివర్సిటి వైస్ ఛాన్సలర్, మేనేజింగ్ ట్రస్టీ ప్రొఫెసర్ నర్సిరెడ్డి మల్గిరెడ్డి, హరి డైరెక్టర్ వంశీ చలగుల్ల, ట్రస్టీ డాక్టర్ సాయిరాంరెడ్డి, ట్రస్టీ డాక్టర్ సత్య మండల్, ట్రస్టీ డాక్టర్ ఎస్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కుట్రను అడ్డుకుంటాం

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రను అడ్డుకోవాలి ఎల్బీనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ మహిళా అధ్యక్షులు రంగేశ్వరి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఎల్ బి నగర్ చౌరస్తా వద్ద... మహిళ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దానిలో భాగంగా రోడ్డుమీదకు వచ్చి ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు సాకుతో పేదింటి ఆడబిడ్డల భరోసాను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు. కల్యాణ లక్ష్మి అంశంలో హైకోర్టులో కౌంటర్ వేయకుండా కాంగ్రెస్ కుట్ర చేసిందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల అవినీతి అంశాల్లో కోట్ల రూపాయలు చెల్లించి ప్రైవేటు లాయర్లను పెట్టుకునే ప్రభుత్వం ఈ అంశంలో ఎందుకు కౌంటర్ వెయ్యలేదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు, వారి కుటుంబాల తరఫున కాంగ్రెస్ పార్టీని బిఆర్ఎస్ నిలదీస్తుందన్నారు. ఆడబిడ్డల తులం బంగారం అడుగుతున్నందుకే పూర్తిగా కల్యాణ లక్ష్మిని ఎత్తగొట్టే కుట్ర చేస్తుందన్నారు. కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ కేవలం ఒక సంక్షేమ పథకం మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు,ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలమన్నారు చాలా కాలం తర్వాత ఆమోదం పొందిన దరఖాస్తులకు సంబంధించిన చెక్కులు కూడా పూర్తిస్థాయిలో పంపిణీ కాకుండా ఆగిపోయాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని అర్హులైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, శైలజ, రమాదేవి, దేవి, రాధిక, విజయలక్ష్మి, శ్రీలత, కల్పన వసంత లక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఏ తప్పులు చేస్తే... శిక్ష విద్యార్థులకా?

- యుజిసి-నెట్ పరీక్ష రద్దుపై ఎన్‌టిఏ జవాబుదారీగా ఉండాలి
- విద్యార్థుల సమయాన్ని హరించినందుకు మోదీ సమాధానం చెప్పేదాకా పోరాటం ఆపం
- కేంద్ర సర్కార్‌పై రాహుల్‌గాంధీ మండిపాటు



**న్యూఢిల్లీ :** యుజిసి – నెట్ జూన్ 2026 పరీక్ష లోని మూడు పేపర్లకు తిరిగి పరీక్ష నిర్వహిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) ప్రకటించిన నేపథ్యంలో నరేంద్ర మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ తప్పిదాలకు ఎన్‌టిఏ నాయకత్వాన్ని బాధ్యులను చేయాలని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితంలోని విలువైన సంవత్సరాలను హరించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పేంత వరకు తమ పార్టీ పోరాటం ఆపదని ఆయన స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థ ఒక దోపిడీ యంత్రం లాంటిదని రాహుల్‌గాంధీ ఆరోపించారు. సోమవారం ఆయన ఎక్స్‌లో హిందీలో పోస్టు చేశారు. 'మోదీ గారూ, మీ ఎన్‌టిఏ ఏం చేసిందో చూడండి. సోషియాలజీ, ఇంగ్లీష్, కామర్స్ సబ్జెక్టులకు యుజిసి నెట్ పరీక్షలు జూన్ 22–30 మధ్య జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత, లోపభూయిష్టమైన ప్రశ్నపత్రాలను రూపొందించడం, పాత ప్రశ్నలనే మళ్లీ ఇవ్వడం వంటి కారణాలతో ఎన్‌టిఏ ఆ మూడు పరీక్షలను రద్దు చేసింది' అని ఆయన అన్నారు. ఏళ్ల తరబడి సన్నద్ధమై, దరఖాస్తులు నింపి, ఫీజులు చెల్లించి, దూర ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు వెళ్లిన వేలాది మంది అభ్యర్థులు ఇప్పుడు సెప్టెంబరులో మళ్లీ ఆ ప్రక్రియ అంతా చేయాల్సి వస్తోందని రాహుల్ గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు ఎన్‌టిఏ చేస్తే, శిక్ష మాత్రం విద్యార్థులు అనుభవిస్తున్నారని ఆవేదన చెందారు. కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో తాను చెప్పినట్లుగానే, ఇప్పుడు కూడా చెబుతున్నా.. ఇది ఇకపై విద్యా వ్యవస్థ కాదు, ఇది ఒక దోపిడీ యంత్రం అని ఉద్ఘాటించారు. విద్యార్థుల డబ్బును, వారి విలువైన సంవత్సరాలను, మానసిక ఆరోగ్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని కానీ ప్రతిఫలంగా ఏమీ ఇవ్వదని, కనీసం ఉద్యోగం కూడా రాదు అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. అసలైన ప్రశ్నకు ఎన్‌టిఏ ఇప్పటికీ సమాధానం ఇవ్వడం లేదు, పరీక్షకు ముందే ఈ ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయా అని ప్రశ్నించారు. 'మోదీ ప్రభుత్వంలోని ఇతర విభాగాల మాదిరిగానే, ఎన్‌టిఏ కూడా ఎప్పుడూ తమదే తప్పని ఒప్పుకోదు. సమస్యలతో కూడిన ఇతర పరీక్షల మాదిరిగానే, ఇందులో కూడా ఎవరూ బాధ్యత వహించరని నాకు కచ్చితంగా తెలుసు' అని రాహుల్‌గాంధీ అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనేది మంచి అడుగు మాత్రమేనని, చివరిది కాదని అన్నారు. ఎన్‌టిఏ నాయకత్వాన్ని కూడా బాధ్యులను చేయాలని డిమాండ్ చేశారు. 'సెప్టెంబరులో మళ్లీ ఈ పరీక్ష రాయబోయే ప్రతి విద్యార్థికి చెబుతున్నా... సమస్య మీలో లేదు. పరీక్షను సరిగ్గా నిర్వహించలేని వ్యవస్థను ప్రధాని మోదీ సృష్టించారు, ఆ తర్వాత పరీక్ష రాసే విద్యార్థులను నిందిస్తున్నారు' అన్నారు.

**లోపాలు గుర్తించడానికి రెండు నెలలా? : జైరామ్**

అదే విధంగా యుజిసి నెట్ పరీక్ష జరిగిన దాదాపు రెండు నెలల తర్వాత, ఇంగ్లీష్, కామర్స్, సోషియాలజీ ప్రశ్నపత్రాలలో వాస్తవపరమైన, అక్షర దోషాలు (టైపోగ్రాఫికల్), అనువాద లోపాలు ఉన్నాయని ఎన్‌టిఏ స్వయంగా అంగీకరించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ తెలిపారు. 'ప్రముఖ విద్వాంసుల పేర్లలో అక్షర దోషాలు దొర్లాయి, పుస్తకాల పేర్లు తప్పుగా ముద్రించబడ్డాయి, ప్రశ్నల భాషలో లోపాలు, వ్యాకరణం, లింగవచన సమన్వయంలో తప్పులు, విరామ చిహ్నాల లోపాలు ఉన్నాయి, అలాగే స్థిరత్వం లేని భావనలకు ప్రామాణికం కాని పదాలను ఉపయోగించారు' అని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, గత పరీక్షలలో అడిగిన ప్రశ్నలే చాలా వరకు మళ్లీ పునరావృతమయ్యాయని ఎన్‌టిఏ కమిటీ గుర్తించిందన్నారు. అయితే ఎన్‌టిఏ చేసిన తప్పులకు దేశంలోని విద్యార్థులు ఎందుకు శిక్ష అనుభవించాలనేదే అసలు ప్రశ్న అని, ఇంత తీవ్రమైన లోపాలను గుర్తించడానికి నిజంగానే దాదాపు రెండు నెలల సమయం పడుతుందా అని రమేష్ ప్రశ్నించారు. ఈ జాప్యం కారణంగా ఎన్ని విశ్వవిద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయిన విద్యార్థులకు కలిగిన నష్టానికి ఎవరు, ఎలా భర్తీ చేస్తారని ఆయన అడిగారు. ఎర్రకోట ప్రాకారం నుండి దేశ యువతనుద్దేశించి మాట్లాడే ప్రధాన మంత్రి, తన సొంత బాధ్యత గురించి ఏమైనా చెబుతారా? దేశ యువత సమాధానాలను కోరుతోందన్నారు.

# త్వరగా దర్యాప్తు ముగించండి

**రామమందిర విరాళాల కేసులో సిట్‌కు సుప్రీంకోర్టు ఆదేశం**



**న్యూఢిల్లీ:** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ, దుర్వినియోగం కేసుపై సోమవారం సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. త్వరగా దర్యాప్తు పూర్తి చేసి, తార్కిక ముగింపునకు రావాలని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఈ కేసు విచారణ చేసింది. ఈ కేసు దర్యాప్తులో సాధించిన పురోగతిపై స్టేటస్ రిపోర్టును రెండు వారాల్లోగా సీల్డ్ కవర్‌లో పెట్టి దాఖలు చేయాలని స్పష్టం చేసింది. దర్యాప్తులో పారదర్శకత కోసం వివిధ పక్షాలు (లిటిగెంట్స్) ఇచ్చే సహేతుకమైన సూచనలను కూడా పరిశీలించాలని ఆదేశించింది. సిట్ నివేదికను పరిశీలించిన తర్వాత భక్తులు ఇచ్చే విరాళాల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావడానికి అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. అయోధ్య రామమందిర విరాళాల చోరీ జరిగిందంటూ పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో, జులై 13న దీని గురించి స్టేటస్ రిపోర్టు సమర్పించాలని యుపి పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత జులై 20న, అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి సిట్‌ను ఏర్పాటు చేసే అవకాశం గురించి తమకు తెలియజేయాలని సర్వోన్నత న్యాయస్థానం యుపి ప్రభుత్వాన్ని కోరింది. దీనితోపాటు, విరాళాల చోరీ ఆరోపణలపై నిష్పక్షపాతంగా, నిర్ణీత వ్యవధిలో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను పరిగణనలోకి తీసుకుని, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఐజిపి కిరణ్ ఎస్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను జులై 27న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు, ఈ బృందంలో ఒక ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని గతంలోనే యూపీ ప్రభుత్వాన్ని కోరింది. అయోధ్య రామాలయంలో విరాళాల నిర్వహణలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చిన తర్వాత, ఆర్‌జెడి ఎంపి సుధాకర్ సింగ్ సహా పలువురు పిటిషనర్లు సిబిఐ దర్యాప్తు చేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆలయ ట్రస్టు ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరారు. దీనితో సుప్రీం కోర్టు దీనిని విచారణకు స్వీకరించింది.

## ఎన్‌టిఏలో 50 మందిపై వేటు

**న్యూఢిల్లీ :** ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల్లో అవకతవకలపై కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండడంతో జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టిఎ) కీలక చర్యలు చేపట్టింది. పరీక్షా విధానాన్ని సమూలంగా ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా 50 మందికి పైగా సిబ్బందిని తొలగించింది. సంస్థలోని కీలక స్థానాల్లో నిపుణులను నియమిస్తోంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ప్రకటన వెలువరించింది. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ వంటి పది కొత్త స్థానాల కోసం ప్రకటనలు జారీ చేసి, నియామక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపింది. సైబర్ భద్రత, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన, ఇతర ప్రత్యేక విభాగాల కోసం ప్రైవేట్ రంగం నుంచి కూడా నిపుణులను తీసుకువస్తున్నట్లు వెల్లడించింది. నిర్దేశిత పరీక్షా విధానాలను కచ్చితంగా పాటించాలని విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అధికారులను ఆదేశించారు. ప్రశ్నపత్రాల గోప్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక గదులు, ఎయిర్‌గ్యాప్డ్ సిస్టమ్స్ (ఇంటర్నెట్‌తో సంబంధం లేని వ్యవస్థలు), పరికరాలను భద్రపరిచే విధానాలను పూర్తిగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, నివేదిక సమర్పించాలని ఎన్‌టీఏను ఆదేశించారు. సోమవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి.. ఎన్‌టిఏ డైరెక్టర్ జనరల్ సహా ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది.

# ఆలయంలో తొక్కిసలాట

- ఏడుగురు మృతి, పదుల సంఖ్యలో భక్తులకు గాయాలు
- బిహార్ లఖిసరాయ్ జిల్లాలో ఘటన



**లఖిసరాయ్:** బిహార్‌లో విషాదం చోటు చేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్ ధామ్ ఆలయం సమీపంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు మరణించగా, మరో 14 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.ఆలయానికి కొద్ది దూరంలోనే ఉన్న అశోక్ ధామ్ హాల్ట్ రైల్వే స్టేషన్ వద్ద భక్తులు భారీగా తరలిరావడంతో ఈ ఘటన జరిగింది. శ్రావణ మాసం పవిత్ర శివుడికి జలాభిషేకం చేయడానికి యాత్రికులు తరలి వచ్చారు. ఉదయం 6.30 గంటలకు జనసమూహం ఒత్తిడికి బారికేడ్లలో కొంత భాగం కూలిపోవడంతో, ప్రజలు ఒకరిపై ఒకరు పడిపోయారని ఓ అధికారి తెలిపారు. లఖిసరాయ్ జిల్లా మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ మీడియాతో మాట్లాడుతూ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ హాల్ట్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన తొక్కిసలాటలో ఏడుగురు భక్తులు మరణించగా, మరో 14 మంది గాయపడ్డారని తెలిపారు. ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, గాయపడిన వారిని సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతులు, గాయపడిన వారిని గుర్తించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారని కుమార్ తెలిపారు. తొక్కిసలాటలో భక్తులు మరణించడం పట్ల బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. 'లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ వద్ద జరిగిన ఘటన విషాదకరం, హృదయ విదారకం. ఇది తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారికి సకాలంలో సరైన వైద్య సంరక్షణ అందేలా చూడటానికి పరిపాలనా యంత్రాంగానికి అవసరమైన ఆదేశాలు ఇచ్చాను. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ హృదయ విదార ఘటనలో గాయపడిన వారికి స్థానిక అధికార యంత్రాంగం అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్‌లో పేర్కొన్నారు.

# హోటల్‌లో అగ్నిప్రమాదం

**ఎనిమిది మృత్యువాత, పలువురికి గాయాలు**
**బెంగాల్‌లోని తారాపీఠ్ పట్టణంలో ఘటన**



**తారాపీఠ్:** పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలో ఘోరం జరిగింది. సోమవారం తెల్లవారుజామునఒక హోటల్‌లో అగ్నిప్రమాదంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటన అనంతరం, హోటల్ అగ్నిమాపక వ్యవస్థ నిర్వహణలో లోపాలున్నాయన్న ఆరోపణలపై పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు తారాపీఠ్ ఆలయ పట్టణంలోని ఆ హోటల్‌లో ఉన్న 43 మందిలో, ఒకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, 34 మంది ప్రాథమిక పరీక్షల అనంతరం డిశ్చార్జ్ అయ్యారని వారు చెప్పారు. నాలుగు అంతస్తుల ఆ హోటల్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో చాలా మంది అతిథులు నిద్రపోతున్నారు. వారిలో చాలామంది శ్రావణ మాసంలోని చివరి సోమవారం నాడు ప్రార్థనలు చేయడానికి వచ్చిన భక్తులే ఉన్నారు. భవనం అంతటా దట్టమైన పొగ వ్యాపించడంతో పలువురు అతిథులు పై అంతస్తులలో చిక్కుకుపోయారు. వెంటనే అగ్నిమాపక వాహనాలను ఘటనా స్థలానికి చేర్చి మంటలను అదుపులోకి తెచ్చారు. గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రికి తరలించారు. కొందరికి కాలిన గాయాలవ్వగా, మరి కొందరు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారని అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగిందని హోటల్ అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థలోని ఒక ఎలక్ట్రికల్ భాగానికి మంటలు అంటుకోవడంతో, హోటల్ రిసెప్షన్ సమీపంలో ఈ ప్రమాదం ప్రారంభమైందని వారు తెలిపారు. మంటలు చెలరేగడానికి గల కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. హోటల్ లోపల ఉన్న అలంకరణ, ఫైబర్ సామగ్రికి మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో పొగ పైఅంతస్తులకు వ్యాపించి, గదులలో ఉన్న పలువురు అతిథులు చిక్కుకుపోయారు. హోటల్ అగ్నిమాపక వ్యవస్థ నిర్వహణలో లోపాలున్నాయన్న ఆరోపణలపై పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో, అలాగే రానున్న కౌశికి అమావాస్య పండుగకు పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తారనే అంచనాల దృష్ట్యా, తారాపీఠ్‌లోని హోటళ్లు, లాడ్జీలు, ఇతర సంస్థలలోని విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక ఏర్పాట్లపై బీర్భూమ్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక తనిఖీని ప్రకటించింది. యాత్రికులు, సందర్శకులకు వసతి కల్పించే అన్ని హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, హోమ్‌స్టేలు, ఇతర సంస్థలలో తగినన్ని, సురక్షితమైన విద్యుత్ వ్యవస్థలు, సమర్థవంతమైన అగ్ని నివారణ, అగ్నిమాపక ఏర్పాట్లు ఉండేలా చూడటం తప్పనిసరి అని యంత్రాంగం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. 'తారాపీఠ్‌లో అకస్మాత్తుగా, విషాదకరంగా జరిగిన అగ్నిప్రమాదంతో నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఈ ఘోర దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, ప్రియమైన వారిని కోల్పోయి కుంగిపోయిన వారికి మనోధైర్యం కలగాలని ప్రార్థిస్తున్నాను. చికిత్స పొందుతున్న వారు త్వరగా, పూర్తిగా కోలుకోవాలని కూడా ప్రార్థిస్తున్నాను' అని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. మంటల నుండి తప్పించుకున్న కోల్‌కతాకు చెందిన ఒక మహిళ, హోటల్ లోపల నెలకొన్న భయాందోళనను గుర్తుచేసుకున్నారు.

## బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా రాజీనామా



**న్యూఢిల్లీ :** బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా సోమవారం పార్టీలోని అన్ని పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు రాజీనామా లేఖను సమర్పించినట్లు పూనావాలా తెలిపారు. రాజీనామా లేఖను పూనావాలా ఎక్స్ వేదికగా కూడా పంచుకున్నారు. అందులో, 'అత్యవసర ఆర్థిక, వ్యక్తిగత పరిస్థితుల' కారణంగా జులై 30న బిజెపిలోని అన్ని పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి షరతులు లేకుండా రాజీనామా చేస్తున్నట్లు నబిన్‌కు రాసినట్లు పేర్కొన్నారు. తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరుతూ పార్టీ తన రాజీనామాను వెంటనే ఆమోదించడానికి వెనుకాడటం తనను ఎంతగానో కదిలించిందని నబిన్‌కు రాసిన లేఖలో పూనావాలా పేర్కొన్నారు. 'అయితే, సుదీర్ఘమైన, లోతైన ఆలోచన తర్వాత, జాతీయ అధికార ప్రతినిధి బాధ్యత, బిజెపి క్రియాశీల ప్రాథమిక సభ్యత్వం నుండి నన్ను తప్పించాలనే నిర్ణయానికే కట్టుబడి ఉండాలని నేను నిర్ణయించుకున్నాను. మీకు వివరంగా చెప్పిన కొంతమంది వ్యక్తుల కారణంగా గత కొన్ని రోజులుగా జరిగిన పరిణామాలు, నా మునుపటి నిర్ణయాన్ని పునరుద్ఘాటించేలా, దానికి కట్టుబడి ఉండేలా నన్ను ప్రేరేపించాయి' అని ఆయన అన్నారు. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, బిజెపి అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకులు అందించిన మార్గదర్శకత్వం, ప్రేమ, గౌరవానికి పూనావాలా కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థి ప్రతినిధులను స్వయంగా కలవండి

**జార్ఖండ్ సిఎం సోరెన్‌కు రాహుల్‌గాంధీ లేఖ**

**న్యూఢిల్లీ :** ఉద్యోగ నియామకాలలో అక్రమాలు జరిగాయంటూ జార్ఖండ్‌లో ఉద్యోగార్థులు గత 23 రోజులుగా నిరసనను కొనసాగిస్తున్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థుల ప్రతినిధులను స్వయంగా కలవాలని, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు లేఖ రాశారు. విద్యార్థుల నిరసన శాంతియుతంగా సాగిందని, వారి డిమాండ్లు న్యాయమైనవని రాహుల్ పేర్కొన్నారు. భారతదేశ యువత దేశ భవిష్యత్తు అని, ఈ సంక్షోభ సమయంలో వారికి మన సంఘీభావం, మద్దతు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన ఉద్ఘాటించారు. జార్ఖండ్‌లో అధికారంలో ఉన్న జెఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వంలో కాంగ్రెస్ భాగస్వామిగా ఉంది. ఈనెల 14న సోరెన్‌కు రాసిన లేఖలో, భారత రాజ్యాంగం కల్పించిన శాంతియుత నిరసన హక్కు భారత ప్రజాస్వామ్యానికి ప్రధాన స్తంభాలలో ఒకటని కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తోందని రాహుల్ పేర్కొన్నారు. అందువల్ల, గత కొన్ని నెలలుగా విద్యా వ్యవస్థలో పేపర్ లీక్‌లు, అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులకు తాము పూర్తి మద్దతును ప్రకటించామని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. 'భారతీయ విద్యా వ్యవస్థను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి తమ గుప్పిట్లోకి తీసుకుని, విద్యార్థుల దోపిడీ, అణచివేతకు ఒక సాధనంగా మార్చాయని కూడా భావిస్తున్నాము. ఇది దశాబ్దం క్రితం ఉన్నట్లుగా బలమైన విజ్ఞాన వ్యవస్థగా లేదు' అని రాహుల్ అన్నారు. ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా జార్ఖండ్ ప్రభుత్వం విద్యార్థులతో చర్చలు ప్రారంభించడం, వారి అనేక డిమాండ్లపై అంగీకారం కుదరడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు. అయితే, నిరసనలు కొనసాగుతున్నాయని, కొంతమంది విద్యార్థులు నిరవధిక నిరాహార దీక్షలో ఉన్నారని ఆయన అన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థుల ప్రతినిధులను స్వయంగా కలవాలని సోరెన్‌కు రాహుల్‌కు సూచించారు. ఈ చర్య వల్ల మిగిలిన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిబద్ధతను బలోపేతం చేయడానికి సహాయపడుతుందన్నారు. కాగా, జెపిఎస్‌సి–జెఎస్ఎస్‌సి సంస్కరణల మంచ్ నేతృత్వంలో నిరసనకారులు నియామక పరీక్షలలో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరపాలని, జెఎస్ఎస్‌సిసిజిఎల్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**జెఎస్ఎస్‌సి కార్యాలయంలో సిఐడి సోదాలు**

నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై దర్యాప్తులో భాగంగా, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కార్యాలయంలో (జెఎస్ఎస్‌సి) క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) సోమవారం సోదాలు ప్రారంభించిందని ఒక అధికారి తెలిపారు. వివిధ పరీక్షలలో జరిగిన అవకతవకలకు సంబంధించి తాము జెఎస్ఎస్‌సి కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తున్నామని సిఐడి ఎడిజి మనోజ్ కౌశిక్ పిటిఐకి తెలిపారు. నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు సంబంధించి, జెపిఎస్‌సి మాజీ చైర్మన్ ఎల్. ఖియాంగ్టేతో సహా 20 మందిని రాష్ట్ర దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది.

## సాయం కోసం బాధితుల ఎదురుచూపు

**భూకంప విలయం నుంచి కోలుకోని ఇండోనేషియా**

**రియో:** ఇండోనేషియా 81వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ, ఫ్లోరెస్ ద్వీపంలో వేలాది మంది సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. శనివారం సంభవించిన శక్తివంతమైన భూకంపంలో కనీసం 55 మంది మరణించగా, 130 మందికి పైగా గాయపడిన విషయం తెలిసిందే. వందలాది ఇళ్లు, ఇతర భవనాలు దెబ్బతిన్నాయి. ఈ భూకంపమం సృష్టించిన విలయం నుంచి ఇండోనేషియా ఇంకా కోలుకోలేదు. ఇళ్ల శిథిలాలు, కొండచరియలు, పడిపోయిన చెట్లతో రహదారులు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. 3,500 మందికి పైగా సైనికులు, పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. 275 టన్నుల సహాయ సామగ్రిని పంపించినప్పటికీ, మారుమూల ప్రాంతాలకు చేరవేయడం కష్టంగా మారింది అక్కడ దాదాపు 150 ఇళ్లు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో విపత్తు బాధితుల కోసం ప్రార్థించాలని ప్రజలను విస్ఫోటనాలు సంభవిస్తుంటాయి.

**CHANGE OF NAME**

I, **GUGULOTHU NANDHINI, S/o. BALU,** H.No. 3-73, Pedda Thanda (Vill) Sangem (Mdl), Warangal (Dist), T.G. I have changed my name from **GUGULOTH SANA** (Old Name) to **GUGULOTHU NANDHINI** (New Name) for all future purpose.

## దిమాగి నక్సల్స్ అనడం పట్ల గర్వపడుతున్నా : అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ :** స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఎర్రకోటపై నుంచి ప్రధాని నరేంద్ర మోదీ 'దిమాగి నక్సల్స్' అంటూ చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగుతోంది. ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. తమను దిమాగి నక్సల్స్ అని పిలవడం పట్ల గర్వపడుతున్నానన్నారు. తాను ఒక నిజమైన దేశభక్తుడిని అని, అందువల్లే బిజెపికి భయపడబోనన్నారు. ఎర్రకోట ప్రాకారం నుండి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ, అడవుల నుండి సాయుధ నక్సలిజాన్ని తొలగించడంలో దేశం విజయం సాధించిందని, అయితే దాని భావజాల మద్దతుదారులు హింసను, అరాచకాన్ని ప్రోత్సహించడానికి అవకాశాల కోసం చూస్తున్నారని హెచ్చరించారు. అయితే తనను తాను 'దిమాగి నక్సల్'గా ప్రకటించుకున్న కేజ్రీవాల్, అలా ఉండటం పట్ల గర్వపడుతున్నానని పేర్కొన్నారు. 'బిజెపికి భయపడకుండా ప్రశ్నించే ధైర్యం ఉన్నవారే 'దిమాగి నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్, బి.ఆర్. అంబేద్కర్ నేడు జీవించి ఉంటే, ప్రధాని దృష్టిలో వారూ 'దిమాగీ నక్సల్స్' గానే పరిగణించబడేవారు' అని కేజ్రీవాల్ ఒక వీడియో సందేశంలో అన్నారు. అవినీతి రహిత వ్యవస్థ, డ్రైనేజీ వంటి మెరుగైన సౌకర్యాలు, మెరుగైన ఆసుపత్రులు వంటి వాటిని కోరుకునే ప్రజలను కూడా మోదీ 'దిమాగి నక్సల్స్' అని పిలుస్తారని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. 'నేను నిజమైన దేశభక్తుడిని; అందుకే మీ (మోదీ) ప్రకారం నేను 'దిమాగి నక్సల్'ని. భారతదేశానికి వ్యతిరేకంగా ఎవరైనా ఏదైనా మాట్లాడితే, నేను పూర్తి శక్తితో దాన్ని వ్యతిరేకిస్తాను' అని కేజ్రీవాల్ అన్నారు. అంతకుముందు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి. చిదంబరం ప్రధాని మోదీ చేసిన 'దిమాగీ నక్సల్' వ్యాఖ్యపై స్పందిస్తూ, 'నేను 'దిమాగీ నక్సల్'గా ఉండటం పట్ల గర్వపడుతున్నాను' అని అన్నారు.

## కావేరీ జలాల వివాదం.. సుప్రీంలో తమిళ సర్కార్‌కు ఊరట



**న్యూఢిల్లీ :** కావేరి నదీజలాల విషయంలో సుప్రీంకోర్టులో తమిళనాడులోని సిఎం విజయ్ ప్రభుత్వానికి ఊరట లభించింది. తమిళనాడుకు నీటి విడుదల విషయంలో కావేరి నదీ జలాల నిర్వహ ణ అథారిటీ (సిడబ్ల్యుఎంఎ) ఆదేశాలు అమలయ్యేలా చూడాలని కర్ణాటక ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. దీనిపై తదుప రి విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది. అప్పుడే నీటి విడుదలపై స్టేటస్‌ను వెల్లడించాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. కర్ణాటక నుంచి తమిళనాడుకు 15 రోజులపాటు రోజూ 3,500 క్యూసెక్కుల నదీ జలాలను విడుదల చే యాలని సిడబ్ల్యుఎంఎ గతంలో ఆదేశించింది. దీ నిపై కర్ణాటక నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతో ంది. ఈ క్రమంలోనే కావేరి నీటిలో తమ వాటాను విడుదల చేయడంలో కర్ణాటక ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా ఆ పిటిషన్‌పై విచారణ జరిగింది.

## నాసిక్‌లో స్వల్ప భూప్రకంపనలు

**నాసిక్:** మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం రెండు స్వల్ప భూప్రకంపనలు సంభవించినట్లు అధికారులు తెలిపారు.ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ ప్రకంపనల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం సంభవించలేదు.రాష్ట్ర రాజధాని ముంబయి కి 180 కిలోమీటర్ల దూరంలో నాసిక్ ఉంది. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ) ప్రకారం, ఉదయం 5.06 గంటలకు 2.5 తీవ్రతతో, మధ్యాహ్నం 12.40 గంటలకు 3.0 తీవ్రతతో భూప్రకంపనలు నమోదయ్యాయి. ఇవి భూమికి 5 కిలోమీటర్ల లోతులో సంభవించాయి.నాసిక్ జిల్లాలోని పెత్, సుర్గాణా, దిండోరి తాలూకాల్లో నికొన్ని ప్రాంతాల్లో ఈ ప్రకంపనల ప్రభావం ప్రజలకు తెలిసింది.ఇంతకుముందు కూడా జులై 25 నుంచి 28 వరకు, అలాగే ఆగస్టు 6, 8, 10, 14 తేదీల్లో నాసిక్‌లో ప్రకంపనలు నమోదయ్యాయి. ఈ ప్రకంపనల వల్ల సుర్గాణా తాలూకాలోని భాదర్, దిండోరి తాలూకాలోని నానాశి గ్రామాల్లో కొన్ని ఇళ్లల్లో గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి.నాసిక్, పాల్ఘర్ జిల్లాల్లో భూకంప ప్రభావాలపై సమగ్ర అంచనా నిర్వహించాలని, ము ఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గత వారం అధికారులను ఆదేశించారు.

**TALLA PADMAVATHI COLLEGE OF PHARMACY**
Orus, Kareemabad, Warangal - 506002

**WANTED**

Applications are invited from eligible candidates for the following faculty positions across all specializations:

♦ Professor ♦ Associate Professor ♦ Assistant Professor

**Qualifications: Ph.D. / M.Pharm / Pharm.D**

Salary will be as per PCI Norms.
Candidates must submit their resume before 21st August to : wgltpcp@gmail.com.,
**Contact Number: 9849945165**
Secretary and correspondent

**SUMATHI REDDY**
INSTITUTE OF TECHNOLOGY FOR WOMEN
Learning at its best
AN AUTONOMOUS INSTITUTION
(SR Educational Academy)
Private Un-Aided Non-Minority Institution
Estd:2009
College Code | SRIW
Ananthasagar, Hasanparthy, Hanumakonda - 506 371
Email: principal@sritw.org, www.sritw.org
Mobile: +91 90526 36390, 96181 22472
AUTONOMOUS | Approved by AICTE | Affiliated to JNTUH | Accredited by NAAC with 'A' Grade | Accredited by NBA

**SPOT ADMISSION - TGEAPCET 2026-27**
Date: 20-08-2026 (Thursday) at 10:00 A.M

Few seats are available for admission in to **I-Year B.Tech** course in the following branches for the **academic year 2026-27**. Interested and eligible candidates who have not taken admission in any other institution can attend the **Spot Admissions** on **20-08-2026 at 10:00 a.m.** Candidates are advised to bring all original certificates and necessary fee.
Admissions will be made as per the guidelines issued by the Convenor, TGEAPCET-2026.

| VACANCY POSITION: | CSE(Data Science): 03 | ECE : 01 |
| --- | --- | --- |

**Note:** The candidates admitted under Spot Admissions are not eligible for Tuition fee reimbursement/Scholarship.

Date:18.08.2026 Sd/- Secretary & Correspondent

## ఇరాన్–ఒమన్ మధ్య హోర్ముజ్ జలసంధిపై ఒప్పందానికి తుది రూపం



**దుబాయ్:** హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలను నిర్వహించేందుకు ఒమన్‌తో కుదుర్చుకొన్న ఒప్పంద ప్రకటన తుది రూపం ఇచ్చేందుకు చర్చలు కొనసాగుతున్నాయని ఇరాన్ సోమవారం తెలిపింది. ప్రపంచ వాణిజ్య చమురు సరఫరాలో యుద్ధానికి ముందు సుమారు ఐదో వంతు ఈ జలసంధి మీదుగా సాగేది. వాణిజ్య నౌకల కోసం హోర్ముజ్‌ను పూర్తిగా తెరవాలన్నది అమెరికా ప్రధాన డిమాండ్లలో ఒకటి. అయితే ఇరాన్–ఒమన్ ప్రతిపాదన అమెరికా షరతులకు అనుగుణంగా ఉంటుందా? అన్నది ఇంకా స్పష్టంగా లేదు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ టెహ్రాన్‌లో మాట్లాడుతూ, నౌకలు ప్రయాణించే మార్గానికి సంబంధించిన పటంపై ఇరాన్, ఒమన్ ఒక అవగాహనకు వచ్చాయని చెప్పారు. ప్రతిపాదిత తాత్కాలిక ఏర్పాటులో నౌకలు ఇరాన్ తీరానికి సమీపంలోని మార్గం ద్వారా జలసంధిలోకి ప్రవేశించి, ఒమన్ తీరానికి సమీపంలోని మార్గం నుంచి బయటకు వెళ్తాయి. ఈ మధ్యంతర కాలంలో నౌకల నుంచి ఎలాంటి రుసుములు లేదా టోల్‌లు వసూలు చేయరు. పటం, ఒప్పంద ప్రకటనను కలిపి ఒక ప్యాకేజీగా తుది ఒప్పందాన్ని రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామని బఘాయీ చెప్పారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేసిన తర్వాత పరిస్థితి అదుపుతప్పింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య రాకపోకలను ఇరాన్ దాదాపు నిలిపివేసింది. దీనిపై స్పందించిన అమెరికా, జలసంధిని తెరవడంపై అంగీకారయోగ్యమైన ఒప్పందం కుదిరిన తర్వాతే ఇరాన్ నౌకాశ్రయాలపై దిగ్బంధాన్ని ఎత్తివేస్తామని స్పష్టం చేసింది. ఇదే సమయంలో అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కోసం నిర్ణయించిన 60 రోజుల గడువు ముగిసింది. గడువు పొడిగింపుపై ఎలాంటి ప్రకటన రాలేదు.

# జియాంగ్ విధానాలను పాఠాలుగా నేర్చుకోవాలి

- మాజీ అధ్యక్షుడి శత జయంతి వేడుకల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- సిపిసి సభ్యులు విధిగా పార్టీ నాయకత్వాన్ని సమర్థించాలని వ్యాఖ్య



**బీజింగ్:** అధికార కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ చైనా (సిపిసి) సభ్యులు పార్టీ సమగ్ర నాయకత్వాన్ని సమర్థించాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సోమవారం అన్నారు. మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ శతజయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. జియాంగ్ 1989 నుంచి 2002 వరకు సిపిసి ప్రధాన కార్యదర్శిగా, 1993 నుంచి 2003 వరకు చైనా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన 2022లో ఆయన తన 96 ఏళ్ల వయసులో మరణించారు. జియాంగ్ శతజయంతిని పురస్కరించుకుని బీజింగ్‌లోని 'గ్రేట్ హాల్ ఆఫ్ ద పీపుల్'లో జరిగిన కార్యక్రమంలో జిన్‌పింగ్ ప్రసంగించారు. సంక్షోభాలను ఎదుర్కొన్నప్పుడు జియాంగ్ ప్రదర్శించిన దృఢత్వం, రాజకీయ విశ్వాసం, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల నిబద్ధత, పార్టీ పట్ల విధేయత వంటి లక్షణాల నుంచి ప్రస్తుత పార్టీ సభ్యులు పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో కొనసాగుతున్న సరికొత్త ప్రయాణంలో పార్టీ సమగ్ర నాయకత్వాన్ని, సిపిసి కేంద్ర కమిటీ కేంద్రీకృత, ఏకీకృత నాయకత్వాన్ని దృఢంగా సమర్థించడం తప్పనిసరి. పార్టీపై సంపూర్ణ, కఠినమైన స్వీయ నియంత్రణను నిరంతరం బలోపేతం చేయాలి. చైనా ప్రత్యేకతలతో కూడిన సామ్యవాద నిర్మాణంలో పార్టీని బలమైన నాయకత్వ కేంద్రంగా కొనసాగించాలి' అని జిన్‌పింగ్ చెప్పినట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. ఈ కార్యక్రమానికి వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరయ్యారు. సిపిసిలో అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీకి చెందిన ఏడుగురు సభ్యులు కూడా హాజరయ్యారు. మాజీ ప్రధాని వెన్ జియాబావో, మాజీ ఉపాధ్యక్షుడు వాంగ్ కిషాన్, జెంగ్ కింగ్‌హోంగ్ తదితరులు హాజరైన వారిలో ఉన్నారు. అయితే మాజీ అధ్యక్షుడు హు జింటావో ఈ కార్యక్రమానికి హాజరుకాలేదని హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తెలిపింది. ఇలావుంటే, జియాంగ్ 2002లో సిపిసి ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుకొని, 2003లో అధ్యక్ష పదవిని హు జింటావోకు అప్పగించారు. అయితే చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌ఎ)కు అత్యున్నత కమాండ్ సంస్థ అయిన సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సిఎంసి) చైర్మన్‌గా 2004 వరకు కొనసాగారు. ఈ సమయంలో చైనా నాయకత్వాన్ని తదుపరి తరానికి క్రమంగా బదిలీ చేసే ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. 1989లో తియానన్‌మెన్ స్క్వేర్ నిరసనలపై చైనా భద్రతా దళాలు చర్యలు తీసుకున్న అనంతరం జియాంగ్ దేశ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాతి కాలంలో పాశ్చాత్య దేశాలు విధించిన ఆంక్షలు, 1991లో సోవియట్ యూనియన్ పతనం, 1997–98 ఆసియా ఆర్థిక సంక్షోభం వంటి పరిణామాలను జియాంగ్ నాయకత్వంలో చైనా సమర్థంగా ఎదుర్కొంది. అదే సమయంలో ఆర్థిక సంస్కరణలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో చైనా అనుసంధానాన్ని విస్తరించే విధానాన్ని ఆయన కొనసాగించారు. జియాంగ్ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ జిన్‌పింగ్ మాట్లాడుతూ, కీలక చారిత్రక మలుపులు, సంక్షోభ సమయాల్లో ఆయన కమ్యూనిస్టు సిద్ధాంతాలపై దృఢంగా నిలిచారని అన్నారు. ప్రమాదాలు, సవాళ్లను ఎదుర్కొంటూనే చైనా సంస్కరణలు, సామ్యవాద ఆధునికీకరణ ప్రక్రియ నిరంతరంగా ముందుకు సాగేలా ఆయన నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. జిన్‌పింగ్ 2012లో హు జింటావో నుంచి సిపిసి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు స్వీకరించారు. 2013లో అధ్యక్షుడయ్యారు. ప్రస్తుతం ఆయన మూడో ఐదేళ్ల పదవీకాలాన్ని కొనసాగిస్తున్నారు. వచ్చే ఏడాది జరిగే పార్టీ జాతీయ మహాసభలో నాలుగోసారి పదవీకాలాన్ని కోరే అవకాశం ఉందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు మావో జెడాంగ్ తర్వాత రెండు ఐదేళ్ల పదవీకాలాలను దాటి అధికారంలో కొనసాగుతున్న ఏకైక సిపిసి నాయకుడు జిన్‌పింగ్. మావోకు మాత్రమే గతంలో లభించిన కోర్ నాయకుడి హోదాను కూడా జిన్‌పింగ్‌కు పార్టీ కల్పించింది. కాగా, మాజీ ప్రధాని ఝూ రోంగ్‌జీ అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయి. ఆయన ఆగస్టు 12న 98 ఏళ్ల వయసులో మరణించారు. 1998 నుంచి 2003 వరకు ప్రధానిగా పని చేసిన రోంగ్‌జీ, అవినీతి వ్యతిరేక చర్యలు, కేంద్ర ప్రణాళిక ఆధారిత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో విస్తృత మార్పులకు చేసిన కృషికి గుర్తింపు పొందారు.

## గాజా కాల్పుల విరమణపై నెతన్యాహుతో కుష్నర్ చర్చలు

**జెరూసలేం:** గాజాలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అమెరికా మద్దతుతో రూపొందించిన 15 అంశాల రోడ్‌మ్యాప్‌ను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తిరస్కరించిన నేపథ్యంలో, అమెరికా మధ్యప్రాచ్య చర్చల ప్రతినిధి జారెడ్ కుష్నర్ సోమవారం ఆయనతో సమావేశమయ్యారు. అంతకుముందు కుష్నర్ ఈజిప్టులో హమాస్‌నేత ఖలీల్ అల్ హయ్యాతో రెండు గంటలకు పైగా చర్చలు జరిపారు. ఈ రోడ్‌మ్యాప్‌ను అంగీకరించినట్లు హమాస్ ప్రకటించింది. ఇందులో హమాస్ నిరాయుధీకరణ, గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరణ వంటి అంశాలు ఉన్నాయి. అయితే ఇజ్రాయెల్ తమ సైన్యం ఉపసంహరణకు ముందు హమాస్ పూర్తిగా ఆయుధాలు వదులుకోవాలని పట్టుబడుతోంది. ప్రస్తుతం ఇజ్రాయెల్ సైన్యం గాజాలో సుమారు 60 శాతం ప్రాంతాన్ని నియంత్రిస్తోంది. నెతన్యాహుతో జరిగిన సమావేశంలో మాజీ బ్రిటిష్ ప్రధాని టోనీ బ్లెయిర్, 'బోర్డ్ ఆఫ్ పీస్' డైరెక్టర్ నికోలాయ్ మ్లాడెనోవ్ కూడా పాల్గొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈజిప్టు, ఖతార్, టర్కీ మధ్యవర్తుల ప్రతినిధులు కూడా కుష్నర్–హమాస్ చర్చల్లో పాల్గొన్నారు. హమాస్ నేత అల్ హయ్యా చర్చల్లో ఇజ్రాయెల్ గాజాపై దాడులు నిలిపివేసి, ఎల్లో లైన్‌గా పిలుస్తున్న విభజన రేఖ వరకు తమ సైన్యాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆ రేఖకు స్పష్టమైన నిర్వచనం లేదు. ఇదిలా ఉండగా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా పలు దేశాలు ఇజ్రాయెల్ ఈ రోడ్‌మ్యాప్‌ను తిరస్కరించడాన్ని ఖండించాయి. గాజాలో శాంతి ప్రయత్నాలను అడ్డుకునే బాధ్యత ఇప్పుడు ఇజ్రాయెల్ పైనే ఉందని అవి పేర్కొన్నాయి. జోర్డాన్, పాకిస్థాన్, ఇండోనేషియా, కాల్పుల విరమణ మధ్యవర్తులు కూడా ఈ ప్రకటనలో చేరారు. రోడ్‌మ్యాప్ అమలయ్యే వరకు గాజా పునర్నిర్మాణం, అంతర్జాతీయ భద్రతా దళాల ఏర్పాటుతో సహా ఇతర కాల్పుల విరమణ చర్యలు నిలిచిపోతాయి. హమాస్ భారీ ఆయుధాలను అప్పగించే అంశాన్ని పాలస్తీనా రాజ్య స్థాపనకు అనుసంధానిస్తోంది. అయితే ఇజ్రాయెల్ ప్రస్తుత ప్రభుత్వం పాలస్తీనా రాజ్య ఏర్పాటును వ్యతిరేకిస్తోంది. అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నెతన్యాహుపై రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి ప్రారంభించిన యుద్ధం మూడో వార్షికోత్సవం కూడా సమీపిస్తోంది.

## రష్యాలో మయన్మార్ సైనిక పాలకుడు
# మిన్ ఆంగ్ హ్లెయింగ్ పర్యటన

**బ్యాంకాక్:** మయన్మార్ సైనిక పాలకుడు, అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లెయింగ్ సోమవారం రష్యా పర్యటనకు బయలుదేరారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించనున్నారు. ఆర్థిక, భద్రత, సామాజిక అంశాలు కూడా చర్చల్లో ఉంటాయని మయన్మార్ ప్రభుత్వ మీడియా తెలిపింది. మయన్మార్ సైనిక ప్రభుత్వానికి చైనాతోపాటు రష్యా కూడా మద్దతునిస్తున్నది. రష్యా తయారీ యుద్ధ విమానాలను జాతి మైనారిటీ సాయుధ గ్రూపుల ఆధీనంలోని ప్రాంతాలపై దాడులకు మయన్మార్ సైన్యం ఉపయోగిస్తోంది. వీటిలో ప్రజాస్వామ్య అనుకూల ప్రతిఘటన బలగాలతో కలిసి పోరాడుతున్న సంస్థలు కూడా ఉన్నాయి. కాగా, హ్లెయింగ్ గతంలో మాస్కోలో జరిగిన ప్రపంచ అణు వారోత్సవం సందర్భంగా పుతిన్‌ను కలిశారు. ప్రస్తుత పర్యటన ఆయన రష్యాకు వెళ్లడం ఏడోసారి. మయన్మార్‌లో అంతర్జాతీయంగా తన ప్రభుత్వానికి గుర్తింపు పెంచుకునేందుకు ఆయన చైనా, భారత్, లావోస్, థాయ్‌లాండ్ తదితర దేశాల్లో కూడా పర్యటించారు. అయితే అంతర్జాతీయంగా ఆయన ప్రభుత్వం ఇప్పటికీ తీవ్ర ఒంటరితనాన్ని ఎదుర్కొంటోంది. 2021 ఫిబ్రవరిలో ఆంగ్ సాన్ సూకీ నేతృత్వంలోని ఎన్నికైన ప్రభుత్వాన్ని సైన్యం కూలదోసిన తర్వాత పాశ్చాత్య దేశాలు మయన్మార్‌పై ఆంక్షలు విధించాయి. సైనిక అణచివేతలో వేలాది మంది పౌరులు మరణించగా, దేశంలో అంతర్యుద్ధం కొనసాగుతోంది. రష్యా అంతర్జాతీయ వేదికలపై మయన్మార్ సైనిక ప్రభుత్వానికి మద్దతు ఇస్తోంది. ఇరుదేశాలు సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించడంతో పాటు అణుశక్తి అభివృద్ధి ఒప్పందం చేసుకున్నాయి. అంతరిక్ష రంగంలోనూ సహకరిస్తూ మయన్మార్ తొలి వ్యోమగామి ఎంపిక, శిక్షణపై కలిసి పనిచేయాలని నిర్ణయించాయి.

## లాటిన్ అమెరికాలో అమెరికా సైనిక చర్యల విస్తరణ

**మెక్సికో సిటీ:** లాటిన్ అమెరికా కరీబియన్, పసిఫిక్ తీరాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో అమెరికా సైన్యం గత ఏడాది నుంచి చేపట్టిన పడవలపై దాడుల్లో 200 మందికి పైగా మరణించారు. ఇప్పుడు ట్రంప్ ప్రభుత్వం ఈ సైనిక చర్యలను భూభాగానికి విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఇటీవల పనామా పర్యటనలో మాట్లాడుతూ, కొలంబియా, గ్వాటెమాలా, హోండురాస్ తమ దేశాల్లో నేర సంస్థలపై అమెరికాతో కలిసి సైనిక చర్యలకు అంగీకరించాయని చెప్పారు. అయితే గ్వాటెమాలా ప్రభుత్వం అలాంటి ఒప్పందం ఏదీ కుదరలేదని స్పష్టం చేసింది. మార్చి నుంచి ఈక్వెడార్ అమెరికాతో కలిసి ఇలాంటి చర్యలు చేపడుతోంది. అమెరికా 60కి పైగా పడవలపై దాడులు చేసి 200 మందికి పైగా చంపింది. లక్ష్యంగా చేసుకున్నవారు మాదకద్రవ్య ఉగ్రవాదులు అనే వాదనకు తగిన ఆధారాలు అమెరికా సమర్పించలేదని విమర్శలు ఉన్నాయి. ఈ దాడుల చట్టబద్ధతపైనా ప్రశ్నలు తలెత్తాయి. ఇప్పుడు స్థానిక బలగాలతో కలిసి భూభాగంలో అమెరికా సైనిక చర్యలు చేపట్టడం కొత్త దశకు నాంది పలుకుతుందని నిపుణులు చెబుతున్నారు. ట్రంప్ ప్రభుత్వం లాటిన్ అమెరికాలోని 20 సంస్థలను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను పట్టుకునేందుకు అమెరికా బలగాలను పంపడంతో పాటు, మెక్సికోలో మాదకద్రవ్యాల తయారీ కేంద్రాలపై సిఐఎ చర్యల్లోనూ పాల్గొంటోంది. కొలంబియాలో అమెరికా బలగాలు నేషనల్ లిబరేషన్ ఆర్మీ (ఇఎల్‌ఎన్)పై చర్యల్లో పాల్గొనే అవకాశాన్ని హెగ్‌సెత్ ప్రస్తావించారు. అయితే సైనిక జోక్యం పౌరుల మరణాలకు దారితీస్తుందని, ఆయుధ సంస్థలు తమ శిబిరాలను వదిలి జనావాసాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలావుంటే, అమెరికాతో కలిసి మాదకద్రవ్య వ్యతిరేక చర్యలకు అంగీకరించలేదని గ్వాటెమాలా అధ్యక్షుడు బెర్నార్డో అరేవాలో చెప్పారు. మెక్సికో కూడా అమెరికాతో భద్రతా సహకారం కొనసాగిస్తున్నప్పటికీ, తన భూభాగంలో కార్టెల్‌లపై అమెరికా సైనిక జోక్యాన్ని అంగీకరించలేదు.

విస్తరిస్తున్న అమెరికా సైనిక పాత్ర దేశాల సార్వభౌమాధికారంపై ప్రజల్లో వ్యతిరేకత పెంచవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సిఎం సూచించారు.

సనత్‌నగర్ టిమ్స్‌ను తామే నిర్మించామని చెబుతున్నావారు వారి పదేళ్ల(బిఆర్‌ఎస్) కాలంలో ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ రాష్ట్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (టిమ్స్)ను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ పేదల ఆరోగ్యమే తమ ప్రభుత్వమన్నారు. విద్య, వైద్యం కేటాయించే నిధులను సంక్షేమ పెట్టుబడులుగా చూడడం లేదని భవిష్యత్తుపైన పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులలో చేరితే ఆస్తులను, చివరికి కిడ్నీలను కూడా అమ్ముకునే పరిస్థితి ఉన్నదని సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. సనత్‌నగర్ టిమ్స్‌లో ఉచిత భోజనం, ఉండేందుకు డార్మెట్రీస్, ఇతర వసతులు కల్పించాలని, ఇందుకు అవసరమైన నిధులను కేటాయించాలని, నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య శాఖను ప్రక్షాళన చేసి, ప్రజలకు ప్రభుత్వ వైద్యం పట్ల విశ్వాసాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాన్ని అందిస్తే ఎవ్వరూ సంక్షేమ పథకాల వైపు చూడబోరన్నారు. సర్వస్వతంత్రులుగా చేసి, వారి కాళ్లపైన సొంతంగా నిలబడే విధంగా ప్రభుత్వ విధానాలు ఉంటే, ఎవ్వరూ కూడా ప్రభుత్వ సంక్షేమం వైపు చూబోరని సిఎం తెలిపారు.

వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కోసం రూ.2700 కోట్లను, 'సీఎంఆర్‌ఎఫ్' ద్వారా రూ. 2526 కోట్లను, పేదల ఆరోగ్యం నిమ్మితం రూ.5226 కోట్లను, మొత్తంగా వైద్య ఆరోగ్య శాఖకు రూ.21,800 కోట్ల నిధులను ఖర్చు చేశామని సిఎం వివరించారు.

ఆ ఫామ్‌హౌస్‌ల నిర్మాణాలు ఎందుకు ఆలస్యం చేయలేదు....? ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసుల నిర్మాణాలకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదని, కానీ పేదలకు వైద్యం అందించే ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణ పనులను ఎందుకు పూర్తి చేయాలేదని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోవాలని, నియోజకవర్గానికో పది నుంచి రూ 20 కోట్లు ఖర్చు చేసి, సేవ చేస్తే ఆ పాపాలు కొంతైనా తగ్గుతాయని సూచించారు. అబద్ధపు ప్రచారాలతో ఏదో చేయాలనుకుంటే ప్రజలు నమ్మబోరన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు 2034 వరకు మారకూడదని, వాళ్లు అబద్ధాలు చెప్పడం మాననంత కాలం తాను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని సిఎం అన్నారు.

# ఉస్మానియా, మిగిలిన టిమ్స్ ఆస్పత్రులు



### కొబ్బరి కాయలు కొట్టారు...నిధులు, నిర్మాణాలను విస్మరించారు.....

పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు శిథిలావస్థకు చేరిన ఉస్మానియా ఆసుపత్రిని పట్టించుకోలేదని , టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం కొబ్బరికాయలు కొట్టి, నిధులు ఇవ్వకుండా, నిర్మాణాలు చేపట్టకుండా వదిలేశారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతనే సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని, ఈ ఆస్పత్రులన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయన్నారు.

**ఇది ఆరంభమే..ఈ ఏడాదిలో అందుబాలోకి మరిన్ని ఆస్పత్రులు. పడకలు..: భట్టి విక్రమార్క**

సనత్‌నగర్ టిమ్స్ కేవలం ఆరంభం మాత్రమేనని, ఈ ఏడాది అనేక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల భవనాలను పూర్తి చేసి, వేలాది పడకలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులకు గత ప్రభుత్వం కేవలం రూ.70 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, ఈ నిధులతోనే నిర్మాణ పనులు చేపట్టినట్టు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం ఇప్పటికే రూ.845 కోట్లను విడుదల చేసిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని ప్రతిపక్షానికి ఆయన హితవు పలికారు. ప్రజా ప్రభుత్వం 2023లో ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి రూ.8,922 కోట్లను ఖర్చు చేసిందన్నారు. అక్టోబర్ నుంచి జూలై వరకు ప్రత్యేకంగా రూ.1,452 కోట్ల యాక్సిలరేటెడ్ పేమెంట్స్ చేశామని, అదనంగా సబ్ సెంటర్ల నిర్మాణానికి మరో రూ.331 కోట్లు విడుదల చేశామన్నారు.

**ఆస్పత్రి బ్లాకులను పరిశీలించిన సిఎం**

టిమ్స్‌లోని వివిధ బ్లాకులను ,ఐసియు వార్డు, రిసెప్షన్ లో టోకెన్ డిస్పెన్సర్ యంత్ర పని తీరును,ఓపీ నమోదు కౌంటర్, పోస్ట్ ఆపరేషన్ వార్డు, ట్రామా విభాగం, ఆపరేషన్ థియేటర్స్, ఇతర విభాగాలను సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎమ్మెల్యేలు శ్రీగణేష్, నవీన్ కుమార్ యాదవ్, జుల్ఫికర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### పగటి వేషగాళ్లు....

టిమ్స్‌ను ప్రభుత్వం ప్రారంభిస్తుందని చెప్పగానే పగటి వేషగాళ్ల తరహా కొందరు తిరిగి పోతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కెటిఆర్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ టిమ్స్ వద్దకు తీసుకొచ్చి, ఇదంతా తామే నిర్మించామని గొప్పలు చెబుతున్నారన్నారు. 'టిమ్స్ వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్‌కు వెళ్లి అక్కడ ఒక్క పేషంట్‌ను కలిసి టిమ్స్‌ను కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగిడంట..ఆ రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని..రాను రాను అదే తగ్గిపోతది అని చెప్పాడంట.' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్ని అబద్దాలు మాట్లాడినా నడిచిందని, ఇప్పుడు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు.

## విద్యార్థి సంఘాలు

(మొదటి పేజీ తరువాయి)

సంఘాలు విమర్శలు గుప్పించాయి. ఎన్‌టిఎను రద్దు చేయాలని లేదా పరీక్షా లోపాలకు దానిని బాధ్యుడిని చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలో నిరసనలకు పిలుపునిచ్చాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్–లెనినిస్ట్) లిబరేషన్‌కు అనుబంధంగా ఉన్న ఐసా, సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఓఖ్లా ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఎన్‌టిఎ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టింది. మూడు పేపర్ల రద్దు అనేది ఆ పరీక్షా సంస్థ మరో వైఫల్యమని ఆరోపిస్తూ, ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఇక ఎస్‌ఎఫ్‌ఐ ఢిల్లీ రాష్ట్ర కమిటీ కూడా ఓఖ్లాలోని ఎన్‌టిఎ కార్యాలయం వద్ద నిరసన తెలిపింది, అదే సమయంలో దాని కేంద్ర కార్యనిర్వాహక కమిటీ దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, రాష్ట్ర, స్థానిక విభాగాలను ఈ పరీక్షా సంస్థకు వ్యతిరేకంగా జరిగే నిరసనలలో పాల్గొనాలని కోరింది. నిష్పక్షపాతమైన, లోపం లేని పరీక్షను నిర్వహించడంలో ఎన్‌టిఎ వైఫల్యాన్ని తాజా నిర్ణయం మరోసారి బయటపెట్టిందని సిపిఐ(ఎం) అనుబంధ ఎస్‌ఎఫ్‌ఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎన్‌టిఎను రద్దు చేసి, పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేసింది. నీట్ పేపర్ లీక్ ఆరోపణలపై జరిగిన ఆందోళనల కారణంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిన ఘటన జరిగిన నెల రోజుల లోపే ఈ తాజా నిరసనలు చోటుచేసుకోవడం గమనార్హం.

## నోటీసులిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్య 35,985 నుంచి 36,353కు (368 కేంద్రాలు పెరుగుదల) చేరింది. మరణించిన, వలస వెళ్లిన, గైర్హాజరైన ఓటర్ల జాబితాలను ఆయా పోలింగ్ కేంద్రాలు, ఇఆఆర్‌ఒ/ఎఇఆర్‌ఒ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, పురపాలక కార్యాలయాల నోటీస్ బోర్డులతో పాటు సీఈవో వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టారు.

**నోటీసు ఇవ్వకుండా తొలగించం...**

సరైన విచారణ, నోటీసులు ఇవ్వకుంగా , స్పీకింగ్ ఆర్డర్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటరు జాబితా నుంచి పేర్లను తొలగించబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. బాధితులు జిల్లా మేజిస్ట్రేట్ (డిఈవో)కు, సిఈవోకు అప్పీల్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఓటర్ల జాబితా పరిశీలన, మార్పులుచేర్పుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950 ను సంప్రదించాలని ఎన్నికల సంఘం సూచించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ సవరణ సాగుతోందని సుదర్శన్ రెడ్డి తెలిపారు.

### జిల్లాల వారీగా ఓటర్ల వివరాలు

కొమురం భీం ఆసిఫాబాద్: (మొత్తం 4,55,596 ఓటర్లు ) డిజిటలైజేషన్ సంఖ్య 4,07,457, మంచిర్యాల: (మొత్తం 6,61,467 ఓటర్లు) డిజిటలైజేషన్ 5,46,999. ఆదిలాబాద్: (మొత్తం 4,66,784 ఓటర్లు) డిజిటలైజేషన్ 4,03,625. నిర్మల్:( మొత్తం 7,55,344 ఓట్లు) డిజిటలైజేషన్ 6,42,174. నిజామాబాద్:(మొత్తం 14,39,734 ఓటర్లు) డిజిటలైజేషన్ 12,28,064 . కామారెడ్డి: (మొత్తం 6,96,006 ఓటర్లు) డిజిటలైజేషన్ 6,11,738. జగిత్యాల:(మొత్తం 7,21,032 ఓటర్లు) డిజిటలైజేషన్ 6,46,294.పెద్దపల్లి:(మొత్తం 7,12,157 ఓటర్లు) డిజిటలైజేషన్ 6,31,018. కరీంనగర్:(మొత్తం 10,89,090 ఓటర్లు ) డిజిటలైజేషన్ 9,11,988 . రాజన్న సిరిసిల్ల: (మొత్తం 4,75,694 ఓటర్లు ) డిజిటలైజేషన్ 4,17,127. సంగారెడ్డి: (మొత్తం 14,57,436 ఓటర్లు) డిజిటలైజేషన్ 11,59,158. మెదక్: (మొత్తం 4,53,140 ఓటర్లు) డిజిటలైజేషన్4,10,204. సిద్దిపేట:(మొత్తం 9,92,967 ఓటర్లు) డిజిటలైజేషన్ 8,74,181. రంగారెడ్డి:(మొత్తం 36,99,743 ఓటర్లు) డిజిటలైజేషన్ 24,12,652 . వికారాబాద్: (మొత్తం 10,17,671 ఓటర్లు ) డిజిటలైజేషన్ 8,07,374. మేడ్చల్ మల్కాజిగిరి:(మొత్తం 29,79,130 ఓటర్లు) డిజిటలైజేషన్ 19,07,564. హైదరాబాద్:(మొత్తం 47,36,669 ఓటర్లు ) డిజిటలైజేషన్ 27,95,225.

మహబూబ్‌నగర్ :( మొత్తం 7,32,488 ఓటర్లు ) డిజిటలైజేషన్ 6,29,402 . నాగర్‌కర్నూల్:(మొత్తం 7,31,632 ఓటర్లు) డిజిటలైజేషన్ 6,18,592. వనపర్తి: (మొత్తం 2,75,570 ఓటర్లు ) డిజిటలైజేషన్ 2,37,006. జోగులాంబ గద్వాల: (మొత్తం 5,03,859 ఓటర్లు ) డిజిటలైజేషన్ 4,39,934 . నల్లగొండ :(మొత్తం 15,16,253 ఓటర్లు) డిజిటలైజేషన్ 13,57,618.సూర్యాపేట: (మొత్తం 10,08,252 ఓటర్లు ) డిజిటలైజేషన్ 9,11,945. యాదాద్రి భువనగిరి:( మొత్తం 4,59,943 ఓటర్లు ) డిజిటలైజేషన్ 4,33,822.జనగామ:(మొత్తం 7,67,484 ఓటర్లు ) డిజిటలైజేషన్ 7,03,593.మహబూబాబాద్: (మొత్తం 4,84,935 ఓటర్లు) డిజిటలైజేషన్ 4,36,956.వరంగల్:(మొత్తం 7,76,953 ఓటర్లు ) డిజిటలైజేషన్ 6,78,540. హనుమకొండ:(మొత్తం 5,09,014 ఓటర్లు) డిజిటలైజేషన్ 4,07,317. జయశంకర్ భూపాలపల్లి:( మొత్తం 2,77,882 ఓటర్లు ) డిజిటలైజేషన్ 2,41,964.భద్రాద్రి కొత్తగూడెం:(మొత్తం 9,96,198 ఓటర్లు) డిజిటలైజేషన్ 8,63,413. ఖమ్మం: (మొత్తం 12,43,781 ఓటర్లు ) డిజిటలైజేషన్ 10,85,927. ములుగు: (మొత్తం 2,36,970 ఓటర్లు) డిజిటలైజేషన్ 2,09,128.నారాయణపేట: (మొత్తం 4,95,574 ఓటర్లు ) డిజిటలైజేషన్ 4,19,214.

## ఉన్నతస్థాయి కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ నాలుగు జిల్లాల్లోనే 22ఏ భూముల సమస్య అధికంగా ఉందన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 511 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లోని దరఖాస్తులను కూడా ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.నిషేధిత భూములకు సంబంధించిన సమాచారం, సమస్యల పరిష్కారం కోసం 1800 5994788 టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిన భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్లలో జాప్యం లేకుండా ప్రత్యేక స్లాట్ల ద్వారా వెంటనే రిజిస్ట్రేషన్ చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. అవసరమైతే రాష్ట్రంలోని భూదాన్ భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలు, వివాదాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్ర నివేదిక రూపొందిస్తామని పొంగులేటి తెలిపారు. యూఎల్‌సీ జాబితాను కూడా సరిచేస్తున్నామని, అసలైన హక్కుదారులకు న్యాయం జరిగేలా మరో రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.రంగారెడ్డి జిల్లాలో 12 ఎకరాల భూమిలో కేవలం రెండు ఎకరాలు భూదాన్ భూములుగా ఉన్నప్పటికీ మొత్తం 12 ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చిన ఉదాహరణను మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి సమస్యలను జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించి, అసలు నిషేధిత భూములను మాత్రమే జాబితాలో ఉంచి, మిగిలిన భూములను ఫ్రీహోల్ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. కొన్ని దేవాదాయ, అటవీ భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయని, వాటినీ పరిశీలిస్తున్నామని తెలిపారు. నిషేధిత భూముల పేరుతో అసలైన యజమానులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని మంత్రి హామీ ఇచ్చారు. సిఎస్7,సిఎస్14కు సంబంధించిన కొన్ని భూముల సమస్యలు దశాబ్దాలుగా కోర్టు కేసుల్లో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఒకవైపు కోర్టులో విచారణలు కొనసాగుతుండగానే కొన్ని ప్రాంతాల్లో రెగ్యులరైజేషన్ జరిగిన అంశాలను కూడా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్‌లోని ఆల్విన్, ఆజ్‌బెస్టాస్ కాలనీల్లోని ప్రైవేటు భూములను విభజించి రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు.

## ఎన్‌టిఎను రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పడుతున్న కష్టాన్ని, సహనాన్ని, ఖర్చు చేస్తున్న డబ్బును ఈ సంస్థ వృథా చేస్తోంది' అని డి.రాజా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ అధానీకిచ్చే ప్రాధాన్యం విద్యకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. విద్యార్థులు చేపట్టిన ఉద్యమాల నుంచి ప్రభుత్వం ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదన్నారు. 'భారత వీధుల్లో కనిపిస్తున్న విద్యార్థుల అసంతృప్తిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దాని అహంకారం ఆ అసంతృప్తిని చూడకుండా కళ్లకు గంతలు కట్టింది' అని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్‌టిఎను పూర్తిగా రద్దు చేయాలని డి.రాజా డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణను వికేంద్రీకరించి... జవాబుదారీతనం ఉన్న ప్రభుత్వ సంస్థల ద్వారా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

# తొలి టెస్ట్‌లో శ్రీలంక 284 ఆలౌట్

## భారత్‌కు 178 రన్స్ ఆధిక్యం

శ్రీలంకతో తొలి టెస్ట్‌లో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు కుప్పకూలింది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 460/9 ఓవర్ నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు కుప్పకూలింది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు



వికెట్లు పడగొట్టాడు. అసిత ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు.

**నిప్పులు చెరిగిన భారత బౌలర్లు...** అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు షాకిచ్చారు. సిరాజ్, జడేజా, మానవ్ సుతార్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 99/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్ వెళ్లింది. తొలి సెషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. రెండో సెషన్లో సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా శ్రీలంకను ఆదుకున్నారు. అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో నిరోషన్ డిక్వెల్లా 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. దినుషా 92 బంతుల్లో అర్ధ శతకాన్ని అందుకున్నాడు. దాంతో శ్రీలంక 215/5 స్కోర్ టీ బ్రేక్‌కు వెళ్లింది. దినుషా, డిక్వెల్లా అద్భుత బ్యాటింగ్‌తో రెండో సెషన్లో శ్రీలంక పైచేయి సాధించింది.

**మలుపు తిప్పిన ప్రసిధ్ కృష్ణ...** ఆఖరి సెషన్లో భారత బౌలర్లు జూలు విదిల్చారు. 146 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సెంచరీ దిశగా సాగిన నిరోషన్ డిక్వెల్లా(80)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో మ్యాచ్ భారత్ వైపు మలుపు తిరిగింది. ఆ వెంటనే కేశర నువాంత(2)ను జడేజా ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(10)ను మానవ్ సుతార్ వెనక్కిపంపాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా మరోవైపు సోనాల్ దినుషా.. 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే అతన్ని జడేజా ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. లాహిరు కుమార(10)ను మానవ్ సుతార్ ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ వెంటనే వర్షం రావడంతో అంపైర్లు మూడో రోజు ఆటను ముగించారు. నాలుగో రోజు ఆటలో భారత్ తొలి సెషన్లోనే 130 పరుగులు చేసి శ్రీలంక ముందు 300 ప్లస్ రన్స్ లక్ష్యాన్ని నమోదు చేయాలి. అప్పుడే ఈ మ్యాచ్ భారత్ వశమవుతోంది. వర్షం అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో భారత్ చాలా తెలివిగా ఆడాల్సిన అవసరం ఉంది.

## ఆరో పతకంపై సింధు గురి

రాజధాని మరో మెగా ఈవెంట్‌కు సిద్ధమైంది. బ్యాడ్మింటన్ అభిమానులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్న ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్ (బీడబ్ల్యూఎఫ్) టోర్నీ ఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో మొదలవనుంది. 17 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన షట్లర్‌గా పేరుగాంచిన తెలుగు తేజం పివి.సింధు రికార్డు స్థాయిలో ఆరో పతకంపై గురిపెట్టింది. ఈ టోర్నీలో ఒక స్వర్ణం (2019)తో పాటు రెండేసి రజతాలు (2017, 2018), కాంస్యాలు (2013, 2014) గెలిచిన సింధు.. ఆరోదీ నెగ్గి సరికొత్త చరిత్రను లిఖించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నది. సింధుతో పాటు భారత డబుల్స్ ద్వయం సాత్విక్‌చిరాగ్ జోడీ మూడో పతకంపై కన్నేయగా మహిళల సింగిల్స్‌లో యువ సంచలనం ఉన్నతి హుడా, మెన్స్ సింగిల్స్లో లక్ష్యసేన్, ఆయుష్ పతకాల రేసులో ఉన్నారు. మొత్తం ఐదు విభాగాల్లో పది మంది బృందంతో భారత్ బరిలోకి దిగనున్నది. 2011 నుంచి ఈ టోర్నీలో కనీసం ఒక్క పతకమైనా గెలిచిన భారత్.. ఆ రికార్డును నిలబెట్టుకుని సొంతగడ్డపై సత్తాచాటాలని భావిస్తున్నది.







## రవీంద్ర జడేజా అరుదైన రికార్డు..

### ఆల్‌రౌండర్ ఖాతాలో 350వ టెస్టు వికెట్

ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అరుదైన క్లబ్‌లో చేరాడు. టెస్టుల్లో అతను 350వ వికెట్ తీసుకున్నాడు. శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో జడేజా.. ఈ ఘనతను సాధించాడు. భారత టెస్టు క్రికెట్లో 350 వికెట్లు తీసుకున్న అయిదో ప్లేయర్‌గా ఆల్‌రౌండర్ జడేజా నిలిచాడు. దీంతో పాటు టెస్టు చరిత్రలో 350 వికెట్లతో పాటు 4 వేల రన్స్ చేసిన క్రికెటర్ల జాబితాలో జడేజా నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ ఘనత అందుకున్న క్రికెటర్లలో కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్, డేనియల్ విట్టోరి ఉన్నారు.

## యువతరంగం

# పోటీపరీక్షల ప్రహసనం

భారతదేశంలో పోటీ పరీక్షలకు ఉన్న ప్రాధాన్యం ప్రపంచంలోని అనేక దేశాలతో పోలిస్తే అసాధారణమైనది. వైద్య విద్యకు నీట్, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు వివిధ ప్రవేశ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వివిధ నియామక పరీక్షలు, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలకు వేర్వేరు పరీక్షలు...యువత జీవితంలో అనేక సంవత్సరాలు పరీక్షల చుట్టూ తిరుగుతున్నాయి. ఇది కేవలం పోటీ తీవ్రతను, అవకాశాల కొరతను ప్రతిబింబించే దృశ్యం. వందల సంఖ్యలో పోస్టులు ఉంటే దరఖాస్తులు లక్షల్లో రావచ్చు. ఒక పరీక్షకు సిద్ధమయ్యేందుకు యువకుడు ఒకటి, రెండు సంవత్సరాలు వెచ్చించవచ్చు. కొందరు నాలుగు, ఐదు సంవత్సరాలు కూడా అదే ప్రక్రియలో కొనసాగుతారు. కోచింగ్ కేంద్రాలు ఈ వ్యవస్థకు సమాంతర ఆర్థిక వ్యవస్థను నిర్మించాయి. కుటుంబాలు తమ పిల్లల కోసం పట్టణాలకు పంపుతున్నాయి. అద్దెలు చెల్లిస్తున్నాయి. కోచింగ్ ఫీజులు కడుతున్నాయి. పుస్తకాలు, ఇంటర్నెట్, ప్రయాణం, పరీక్ష ఫీజులు వంటి ప్రతి అంశం కూడా ఖర్చుతో కూడుకున్నదే. సంపన్న కుటుంబానికి చెందిన విద్యార్థి ఒక పరీక్షలో విఫలమైతే మరోసారి ప్రయత్నించగలడు. కానీ రోజువారీ ఆదాయంపై ఆధారపడే కుటుంబానికి చెందిన విద్యార్థికి మరో ఏడాది అంటే మరో ఆర్థిక భారం. అందుకే పరీక్షా వ్యవస్థలో జరిగే ప్రతి తప్పు సాధారణ పరిపాలనా తప్పిదం కాదు. అది ఒక కుటుంబ జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ప్రశ్నాపత్రం లీక్ అయితే విద్యార్థి ఒక సంవత్సరం కోల్పోవచ్చు. పరీక్ష రద్దయితే మరోసారి సిద్ధం కావాలి. నియామక ప్రక్రియ ఆలస్యమైతే వయోపరిమితి దాటిపోయే ప్రమాదం ఉంటుంది. కోర్టు కేసులు సాగితే సంవత్సరాలు గడిచిపోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో యువతలో అసహనం పెరగడం సహజం. 2024లో నీట్, యుజిసినెట్ తదితర పరీక్షలకు సంబంధించిన వివాదాలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. పరీక్షా వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటే దాని ప్రభావం కేవలం ఆ పరీక్ష రాసిన విద్యార్థులకే పరిమితం కాదు. మొత్తం విద్యావ్యవస్థపై విశ్వాసం తగ్గుతుంది. 2026లో కూడా పరీక్షలు, నియామకాల చుట్టూ నిరసనలు కొనసాగుతుండటం సమస్య తాత్కాలికం కాదని సూచిస్తోంది. ఇక్కడ ప్రభుత్వాల ముందు ఒక సున్నితమైన బాధ్యత ఉంది. నిరసన వ్యక్తం చేస్తున్న యువతను కేవలం శాంతిభద్రతల సమస్యగా చూస్తే మూల సమస్య పరిష్కారం కాదు. లాఠీతో ఒక నిరసనను చెదరగొట్టవచ్చు. కానీ ఉద్యోగం కావాలనే ఆకాంక్షను చెదరగొట్టలేరు. ప్రభుత్వానికి అవసరమైనది పోలీసు ప్రతిస్పందన కంటే విశ్వసనీయమైన సంస్థాగత ప్రతిస్పందన. పరీక్షల భద్రత, ఫలితాల పారదర్శకత, నియామక క్యాలెండర్, ఖాళీల భర్తీ, ఫిర్యాదుల పరిష్కారం వంటి అన్ని దశల్లోనూ జవాబుదారీతనం పెరగాలి. 'ఓపికపట్టండి' అంటూ యువతకు సలహా చెప్పడం కాదు, వారి సమస్యలకు పరిష్కారం,డిమాండ్లకు సమాధానం చేతల్లో ఉండాలి.

**చదువుతోపాటు పెరుగుతున్న నిరుద్యోగం!**

మన దేశంలోని అతిపెద్ద వైరుధ్యాల్లో ఇది ఒకటి. విద్యను సామాజిక పురోగతికి ప్రధాన మార్గంగా ప్రచారం చేశాం. కుటుంబాలు పిల్లలను చదివించేందుకు భూములు అమ్మాయి, అప్పులు చేశాయి, నగరాలకు పంపాయి. కానీ విద్య పూర్తయిన తర్వాత వారికి తగిన ఉద్యోగాలు అందకపోతే ఆ కుటుంబాల విశ్వాసం క్రమంగా క్షీణిస్తుంది. ఇది కేవలం ఉద్యోగాల సంఖ్య సమస్య కాదు. ఉద్యోగాల నాణ్యత కూడా సమస్యే. ఒక ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ తన అర్హతకు సంబంధం లేని తక్కువ వేతన ఉద్యోగం చేస్తే గణాంకాల్లో అతను ఉద్యోగి. కానీ అతని సామర్థ్యాన్ని ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఉపయోగించుకోవడం లేదు. ఒక యువకుడు గిగ్ ప్లాట్‌ఫారమ్‌లో డెలివరీ పని చేస్తే అతను ఉద్యోగి. కానీ ఆ ఉద్యోగానికి సామాజిక భద్రత, స్థిరమైన ఆదాయం, వృత్తి పురోగతి ఎంత వరకు ఉన్నాయి? ఇక్కడే నిరుద్యోగిత రేటు ఒక్కటే యువత ఆర్థిక పరిస్థితిని వివరించలేదని అర్థమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థలో పెద్ద సంస్థల ప్రాధాన్యం పెరిగింది. అది సహజమైన పరిణామమే. ప్రపంచ స్థాయి కంపెనీలు భారత్‌కు అవసరం. కానీ పెద్ద సంస్థలు మాత్రమే విస్తృత ఉపాధిని సృష్టించలేవు. మూలధన ఆధారిత రంగాలు భారీ ఉత్పత్తిని సాధించగలవు. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) ఎంత పెరిగింది? అనే ప్రశ్నతో పాటు ఈ వృద్ధి ఎన్ని ఉద్యోగాలను సృష్టించింది? అనే ప్రశ్నను కూడా ఆర్థిక విధానంలో కేంద్రంగా ఉంచాలి.

## నిరుద్యోగం: కారణాలు, పరిష్కారాలు



భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశమైనప్పటికీ, యువ నిరుద్యోగం దేశాభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారింది. నిరుద్యోగం అంటే పని చేయాలనే ఆసక్తి, అర్హత ఉన్నప్పటికీ ఉపాధి లభించకపోవడం. ప్రపంచ వ్యాప్తంగా నిరుద్యోగుల్లో దాదాపు సగం మంది యువతే ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తుంది. భారతదేశంలో ఐటి, బిపిఒ, బ్యాంకింగ్, టెలికాం వంటి రంగాలు లక్షలాది ఉద్యోగాలను సృష్టించినప్పటికీ, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువత కొరత కొనసాగుతుండగా, మరోవైపు చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోంది. దీనినే 'ఎంప్లాయ్‌బిలిటీ క్రైసిస్' అని పేర్కొంటారు. ఈ పరిస్థితికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా విద్యా వ్యవస్థ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా లేకపోవడం, వృత్తి నైపుణ్యాల లోపం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విశ్లేషణ సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాల కొరత ప్రధాన కారణాలు. పరిశ్రమలు కోరే నైపుణ్యాలు ఒకవైపు ఉండగా, విద్యాసంస్థలు బోధించే అంశాలు మరోవైపు ఉండటంతో విద్య–ఉపాధి మధ్య అంతరం ఏర్పడింది. తయారీ రంగం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందకపోవడం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు తగిన ఆర్థిక, పరిపాలనా మద్దతు లేకపోవడం, సాంకేతిక పరిజ్ఞానం వల్ల కొన్ని ఉద్యోగాలు తగ్గిపోవడం, అనుభవం ఉన్న అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు కూడా యువ నిరుద్యోగాన్ని పెంచుతున్నాయి. కొందరు యువత ప్రతిష్ఠాత్మక ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ ఇతర అవకాశాలను కోల్పోతున్నారు. యువ నిరుద్యోగితను వారి వ్యక్తిగత సమస్య మాదిరి కాకుండా, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలపై కూడా ప్రభావం చూపే ప్రధాన అంశంగా చూడాలి. దీర్ఘకాలిక నిరుద్యోగం వల్ల ఆదాయం తగ్గడం, పేదరికం పెరగడం, మానసిక ఒత్తిడి, నేరప్రవృత్తి, మాదకద్రవ్యాల వినియోగం, సామాజిక అసంతృప్తి వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. అంతేకాకుండా యువతలోని సృజనాత్మకత, ఆవిష్కరణ సామర్థ్యం వినియోగం కాకపోవడం వల్ల దేశ ఆర్థికాభివృద్ధి మందగిస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా విద్యా సంస్కరణలు, పరిశ్రమ–విద్యాసంస్థల సమన్వయం, వృత్తి విద్య, అప్రెంటిస్‌షిప్ కార్యక్రమాల విస్తరణ, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం, యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం, స్టార్టప్‌ల ప్రోత్సాహం, కెరీర్ మార్గదర్శక సేవల బలోపేతం వంటి చర్యలు అవసరం. విద్యతో పాటు ఉపాధి అవకాశాలను కూడా సమానంగా విస్తరించినప్పుడే భారతదేశం తన జనాభా ప్రయోజనాన్ని ఆర్థిక శక్తిగా మార్చుకోగలదు.

# అలియాస్ పేర్ల పరిష్కారానికి కమిటీ

నెల రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం

కార్మికుల వారసుల దీక్షలు విరమణ

పరిష్కారం కాకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం

డిస్మిస్డ్ కార్మికులను మానవతా దృక్పథంతో చూడాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి సంస్థలో మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించేందుకు యాజమాన్యం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని, ఈ నిర్ణయంతో కార్మికుల వారసులకు న్యాయం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అలియాస్ పేర్ల బాధితులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షలను సోమవారం కూనంనేనితో పాటు సింగరేణి పర్సనల్ మేనేజర్ కిరణ్‌కుమార్ బాధితులను నిమ్మరసం ఇచ్చి దీక్షలను విమరమింపజేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ పూర్వం కార్మికులు దొరకని రోజుల్లో ఉద్యోగాల్లో చేరినప్పుడు తప్పులు దొర్లాయని, దీనివల్ల నేడు వారి పిల్లలకు ఉద్యోగాలు రాక తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారన్నారు. తప్పుడు పేర్లు ఉన్నాయని సింగరేణి విజిలెన్స్ విభాగం విచారణ పేరుతో వేదింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కారణంగా వారసులకు ఉద్యోగాలు రావడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం కోల్ బెల్ట్ ఎమ్మెల్యేల సమావేశంలో యాజమాన్యంతో చర్చించామని తెలిపారు. ఫలితంగా ముగ్గురు యాజమాన్య ప్రతినిధులు, ఇద్దరు ఎఐటియుసి, ఒక్కరూ ఐఎన్‌టియుసి ప్రతినిధులతో కూడిన ఆరుగురు సభ్యుల కమిటీని యాజమాన్యం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీ నెలరోజుల్లో సమస్యను అధ్యాయనంచేసి పరిష్కార మార్గాన్ని చూపుతుందన్నారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు నెల రోజుల్లో సమస్యను పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని కూనంనేని తెలిపారు. గతంలో వివిధ కారణాలతో డిస్మస్డ్ అయిన కార్మికుల సమస్యను కూడా యాజమాన్యం మానవతా కోణంలో పరిశీలించి న్యాయం చేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్, యూనియన్ నాయకులు వంగ వెంకట్, జి.వీరస్వామి, శేషయ్య, రమణమూర్తి, గట్టయ్య, కిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, మాతంగి లింగయ్య, బండారి మల్లయ్య, నర్సయ్య, కార్మికుల వారసులు లక్క శ్రావణ్, ధనాల రాజేందర్, జె.రాజేందర్, డిష్ బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో నిర్లక్ష్యం

సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** హామీల అమలులో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా ఆగస్టు 6 నుండి 14 వరకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాల్లో 219 గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్రల వివరాలను వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, మహాలక్ష్మి పథకం తదితర హామీల అమలుపై ప్రజల్లో అసంతృప్తి ఉందన్నారు. పాదయాత్రలో ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారం కోసం త్వరలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడతామని తెలిపారు. సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా బద్లావ్ జరూరీ మై మార్పు కావాలి అనే నినాదంతో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జరిగిన పాదయాత్రకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి జాతీయ హోదా కల్పించేలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో లభించే ఖనిజ సంపద ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, నాగర్‌కర్నూల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.5 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ చేపట్టే భవిష్యత్ ఉద్యమాలకు ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని ఫయాజ్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.కేశవులు గౌడ్, జిల్లా సమితి సభ్యులు మారేడు శివ శంకర్, మర్యాద వెంకటయ్య, పట్టణ నాయకులు కొత్త రామస్వామి తదితరులు ఉన్నారు.

## ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులు

సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్




**ప్రజాపక్షం/కోటగిరి :** ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను పాలకులు అవలంబిస్తున్నారని, వారి సమస్యలు విస్మరిస్తూ పాలన చేస్తున్నారని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆరోపించారు. సిపిఐ కోటగిరి మండల సమావేశం విఠల్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించగా సుధాకర్, ఓమయ్య, రాములు హాజరై మాట్లాడారు. అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు వారి వ్యక్తిగత ఖాతాలో వేస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చాక కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను రోజు రోజుకు పెంచుతూ ప్రజలపై భారం మోపుతుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలన్ని రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లు తీసుకవస్తున్నారని, రైతాంగం పండించే పంటలకు స్వామినాథన్ సిఫారసు మేరకు గిట్టుబాటు ధరలు పెంచకపోగా విదేశీ వాణిజ్యం పేరుతో దేశంలో పండే పంటలకు ధరలు లేకుండా చేసే కుట్ర జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. సెప్టెంబర్ 1న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నల్ల గంగాధర్, ప్రసాద్, శంకర్, రాము, సాయిలు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి




**ప్రజాపక్షం/భువనగిరి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగం నిర్మూలించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి కోరారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరత, నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గం మరియు మండల కార్యదర్శుల సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి యువశక్తి అతిపెద్ద సంపద అయినప్పటికీ, యువతకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను సకాలంలో భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ యువత సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగ భద్రత లేకపోవడం, తక్కువ వేతనాలు, అధిక పని గంటలు కూడా యువతను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఉద్యోగ అనిశ్చితి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి సమస్యలను పరిష్కరించేందుకు యువత ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. యువత సమస్యలపై విస్తృత చర్చ జరిపి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని యానాల పిలుపునిచ్చారు. జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు, యువత పెద్ద సంఖ్యలో మహాసభలకు హాజరు కావాలని కోరారు. విద్య, ఉపాధి, ఉద్యోగ హక్కుల కోసం యువతరం ఐక్యంగా ఉద్యమించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉట్కూరి నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండి.ఇమ్రాన్, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, కొల్లూరి రాజయ్య, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, యేశాల అశోక్, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శులు కళ్లేపల్లి మహేందర్, గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, అన్నేమైన వెంకటేష్, మరుపాక వెంకటేష్, దాసరి లక్ష్మయ్య, సలిగంజి వీరాస్వామి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండీ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసిలో ఆటో కార్మికులు చేరిక

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** ఎఐటియుసి పోరాటాలకు ఆకర్షితులై సంఘంలో సోమవారం టియుసిఐ నుంచి 50 మంది ఆటో కార్మికులు చేరారు. వారికి ఎఐటియుసి (ఆటో వర్కర్స్ యూనియన్) రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య కండువా కప్పి వారిని ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం మండల కార్యదర్శి ఎస్‌కె.చాంద్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఆటో కార్మికులు నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా అమలు చేయటంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో కార్మికులకు ఆటో స్టాండ్లలను ఏర్పాటు చేయాలని, అర్హులైన ఆటో కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ఆటోలు ముంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు చంద్ర నరేంద్ర కుమార్, కంచర్ల రాఘవేంద్రరావు, వలమల సామేలు, గార్లపాటి వీరభద్రం, యాసా రోశయ్య, సిరిపురపు వెంకటేశ్వర్లు, ఎఐటియుసి మండల అధ్యక్షులు గార్లపాటి శివకృష్ణ, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ అబ్బులు దేశి తదితరులు పాల్గొన్నారు.



# రైలు భద్రతపై అప్రమత్తతే కీలకం

## దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైలు కార్యకలాపాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. రైళ్ల సురక్షిత, సజావుగా నడకకు ఎలాంటి రాజీ లేకుండా నిరంతర అప్రమత్తత పాటించాలని సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం జోన్ పరిధిలో రైలు కార్యకలాపాల భద్రతపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధిపతులు సమావేశానికి హాజరయ్యారు. సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డిఆర్‌ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.నాన్‌ఇంటర్‌లాకింగ్ లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని జిఎం ఆదేశించారు. నిర్దేశించిన అన్ని భద్రతా విధానాలు, నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పాయింట్లు, క్రాసింగ్‌ల వద్ద భద్రతా మార్గదర్శకాలను క్షేత్రస్థాయి సిబ్బంది, కాంట్రాక్ట్ సిబ్బంది తప్పనిసరిగా పాటించేలా క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు.రైల్వే ట్రాక్‌ల సమీపంలోని నిర్మాణ ప్రాంతాల్లో ఎలాంటి నిర్మాణ సామగ్రిని వదిలిపెట్టకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు.

రైళ్ల రాకపోకలకు, ట్రాక్ భద్రతకు ఏమాత్రం ఆటంకం కలగకుండా నిర్మాణ పనులను పర్యవేక్షించాలని సూచించారు. రైల్వే సిబ్బందికి క్రమం తప్పకుండా రిఫ్రెషర్ కోర్సులు నిర్వహించాలని జిఎం సూచించారు. తాజా భద్రతా ప్రమాణాలు, నియమ నిబంధనలు, నిర్వహణ విధానాలపై సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని స్థాయిల్లో భద్రతపై అవగాహనను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.రైళ్లను నడిపే లోకో పైలట్‌లకు సిగ్నల్స్ స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని జిఎం తెలిపారు.

సిగ్నల్స్ కనిపించకుండా అడ్డుగా ఉన్న చెట్లు, పెరిగిన కొమ్మలను అవసరమైన ప్రాంతాల్లో వెంటనే కత్తిరించాలని ఆదేశించారు.

సిగ్నల్స్ స్పష్టంగా కనిపించడం ద్వారా సురక్షితమైన, నిరంతరాయమైన రైలు కార్యకలాపాలను నిర్ధారించవచ్చని ఆయన పేర్కొన్నారు. రైలు భద్రత విషయంలో ప్రతి స్థాయి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ స్పష్టం చేశారు.

# మొరాకోలో వందలాది మంది వలసదారుల అరెస్టు

**కసబ్లాంకా (మొరాకో):** మొరాకోలో వందలాది మంది వలసదారులను భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. అధికారిక 'మెదీ వన్ టివి' ప్రకారం, స్పెయిన్‌లోని 'సిటూ' నగరానికి చేరుకునేందుకు ప్రయత్నించిన 294 మందిని సైన్యం అదులోకి తీసుకుంది. అయితే, ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. కరువుకాటకాలు, అభద్రత వంటి కారణాలతో స్పెయిన్‌లోకి చొరబడేందుకు వేలాది మంది మొరాకో ప్రజలు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల సుమారు 60000 మంది మొరాకో వలసదారులు స్పెయిన్ భూభాగంలోకి ప్రవేశించారన్న వార్తలు వచ్చాయి. స్పెయిన్ అధికారులు ఈ సంఖ్యను సుమారు 20,000గా పేర్కొంటున్నారు. మొరాకో వలసదారులు, స్పెయిన్ సైనికుల మధ్య సరిహద్దుల్లో జరిగిన ఘర్షణల్లో పలువురు మృతి చెందారు. అయితే, ఇరు వర్గాలు మృతుల సంఖ్యను అధికారికంగా ప్రకటించలేదు. ఇలావుంటే, సోషల్ మీడియాలో వస్తున్న సందేశాలను అందుకొని, సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉన్న స్పెయిన్ నగరం 'సిటూ'కు చేరుకోవడానికి వేలాది మంది మొరాకో వాసులు ప్రయత్నిస్తున్నారు. దీనితో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## బిజెపి నూతన జాతీయ కార్యవర్గంలో

# రాష్ట్రానికి మొండిచేయి!

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) కొత్త జాతీయ టీమ్‌ను ప్రకటించింది. జాతీయ కార్యదర్శులుగా 16మందికి అవకాశం కల్పించగా, పురందేశ్వరి సహా 13మంది ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. అయితే ఈ టీమ్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరికి చోటుదక్కగా, తెలంగాణ నుంచి ఒక్కరికి కూడా ప్రాతినిధ్యం లభించలేదు. వచ్చే ఎన్నికల్లో అధికారం మాదేనని ఎంత దీమాతో ప్రచా రం చేసుకుంటున్న రాష్ట్ర నాయత్వం ఆశలపై ఆ పార్టీ అధిష్ఠానం నీళ్లు చల్లినట్లుయింది. గతంలో తెలంగాణకు దక్కిన మూడు కీలక జాతీయ పదవులను బిజెపి హై కమాండ్ తొలగించింది. గతంలో తెలంగాణ నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్, జాతీయ ఉపాధ్యక్షురాలిగా డికె అరుణ, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడిగా కె.లక్ష్మణ్ వ్యవహరించారు. ఇప్పుడు కొత్తగా ప్రకటించిన జాతీయ కార్యవర్గంలో తెలంగాణకు ఒక్క పదవి కూడా దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు)గా బిఎల్ సంతోష్ తన పదవిలోనే కొనసాగనున్నారు. అమేథీ మాజీ ఎంపి స్మృతి ఇరానీ, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లబ్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాకు జాతీయ ప్రధాన కార్యదర్శులుగా కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీలో కీలకమైన జాతీయ ఉపాధ్యక్ష పదవులకు పలువురు సీనియర్ నేతలను నియమించారు. మాజీ రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే, మాజీ ఉత్తరాఖండ్ సిఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ జయ్ పాండా, ఆంధ్రప్రదేశ్‌కు డి. పురందేశ్వరి, రేఖా వర్మ తదితరులకు ఈ బాధ్యతలు దక్కాయి. మొత్తం 13 మంది కొత్త జాతీయ ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం ప్రత్యేకంగా నిలిచింది. వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషి, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ప్రొఫెసర్ ఎం. నాగరాజ, ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్, మధు చంద్ర కర్ తదితరులు కూడా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు.

**బండి సంజయ్, డికె అరుణ, కె.లక్ష్మణ్ జాతీయ పదవుల తొలగింపు**

- నూతనంగా జాతీయ కార్యదర్శులుగా 16 మందికి అవకాశం
- ఉపాధ్యక్షులుగా 13 మందికి చోటు
- ఎపిలో పురందేశ్వరికి ఉపాధ్యక్ష పదవి

**జాతీయ కార్యదర్శులుగా 16 మందికి చోటు**

జాతీయ కార్యదర్శుల జాబితాలోనూ పలు రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించారు. మధ్యప్రదేశ్ నుంచి కవితా పటిదార్, కేరళ నుంచి కె. సురేంద్రన్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి డాక్టర్ భోలా సింగ్, జార్ఖండ్ నుంచి ప్రదీప్ వర్మ, గుజరాత్ నుంచి జగదీశ్ ఇశ్వర్‌భాయ్ పటేల్ నియమితులయ్యారు. ఢిల్లీ నుంచి సందీప్ పాఠక్, స్వదేశ్ సింగ్, జై ప్రకాశ్, నాగాలాండ్ నుంచి ఫాంగ్నోన్ కొన్యాక్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి సంగీత యాదవ్, కేరళ నుంచి అనిల్ ఆంటోనీ, తమిళనాడు నుంచి ఎం. వెంకటేశన్, బంగాల్ నుంచి మనోజ్ టిగ్గా, బిహార్ నుంచి సిద్ధార్థ్ శంభు, అసోం నుంచి మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్ నుంచి రోహన్ గుప్తాకు జాతీయ కార్యదర్శుల బాధ్యతలు అప్పగించారు.

**పీయూశ్ గోయల్‌కు మరోసారి**

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు మరోసారి బిజెపి జాతీయ కోశాధికారి బాధ్యతలు అప్పగించారు. పార్టీ ఆర్థిక వ్యవహారాలను ఆయన పర్యవేక్షించనున్నారు. రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్ ఎంపి హేమాంగ్ జోషి కి బిజెపి యువమోర్చా బాధ్యతలు అప్పగించగా., ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌ ధరీ మహిళా మోర్చాను పర్యవేక్షించనున్నారు.

# పాల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉండేలా చర్యలు

## సిఎం రేవంత్‌రెడ్డికి టిజిఎల్‌డిఎ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రస్తుతం పాల ఉత్పత్తిలో దేశంలో13వ స్థానంలో ఉందని, రాష్ట్ర అవసరాల కోసం రోజుకు సుమారు 25లక్షల లీటర్ల పాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్న నేపథ్యంలో తెలంగాణను పాల ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానానికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ డాక్టర్ చరణ్ కౌశిక్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం సిఎం రేవంత్‌రెడ్డికి చరణ్ కౌశిక్ యాదవ్ లేఖ రాశారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే కార్యక్రమానికి డెయిరీ రంగం కీలకంగా ఉపయోగపడునుందని ప్రతి రెండు మండలాలను ఒక క్లస్టర్‌గా గుర్తించి, మహిళా స్వయం సహాయక సంఘాల (ఆధ్వర్యంలో ఆధునిక డెయిరీ యూనిట్లను ఏర్పాటు చేయాలని లేఖ ద్వారా కోరారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్రీయ గోకుల్ మిషన్, హెచ్‌ఐడిఎఫ్‌ఫ్, ఎన్‌డిడిబి వంటి కేంద్ర పథకాల సహకారం, సబ్సిడీలు, రుణ సదుపాయాలను వినియోగించుకోవచ్చాని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమి, బ్యాంకు రుణాలకు సంస్థాగత సహకారం అందిస్తే చాలని పేర్కొన్నారు. మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే పాలనువిజయ డెయిరీ ద్వారా సేకరించేలా ప్రత్యేక మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. దీంతో స్థానికంగా పాల ఉత్పత్తి పెరగడంతో పాటు, నాణ్యమైన పాలను అందుబాటులోకి తీసుకువచ్చాన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి పాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు, గ్రామీణ మహిళలకు స్థిరమైన ఆదాయం, ఉపాధి కల్పించడం ద్వారా డెయిరీ రంగంలో ఏడాదికి సుమారు రూ.10 వేల కోట్ల మేర ఆర్థిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమ శాఖల అధికారులతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రతి రెండు మండలాలకు ఒక డెయిరీ క్లస్టర్ ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలించి అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చరణ్ కౌశిక్ యాదవ్ కోరారు.

# రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్‌ఎస్‌కు లేదు

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతుల బ్యాంకుల రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు బిఆర్‌ఎస్ నాయకులకు లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు రూ.1లక్ష రుణమాఫీని కూడా సక్రమంగా అమలు చేయలేని బిఆర్‌ఎస్ నేతలు.. రైతుల పట్ల కపట ప్రేమ చూపిస్తూ తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వమని, దేశంలోనే తొలిసారిగా రూ.2లక్షలలోపు పంట రుణాలను ఒకే పంటకాలంలో మాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయంతో రూ.20,616.89 కోట్ల పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేసి 25,35,964 మంది రైతులకు ప్రయోజనం కల్పించామని వెల్లడించారు. 2014లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రం మిగులు బడ్జెట్‌లో ఉందని తుమ్మల గుర్తుచేశారు. అయినప్పటికీ రూ.లక్ష వరకు రుణమాఫీని ఒకేసారి చేయకుండా 4 ఏళ్ల పాటు విడతల వారీగా అమలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి రూ.2 లక్షలలోపు పంట రుణాలను చెల్లించి మాట నిలబెట్టుకున్నామన్నారు. రుణమాఫీ అమలులో కొన్ని ఖాతాల్లో సాంకేతిక, ఆధార్ లింకింగ్ తదితర సమస్యలు తలెత్తినప్పటికీ వాటిని పరిష్కరించేందుకు అధికారులు రెండు నెలలపాటు గ్రామాల వారీగా ఇంటింటికీ వెళ్లారని తుమ్మల తెలిపారు. అర్హత ఉన్న ఏ రైతు మిగిలిపోకుండా నాలుగో విడతలో కూడా రుణమాఫీ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. బ్యాంకుల్లోని అన్ని రకాల రుణాలను రుణమాఫీ చేయలేదని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షలలోపు పంట రుణాలను మాత్రమే మాఫీ చేసిందని స్పష్టం చేశారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు వేర్వేరనే విషయాన్ని దాచిపెట్టి బిఆర్‌ఎస్ నేతలు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రుణమాఫీకి సంబంధించిన పూర్తి వివరాలను అసెంబ్లీ సాక్షిగా సభ్యులకు అందించామని మంత్రి తెలిపారు. రుణమాఫీ పొందిన 25 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల వివరాలను నియోజకవర్గాలు, గ్రామాల వారీగా కూడా అందించామని చెప్పారు.అయినప్పటికీ పదే పదే రుణమాఫీ జరగలేదని బీఆర్‌ఎస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనన్నారు. రుణమాఫీపై మాట్లాడే ముందు బిఆర్‌ఎస్ నేతలు తమ గత పాలనలో చేసిన రుణమాఫీ చరిత్రను ఒకసారి పరిశీలించుకోవాలని తుమ్మల సూచించారు.

# టిజి సేఫ్ కమిషనర్‌గా అవినాష్ మహంతి బాధ్యతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఆహారం, ఔషధాల నాణ్యత ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు సురక్షితమైన ఆహారం, నాణ్యమైన ఔషధాలు అందేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ స్టాండరడ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్)ను ఏర్పాటు చేసింది. టిజి సేఫ్ కమిషనర్‌గా అవినాశ్ మహంతి సోమవారం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. టిజి సేఫ్ డైరెక్టర్‌గా కూడా ఆయన కొనసాగనున్నారు. ఆహార భద్రత, ఔషధ నియంత్రణకు సంబంధించిన విభాగాలను సమన్వయం చేస్తూ ప్రభుత్వం టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేసింది. ఆహార పదార్థాల నాణ్యత, ఔషధాల ప్రమాణాలు, ప్రజారోగ్య భద్రతకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా పర్యవేక్షణ చేపట్టేందుకు ఈ వ్యవస్థను రూపొందించింది. ఆహారం, ఔషధాల నాణ్యత విషయంలో మరింత సమర్థవంతమైన నియంత్రణ, పర్యవేక్షణ ఉండేలా టీజీ సేఫ్ పని చేయనుంది. ప్రజలకు నాణ్యమైన ఆహారం, సురక్షితమైన ఔషధాలు అందేలా సంబంధిత విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచడం ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యంగా ఉండనుంది.

# వందేమాతరంపై కాంగ్రెస్ వైఖరి సరికాదు

## బిజెపి, బిజెవైఎం ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ గేయం 'వందేమాతరం' ఆలాపన సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు వ్యవహరించిన తీరుపై తెలంగాణ బిజెపి తీవ్ర స్థాయిలో మండిపడింది. వందేమాతరం గేయాన్ని అవమానించడం దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనాయకత్వం దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఒబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశంతో పాటు పార్టీ చేరికల కార్యక్రమంలో రామచందర్‌రావు మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయులకు స్ఫూర్తినిచ్చిన 'వందేమాతరం'కు పూర్తి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వందేమాతరం ఆలాపన సమయంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వ్యవహరించిన తీరు తీవ్రంగా అభ్యంతరకరమని ఆయన ఆరోపించారు.దేశ గౌరవం, జాతీయ భావాలు, దేశభక్తి విషయంలో రాజకీయాలకు తావు ఉండకూడదని రామచందర్‌రావు అన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను దెబ్బతీసే భావజాలాల పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నగరాల్లో 'అర్బన్ నక్సల్స్' పేరుతో కొందరు యువతను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ.. దేశ వ్యతిరేక భావజాలాన్ని తిప్పికొట్టాలని సూచించారు.

**బిసిల హక్కులపై కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌పై విమర్శలు..** ఒబిసి మోర్చా సమావేశంలో బిసి రిజర్వేషన్లు, సంక్షేమంపై కూడా రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బిఆర్‌ఎస్ బిసిలకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బిసిల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎంబిసి కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు కేటాయించడం లేదని, ఇప్పటివరకు ఎంతమందికి ప్రయోజనం కల్పించారో ప్రభుత్వం ప్రజలకు నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం బిసి వర్గాలకు ప్రాధాన్యం కల్పిస్తోందని పేర్కొంటూ.. కేంద్ర పథకాల ద్వారా బిసిలకు అందుతున్న ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మరోవైపు, వందేమాతరం గేయం పట్ల కాంగ్రెస్ నేతల వైఖరిని నిరసిస్తూ బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలో నిరసన చేపట్టారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుండే నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

# హైదరాబాద్‌లో అస్మితా ఖేలో ఇండియా మహిళల వుషు లీగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అస్మితా ఖేలో ఇండియా మహిళల వుషు లీగ్ – హైదరాబాద్ జిల్లా పోటీలు టోలిచౌకిలోని స్ప్రింగ్‌ఫీలడ్స్ పాఠశాలలో క్రీడాభిమానులు, క్రీడాకారులు వుషు క్రీడా సంఘాల ప్రతినిధుల ఉత్సాహభరిత పాల్గొనడంతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని షేక్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఫరాజ్ ఉద్దీన్ ప్రారంభించారు. కార్యక్రమానికి స్ప్రింగ్‌ఫీలడ్స్ ఎడ్యుకేషన్ సీనియర్ ప్రిన్సిపాల్ హుమేరా హైదర్ హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. డా.వెంకటేశ్వరి కూడా కార్యక్రమానికి హాజరై తమ మద్దతును తెలిపారు. వుషు క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అమేచ్యూర్ వుషు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఆర్. ప్రేమ్ రాజ్, ఏడబ్ల్యూఓఏ ప్రధాన కార్యదర్శి మోడల్ అబ్దుల్ ఖురేషీ కార్యక్రమానికి హాజరయ్యారు.మాజీ అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు బి. జగన్నాథ్ స్వామి కూడా కార్యక్రమానికి హాజరై మహిళా క్రీడాకారులను అభినందించి, వారి ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమాన్ని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కు చెందిన ఎం.డి. ఫైసల్ వుషు క్రీడా సంఘాల సహకారంతో, స్ప్రింగ్‌ఫీలడ్స్ పాఠశాల సహకారంతో సమన్వయం చేసి నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన అతిథులు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారిణులు, తల్లిదండ్రులు మరియు స్ప్రింగ్‌ఫీలడ్స్ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్లను

# ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

## మూడు సంపత్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్త్రీ నిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్‌లో పూర్తిస్థాయిలో పనిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్లు (ఫీల్డ్ ఆపరేషన్స్)ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మూడు సంపత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సోమవారం స్త్రీ నిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ ఉద్యోగాలు లభించక కుటుంబ పోషణ కోసం ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళల స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడంతోపాటు వాటి రికవరీ కోసం అసిస్టెంట్ మేనేజర్లు విస్తృత భౌగోళిక ప్రాంతాల్లో నిరంతరం పర్యటించాల్సి వస్తోందన్నారు. రికవరీ యాప్‌ల వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించడం, క్షేత్రస్థాయిలో సేవలందించడం, మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాలను వందశాతం వసూలు చేయాలన్న అధికారుల ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో పనిచేస్తున్నప్పటికీ కేవలం ఒప్పంద ప్రాతిపదికన కొనసాగిస్తున్నారని, ప్రమోషన్లు, జీతభత్యాల పెంపు, ఉద్యోగ క్రమబద్ధీకరణ లేకపోవడంతో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి అసిస్టెంట్ మేనేజర్లకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలు కల్పించడంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సంపత్‌కుమార్ కోరారు. సమ్మేళనంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.సురేష్, వైస్ ప్రెసిడెంట్ రజిత, ఇసి సభ్యులు దీప, సుభాష్, రజిత, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్, రంజిత్, యాసిన్, గౌతమి, సైదేశ్ తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

# జెఎస్‌ఎస్‌సి-సిజిఎల్ పరీక్ష రద్దు

కూడా ముఖ్యమంత్రి ఆదేశించారు. '2014 నుండి జరిగిన చిన్న లేదా పెద్ద లోపాలన్నింటిపై సమగ్ర విచారణ జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఎంఎండిఆర్ చట్టానికి చేసిన సవరణలపై చర్చించడానికి త్వరలో సమావేశమవుతాము. అవసరమైతే, ఈ నిర్దిష్ట అంశంపై చర్చించడానికి ప్రత్యేక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేస్తాము' అని అన్నారు. సిట్, సిఐడి జరిపిన విచారణలో అనేక దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని సోరెన్ తెలిపారు. విచారణ కొనసాగుతున్నందున, ప్రతి వివరాలను బహిరంగంగా వెల్లడించడం సాధ్యం కాదు, అయితే, సిజిఎల్ ప్రక్రియ ద్వారా నియమితులైన వ్యక్తులు ఇప్పుడు జెపిఎస్‌సి పరీక్షలలోని అవకతవకలకు సంబంధించిన ఆరోపణలపై అరెస్టు అవుతున్నట్లు గమనిచామని, అంతేకాకుండా, వివిధ సమయాల్లో ఇక్కడ పనిచేసిన అనేక కంపెనీలతో కూడిన ఒక సంక్లిష్టమైన, పరస్పర సంబంధం ఉన్న నెట్‌వర్క్ ఉన్నట్లు కనిపిస్తోంది' అని ఆయన అన్నారు. 2014 నుండి జరిగిన పరీక్షలపై సమగ్ర విచారణ జరపాలని సంబంధిత శాఖను, సిఐడిని ప్రభుత్వం ఆదేశించిందని ఆయన చెప్పారు.

**ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : దేవేంద్ర నాథ్ మహతో**

కాగా, విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. ఈ ఉద్యమానికి మద్దతు ఇచ్చినందుకు సోరెన్, రాష్ట్ర యంత్రాంగం, పోలీసులు, మీడియా, విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ప్రకటనతో 15 రోజుల తన నిరాహారదీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. కొనసాగుతున్న విచారణకు, నియామక పరీక్షల వ్యవస్థను ప్రక్షాళన చేసే ప్రయత్నాలకు విద్యార్థులు సహకరిస్తారని మహతో చెప్పారు. అయితే, భవిష్యత్తులో పేపర్ లీక్‌లు, ఇతర అవకతవకలను నివారించడానికి నిర్మాణాత్మక సంస్కరణలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. 'మేము, విద్యార్థులుగా, ఈ దర్యాప్తుకు, ఈ అవినీతి వ్యవస్థను దాని మూలాల నుండి నిర్మూలించే ప్రయత్నానికి మద్దతు ఇవ్వడం కొనసాగిస్తాము. కొనసాగుతున్న సంస్కరణల ప్రక్రియకు సంబంధించి మా పోరాటాన్ని కొనసాగిస్తాము' అని మహతో అన్నారు. భవిష్యత్తులో పేపర్ లీక్‌లు, పరీక్షా అవకతవకలు జరగకుండా హామీ ఇచ్చే వ్యవస్థను కోరుతూ తమ సమస్యలు పరిష్కారమై, డిమాండ్లు నెరవేరితే, మరిన్ని నిరసనలు ఎందుకు చేయాలి?' అని ఆయన అన్నారు. జార్ఖండ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్‌సి), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన పరీక్షలలో జరిగిన అవకతవకల ఆరోపణల నేపథ్యంలో రాంచీలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళన సోమవారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావాలని, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ నియామక పరీక్షలలో పేపర్ లీక్‌లు, అవకతవకలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు.

# ముగిసిన 60రోజుల గడువు

**పెరిగిన ఇరాన్–అమెరికా విభేదాలు**

**జెరూసలేం:** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ జూన్ మాసంలో, వైల్స్ వేదికగా కుదుర్చుకున్న మధ్యంతర ఒప్పందం ప్రకారం ఇరాన్‌తో యుద్ధాన్ని ముగించి, ఆ దేశ అణు కార్యక్రమంపై శాశ్వత ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇచ్చిన 60 రోజుల గడువు సోమవారంతో ముగిసింది. అయితే గడువు ముగిసే సమయానికి అమెరికా, ఇరాన్ మధ్య విభేదా లు మరింత పెరిగాయి. ప్రస్తుతం చర్చల ప్రధాన అంశాలు హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఇరాన్‌పై అమెరికా విధించిన నౌకాశ్రయ దిగ్బంధాన్ని ఎత్తివేయడం. మధ్యంతర ఒప్పందం ప్రకారం అవి అమలు జరగాల్సి ఉన్నప్పటికీ, ఇరుపక్షాల మధ్య రాజీకి సంబంధించి ఎలాంటి సంకేతాలు కనిపించడం లేదు. అణు కార్యక్రమంపై వివరమైన చర్చలు కూడా ప్రారంభమైనట్లు ఆధారాలు లేవు. జూన్ ఒప్పందం అన్ని సైనిక చర్యలను నిలిపివేసి, 60 రోజుల్లో యుద్ధాన్ని శాశ్వతంగా ముగించేందుకు ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్దేశించింది. హోర్ముజ్‌ను తిరిగి తెరవాలని కూడా నిర్ణయించింది. అయితే నౌకల రాకపోకలను నిర్వహించడంలో ఇరాన్ పాత్ర ఏమిటనేది స్పష్టం చేయలేదు. దీనిని ఇరాన్ జలసంధిపై తనకు నియంత్రణ కల్పించే నిబంధనగా భావిస్తోంది. ఒప్పందం కుదిరిన వారం తర్వా త ఇరాన్ ఒమన్ తీరానికి సమీపంలోని మార్గంలో నౌకలపై కాల్పులు ప్రారంభించింది. ఈ మార్గం అమెరికా సైనిక పర్యవేక్షణలో ఉంది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్‌పై దాడి చేయగా, జోర్డాన్, కువైట్, బహ్రెయిన్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడులు చేసింది.

అనంతరం అమెరికా ఇరాన్ చమురు ఎగుమతులపై ఉన్న మినహాయింపులను రద్దు చేసి, నౌకాశ్రయాలపై దిగ్బంధాన్ని పునరుద్ధరించింది. దీంతో జూన్ ఒప్పందం దాదాపు పూర్తిగా కుప్పకూలింది. ఇరాన్ ప్రస్తుతం అమెరికా దిగ్బంధాన్ని ఎత్తివేయాలని, ఇరాన్ చుట్టుపక్కల నుంచి అమెరికా బలగాలను ఉపసంహరించాలని, యుద్ధ నష్టాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. హోర్ముజ్‌పై తాను నియంత్రణ కొనసాగిస్తామని కూడా చెబుతోంది. ట్రంప్ ఈ డిమాండ్లను తిరస్కరించారు. ఆర్థిక దిగ్బంధం, దీర్ఘకాలిక ఆంక్షల ద్వారా ఇరాన్‌పై ఒత్తిడి పెంచి ఆ దేశ నాయకత్వాన్ని వెనక్కి తగ్గేలా చేయాలని అమెరికా ప్రయత్నిస్తోంది. యుద్ధం, ఆంక్షలతో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ద్రవ్యోల్బణం పెరిగింది. ఇదే అదనుగా ఇరాన్‌ను మరింత ఇరుకున పెట్టడం అమెరికా లక్ష్యంగా కనిపిస్తున్నది. కాగా, హోర్ముజ్ ద్వారా చమురు, ఇంధన రవాణా యుద్ధానికి ముందు స్థాయితో పోలిస్తే చాలా స్వల్పంగా ఉంది.

సంక్షోభం కొనసాగితే ఇంధన ధరలు మరింత పెరిగి, మధ్యప్రాచ్యానికే పరిమితం కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్, అమెరికా రెండూ తమ వైఖరికి కట్టుబడి ఉండటంతో తదుపరి పరిణామాలు అనిశ్చితంగా మారాయి.



## ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలి

### డిసిసి అధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్

ప్రజాపక్షం/చర్లపల్లి: పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వజ్రేష్‌యాదవ్ విచ్చేసి మాట్లాడుతూ ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారం, రాబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేముల మహేష్‌గౌడ్, నాయకులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, ప్రవీణ్, భూమయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ 11వ ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాపక్షం/చర్లపల్లి: మనం తినే ప్రతి మెతుకు పరబ్రహ్మ స్వరూపమని ఒక మెతుకు కూడా వృధా చేయవద్దని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ మాజీ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాలులో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320 సి నూతన గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన 11వ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సేవలందించడానికి ముందుకు వచ్చి తమ సొంత డబ్బులను ఖర్చు చేస్తూ సేవలను చేస్తున్న లయన్ క్లబ్ వారందరినీ అభినందించారు. మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మంద సురేష్, రెండవ వైస్ గవర్నర్ శేఖర్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ చీఫ్ కోఆర్డినేటర్ రాములు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్లు కె హరీష్‌రెడ్డి, ఇన్నారెడ్డి, సూర్య నారాయణ, పావనీరెడ్డి, సుమలత,రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు వ్యవసాయంపై అవగాహన

ప్రజాపక్షం/శామీర్‌పేట : మహిళలు కిచెన్ గార్డెన్, కూరగాయల సాగుపై అవగాహన పెంచుకోవాలని, ఇంటికి అవసరమైన కూరగాయలను సేంద్రీయ ఎరువులతో పండించుకోవాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం శామీర్‌పేటలోని మహిళ శక్తి భవనంలో మహిళ గ్రూప్ సభ్యులకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో వ్యవసాయంలో మెళకువలు, కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎడిఎ వెంకట్‌రాంరెడ్డి, ఎం రమేష్, హెచ్‌ఓ వెంకటరమణ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు అజయలక్ష్మి , మండల అధ్యక్షురాలు లావణ్య, ఎపిఎం నాగశ్రీ, ఎఇఒలు సుధీర్‌కుమార్, అర్చన, మెప్మా సిబ్బంది ఉమేష్, మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

## శక్తినగర్ ముస్లిం సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా ఎండి ఖాసిం



ప్రజాపక్షం/కాప్రా : మల్లాపూర్ డివిజన్‌లోని శక్తి నగర్ ముస్లిం సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా ఎండి ఖాసిం ఎన్నికయ్యారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడిగా ఎండి అజ్మత్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ రహమాన్, కోశాధికారిగా సయ్యద్ షర్ఫుద్దీన్, సలహాదారులుగా ఎండి హుస్సేన్, ఎండి అక్బర్, ఎండి గౌస్‌లు ఎన్నికయ్యారు.

## ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలు షురూ




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ప్రభుత్వ ఐటిఐలో 2026–27 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. రెండేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 40, రెండేళ్ల ఫిట్టర్ ట్రేడ్‌లో 40, రెండేళ్ల ఎలక్ట్రిక్ వాహనా ల మెకానిక్ ట్రేడ్‌లో 24, ఒక ఏడాది ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ ట్రేడ్‌లో 20, ఒక ఏడాది ఇండస్ట్రియల్ రోబోటిక్స్, ఒక ఏడాది డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ ట్రేడ్‌లో 40, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ ట్రేడ్‌లో 40, రెండేళ్ల బేసిక్ డిజైన్, పర్సనల్ విరిఫికేషన్ ట్రేడ్‌లో 24 సీట్లకు ప్రవేశాలు ఉంటాయన్నారు. అనుభవజ్ఞులైన బోధకులు, ఆధునిక వర్క్‌షాపులు, ల్యాబ్‌లు, పరిశ్రమల అవసరాల మేరకు అనుగుణమైన శిక్షణ, ఉపాధి, ప్లేస్‌మెంట్ అవకాశాల కల్పన ఐటిఐలో ఉంటాయన్నారు. తమ ధరఖాస్తులను www.iti telangana.gov.in పోర్టల్ ద్వారా చేయాల్సి ఉంటుందని, మరిన్ని వివరాల కోసం ఐటిఐలో సంప్రదించాలని, అవసరమైతే తమను 9866843920, 9346397755, 9182060600 ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

## డ్యూటీలో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడి

ప్రజాపక్షం /వికారాబాద్ : డ్యూటీలో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై దాడి ,తప్పుడు కేసులను ఉపసంహరించి న్యాయం చేయాలని వికారాబాద్ జిల్లా పంచాయతీ కార్యదర్శిలు సోమవారం నాడు జిల్లా కలెక్టర్‌కు వినితిపత్రం అందజేశారు. పెద్దముల్ మండలం యంపిడిఒ కార్యాలయంలో అధికారిక విధులు నిర్వహిస్తున్న మల్లేశం సవితపై కందనెల్లి తండా సర్పంచు రాథోడ్ ఆనంద్ నాయక్, అతని కుమారుడు నితీష్ కుమార్ కారణం లేకుండా తిట్టి ,భౌతికంగా దాడి చేశారన్నారు. దాడికి గురైన ప్రభుత్వ ఉద్యోగులపైనే పోలీసులు తిరిగి తప్పుడు కౌంటర్ కేసు నమోదు చేశరాన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిర్యాదు అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవలన్నారు.

# 14 ఏళ్లకే భారీ చోరీ

* నాలుగు బైకులు చోరీ చేసిన మైనర్ బాలుడు
* స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ద్విచక్ర వాహనాలు చోరీలు చేస్తున్న ఓ మైనర్ బాలుడి ని పోలీసులు అదుపులోకి తీసుకొని నాలుగు చోరీ వాహనాలను మేడిపల్లి పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. చెంగిచర్ల ప్రాంతాని కి చెందిన 14 ఏళ్ల ఓ బాలుడు చెడు అలవాట్ల కులోనై తన అవసరాల కోసం పార్కింగ్ చేసిన బైకులను గుట్టు చప్పుడు కాకుండా మారు తాళాలతో తీసి చోరీ చేస్తున్నా



డు. ఈ విధంగా గత నెల రోజులుగా నాలుగు బైకులను చోరీచేసి వాటిని అమ్మి సొమ్ము చేసుకోవాలని ఓ ప్రదేశంలో దాచాడు. విశ్వనీయ సమాచారంతో మేడిపల్లి క్రైం విభాగ పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకొని విచారించి అతడు చేసిన చోరీ బైకులను స్వాధీనం చేసుకొన్నారు. చట్ట ప్రకారం బాలుడిని జువైనల్ న్యాయస్థానం ఎదుట హాజరు పరచనున్నామని ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి తెలిపారు. చోరీ కేసును ఛేదించటంలో విశేష కృషి చేసిన డిఎస్‌ఐ శ్రీను, ఏఎస్సై బాలసింగ్, హెచ్‌సిలు సునీల్, రా ము, పిసిలు మహిపాల్, వినోద్, హరిబాబు, శివకుమార్, డబ్ల్యుపిసి విశాలిలను ఉన్నతాధికారులు అభినందించారు.

**కోడిపందాలు నిర్వహిస్తున్న ఇద్దరు అరెస్ట్**



మేడ్చల్ జిల్లా చెంగిచర్ల ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్న ఇద్దరిని మేడిపల్లి పోలీసు లు అరెస్టు చేసారు. నిందితుల నుండి రూ. 3005 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. చట్ట విరుద్ధంగా కోడిపందాలు, జూదం నిర్వహించటం తో పాటు వాటిలో పాల్గొన్న వారిపై చట్ట ప్రకా రం చర్యలు తప్పవని ఇనస్పెక్టర్ జలేందర్‌రెడ్డి హెచ్చరించారు.

**భర్తను హతమార్చిన భార్య అరెస్టు**

భర్తను హతమార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరిచి తప్పించుకొని తిరుగుతున్న ఓ మహిళను మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్జాదిగూడ సమీపంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సత్యనారాయణ(51) ఈ నెల 6న ఇంటికి వచ్చిన సమయంలో భార్య (సునీత) గొడవ జరిగింది. ఘర్షణగా మారిన ఈ గొడవతో ఆగ్రహానికి గురైన భార్య భర్త చేతులు, కాళ్లను చీరతో కట్టేసి సెంట్రింగ్ కర్రతో తలపై తీవ్రం గా కొట్టటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. రోడ్డు ప్రమాదంలో బైకుపై నుండి వస్తుండగా జారి పడటంతో గాయాలకు గురయ్యాడంటూ కుమారుడికి చెప్పి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొన్న పోలీసులు శవ పంచనా మా రిపోర్టు, వైద్యుల అభిప్రాయాలు, సిసి కెమెరా దృశ్యాల ఆధారంగా భార్యను విచారించగా తానే భర్తను హతమార్చానని ఒప్పుకొంది. దీంతో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి తెలిపారు.



## హల్ద్వానీ ఘటనకు నిరసనగా మార్చ్, సత్యాగ్రహం : ధారసింగ్



ప్రజాపక్షం/వికారాబాద్: హల్ద్వా నీ ఘటనను నిరసిస్తు, ఎఐసిసి పిలుపు మేర కు వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం, వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్‌టిఆర్ చౌరస్తా నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ మార్చ్, సత్యాగ్రహం నిర్వహించారు. ఈ సందర్భంగ డిసిసి అధ్యక్షులు ధారసింగ్ మాట్లాడుతూ హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని శుద్ధీకరణ పేరుతో అవమానించడం అత్యంత ఖండనీయమ ని అన్నారు. ఇటువంటి చర్యలు భారత రాజ్యాంగం ప్రతిపాదించిన సమానత్వం, సామాజిక న్యాయం సోదరభావం, మానవ గౌరవం అనే విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సత్యాగ్రహంలో రాజ్యాంగ పరిరక్షణకు విపక్ష, నిర్మూలనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, మండల అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, కిషన్‌నాయక్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో బాధ్యతాయుతంగా పనిచేసిన బిఎల్‌ఎలకు శుభాకాంక్షలు

ప్రజాపక్షం/నిజాంపేట్ : సర్ ప్రక్రియలో బాధ్యతయుతంగా పనిచేసిన ప్రతి ఒక్కరు కీలకంగా పనిచేశారని, బూత్ స్థాయిలో బిఎల్‌ఎలు, నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో సర్2026 కార్యక్రమంలో భాగంగా బిఎల్‌ఎలకు, డివిజన్ అధ్యక్షులు, నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంఎల్‌ఎ కూన శ్రీశైలంగౌడ్, మాజీ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మాజీ కార్పోరేట్ కెఎం గౌరిష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రవన్‌కుమార్, బేకు శ్రీనివాస్, డిసిసి కమిటి సభ్యులు జాకీర్, లక్ష్మీ చౌదరి, గౌరిగే బాలప్ప, మహిళా కాంగ్రెస్ నాయకులు సుజాత యాదవ్, సుజాత, పల్లవి, అశ్విని, రేవతి, తదితరులు పాల్గొన్నారు.





## వివిఐఎస్‌ఎంలో పిజిడిఎం బ్యాచ్ ప్రారంభం

ప్రజాపక్షం/శామీర్‌పేట : శామీర్‌పేట డివిజన్ తూంకుంటలోని విశ్వవిశ్వాణి ఇన్స్‌ట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మెనెజ్‌మెంట్ (వివిఐఎస్‌ఎం) 21వ పిజిడిఎం బ్యాచ్‌ను సోమవారం అధికారికంగా ప్రారంభించింది. క్యాంపస్‌లోని సికె ప్రహ్లద్ హాల్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విశ్వవిశ్వాణి విద్యా సంస్థల అధ్యక్షుడు, వ్యవస్థాపక సభ్యుడైన జిఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగులలో భావోద్వేగ మేధస్సు, స్వీయ మూల్యాంకనం, వ్యవస్థాపక దృక్పథం కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. వివిఐఎస్‌ఎం డీన్, డైరక్టర్ డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ విద్యాపరమైన విజయాలతో పాటు వ్యక్తిత్వ వికాసం, పరివర్తన అంతే ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిగత ప్రతిభను మెరుగుపరుచుకుం టూ సాధారణ ప్రమాణాలకు మించి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. జిజ్ఞాసతో ఈ కోర్సును ప్రారంభించాలన్నారు. భవిష్యత్తుకు సిద్ధపడే సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మైండ్ స్పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకురాలు లక్ష్మి నాయర్ మాట్లాడుతూ ఆత్మ పరిశీలన బలాలు గుర్తించడం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవడం జీవితంలోని సవాళ్లను ఎదుర్కొనేందుకు తట్టుకునే శక్తిని అలవర్చుకోవడం గురించి విలువైన సూచనలు చేశారు. వృత్తిపరమైన వ్యక్తిగత జీవితాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన లక్షణాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో దయాకేర్ సొల్యూషన్స్ సహ వ్యవస్థాపకుడు, మెనేజింగ్ డైరక్టర్ అజిత్ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయంలో నాగ పంచమి వేడుకలు

ప్రజాపక్షం/జవహర్ నగర్ : శ్రావణ మాసంలోని శుక్ల పక్ష పంచమిని పురస్కరించుకుని జవహర్ నగర్‌లోని గాంధీ నగర్ కాలనీలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో నాగ పంచమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లుతున్నాయి. హిందూ సంప్రదాయంలో ప్రకృతే దైవస్వరూపం, జీవజాలాన్ని దైవంతో అనుసంధానించి చూడటం మన సంస్కృతిలో భాగం. అందులో భాగంగానే నాగులను పవిత్రంగా భావించి పూజించడం అనవాయితీగా వస్తోంది. శ్రావణ పంచమి నాడే నాగదేవతను ఆరాధించడం వల్ల కుటుంబానికి ఆయురారోగ్యాలు, సంతాన ప్రాప్తి, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో శుభ ముహూర్తాన నాగదేవత ప్రతిమలకు, పుట్టలకు పుట్టపాలు పోసి, ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించనున్నారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని, నాగదేవతను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

## తుది ఓటరు జాబితా వెల్లడి

### కలెక్టర్ దీపక్‌తివారి



ప్రజాపక్షం/వికారాబాద్: జిల్లా తుది ఓటరు జాబితా ను ఎస్ఐఆర్ అనంతరం సోమవారం, వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి ప్రకటించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలలో వికారాబాద్ పురుషులు 92 104, ఇందులో మహిళలు 93 605, హిజ్రాలు 17 మొత్తం 185726, పరిగి లో పురుషులు 112589, మహిళలు 1;10 808, హిజ్రాలు 7, మొత్తం 2;23404, తాండూర్‌లో పురుషులు, 90804 ,మహిళలు 95895, హిజ్రాలు 5 మొత్తం 186704, కొడంగల్‌లో పురుషూలు 104 762, మహిళలు 106773, హిజ్రాలు, మొత్తం 2115 40, జిల్లాలో మొత్తం పురుషూలు 400259, మహిళలు 407081, హిజ్రాలు 34, మొత్తం జిల్లా ఓటర్లు 807374మంది ఉన్నట్లు తది ఓటరు జాబితాను జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి వివిధ పార్టీల నాయకులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతు మార్పులు చేర్పులు, తొలగింపులకు సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. అభ్యంతరాలు ఉన్నట్లయితే నిర్ణీత ప్రక్రియ ప్రకారం తెలియజేయవచ్చన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రు ఓటరు జాబితాలో ఉండేలా ఓటర్లును పారదర్శకంగా రుపొందించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఒక కుటుంబం అన్ని ఓటర్లు అందరు ఒకేచోట ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటచారి, డిఆర్ ఓ స్వర్ణలత, నేమహత్‌హలీ, విక్రం, తహసీల్దార్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణికి 113 దరఖాస్తులు స్వీకరణ:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతలనుండి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి 113 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉండకుం డా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈరోజు నుండి ప్రతి ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటచారి, ట్రైనింగ్ కలెక్టర్ సచిన్‌బస్వరాజ్, జెడ్పి సిఇఒ సుధీర్, డిఆర్‌ఒ స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 92 అర్జీలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహించిన ప్రజావాణిలో 92 అర్జీలు దాఖలు చేసారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ధరఖాస్తుదారులు కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్‌కిస్తే అయినా మోక్షం లభిస్తుందన్న ఆశతో కదలి వచ్చి తమ వంతు కోసం ప్రజావాణిలో కలెక్టరేట్ కార్యాలయానికి చేరారు. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ డిఆర్ఓ మాలతితో కల్సి అర్జీలను స్వీకరించారు. అనంతరం అయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వ్య య ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని అధికారులకు సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.




## ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/మల్కాజిగిరి : తెలంగాణా ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న డిమాండ్‌తో సోమవారం టియుజెఏసి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. కెకె కమిటీ సిఫార్సులు వెంటనే కాలయాపన లేకుండా ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం కేటాయించాలని, రూ.25వేల గౌరవ వేతనం చెల్లించాలని, 100 ఎకరాల స్థలంలో అమర వీరుల స్మృతి వనం నిర్మించాలని, ఆరోగ్య బీమా కల్పించాలని, కోటి రూపాయల మేరకు రుణ సదుపాయం కల్పించాలని, ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులను ఇవ్వాలని ఈ సందర్భంగా జెఏసి రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిఎన్ జాంబవ్, కొప్పుల కృష్ణ, ఆలకుంట కృష్ణ, పెంటయ్య, ఎడ్ల వెంకటేష్, శ్రీనివాస్, రేణుక, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభం కానున్న వాజ్‌పేయినగర్ ఆర్‌యుబి నిర్మాణ పనులు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వాజ్‌పేయి నగర్ రైల్వే గేట్ వద్ద చేపడుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబి) నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రహదారి మీదుగా రాకపోకలు చేసే వాహనాలపై తాత్కాలికంగా ఆంక్షలు విధించి ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేయనున్నారు. నేరేడ్‌మెట్ ఎక్స్ రోడ్ నుండి వినాయక్‌నగర్ జంక్షన్, సఫిల్‌గూడ వైపు వెళ్లే సాధారణ వాహనాలను అనుమతించకుండా సైనిక్‌పురి, కెనరా బ్యాంక్ జంక్షన్, ఓల్డ్ సఫిల్‌గూడ, వినాయక్‌నగర్ మీదుగా ఆనంద్ బాగ్ వైపు మళ్లించనున్నారు. ప్రత్యామ్నాయంగా వాయుపరి, కాకతీయనగర్, నేరేడ్‌మెట్ పాత పోలీస్‌స్టేషన్ సర్కిల్, వినాయక్‌నగర్ మీదుగా ఆనంద్‌బాగ్ చేరుకోవచ్చు. వినాయక్‌నగర్ జంక్షన్ వద్ద సఫిల్‌గూడ, వినాయక్‌నగర్ జంక్షన్ నుండి నేరేడ్‌మెట్ ఎక్స్ రోడ్ వైపు వెళ్లే వాహనాలను ఓల్డ్ సఫిల్‌గూడ డి మార్ట్ వైపు మళ్లిస్తారు. ఆర్‌యుబి నిర్మాణ పనుల సందర్భంగా సోమవారం ట్రాఫిక్ విభాగ డిసిపి రాహుల్‌రెడ్డి, ట్రాఫిక్ విభాగ ఇనస్పెక్టర్లు నరసింహ, ఎంఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు దివ్యజ్యోతిలు ఈ ప్రాంతాన్ని సందర్శించి ట్రాఫిక్ మళ్లింపుల గురించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి పరిశీలించారు.



## సిపిఐ నుండి తోటపల్లి శంకర్ బహిష్కరణ

### జిల్లా కార్యదర్శి ఉమామహేష్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : పార్టీ వ్యతిరేక కార్యలాపాలకు పాల్పడుతున్నాడన్న కారణంగా సిపిఐ మేడ్చల్ జిల్లా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోటపల్లి శంకర్‌ను పార్టీ నుండి బహిష్కరించారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శంకర్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం సైతం రద్దు చేసామని, ఇకపై పార్టీకి శంకర్‌కు ఎలాంటి సంబంధాలు లేవని ఆయన స్పష్టం చేసారు. సిపిఐ నిబంధనావళికి వ్యతిరేకంగా వ్యవహరించినందునే శంకర్‌పై ఈ మేరకు పార్టీ జిల్లా కార్యవర్గంలో తీర్మానించామని ఆయన తెలిపారు.



## దళిత రైతులకు మద్దతుగా ఈటల

ప్రజాపక్షం/దుండిగల్ : ఓటేసిన పాపానికి దళిత రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యం చేయడం అమానుషమని ఇందిరమ్మ రాజ్యం అంటే ఇంటింటా సౌభాగ్యం అనుకున్నాము కాని దళితుల పొట్టకొట్టే పాపానికి ఒడికడతారని అనుకోలేదని సుమారు 60 సంవత్సరాలు దున్నుకుంటు సాగుచేస్తున్న రైతుల భూమిని రాష్ట్ర ప్రభుత్వం లాక్కుంటే ఊరుకునేది లేదని రైతుల పక్షాన బిజెపి పోరాడుతుందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ బౌరంపేట సర్వే నంబర్ 472లో 32 ఎకరాల ప్రభుత్వ భూమిని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు ఇటీవల అధికారులు అప్పజెప్పడంతో నిరసన కార్యక్రమంలో రైతులకు మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు 60 సంవత్సరాల క్రితం దళితుల జీవనోపాధికోసం ఇందిరాగాంధీ కేటాయించిన భూమిని ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా లాక్కొవడం సిగ్గుచేటన్నారు. నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వ దళిత భూములు లాక్కొని సంపన్నులకు అప్పచెపితే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారులకోసం పనిచేస్తుందన్నారు. దళితుల కోసం ఇందిరమ్మ పట్టాలు ఇచ్చారన్న విశ్వాసంతో నాటి నుండి నేటి వరకు కాంగ్రెస్ పక్షాన నిలబడి ఓట్లు వేసిన పాపానికి దళిత రైతుల భూములు లాక్కొని కాంగ్రెస్ ప్రభుత్వం బౌరంపేట రైతులకు అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు మల్లారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ కొమ్ము మంగమ్మ, బిజెపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పాండు ఆశయాలు నేటి యువతకు ఆదర్శం

ప్రజాపక్షం/నిజాంపేట్ : దివంగత నేత కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కెఎం పాండు ఆశయాలు, సేవా స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని టిఆర్‌ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. సోమవారం 132 జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో అసోషియేషన్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్, దివంగత నేత కెఎం పాండు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం అంకిత భావంతో పనిచేసిన నాయుకుడిగా ప్రజల మనుసులో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. కె ఎం పాండు జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళ్లర్పిస్తు ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు నర్సింహారెడ్డి, బలవంత్‌రెడ్డి, పెద్ది మల్లేషం, నల్ల లింగం, ఆర్. మురళీగౌడ్, నరహరి, రామన్, నాగేష్, లక్ష్మ ణచారి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
మంగళవారం
18-08-2026
www.prajapaksham.in

"మాస్ మహారాజా రవితేజ లేటెస్ట్ మూవీ 'ఇరుముడి' ఆగస్టు 21న థియేటర్లలో విడుదల కానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఇరుముడి'లోని భక్తి భావానికి మరింత ఎనర్జీని జోడిస్తూ మేకర్స్ మోస్ట్ అవైటెడ్ 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేశారు."

# రీల్

## సంక్రాంతికి సంబరాలు



హీరో సాయి దుర్గ తేజ్ పాన్ఇండియా చిత్రం సంబరాల ఏటిగట్టు (ఎస్వైజి ) షూటింగ్ మొత్తం పూర్తయింది. నూతన దర్శకుడు రోహిత్ కెపి దర్శకత్వంలో ప్రైమోషన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ యాక్షన్ డ్రామా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశను వేగంగా పూర్తి చేసుకుంటోంది. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. విడుదలైన పోసర్‌లో సాయి దుర్గ తేజ్ ఇంటెన్స్ రఫ్ అవతార్‌లో కనిపిస్తున్నారు. రక్తంతో, గాయాలతో నిండిన శరీరంతో, మంటల్లో చిక్కుకున్న ప్రదేశంలో, చేతిలో ఆయుధం పట్టుకుని టెర్రిఫిక్ కనిపిస్తున్నారు. కాలిపోతున్న కట్టడాలు, పొగ, సంఘర్షణ, హైవోల్టేజ్ యాక్షన్‌తో నిండిన ప్రపంచాన్ని సూచిస్తున్నాయి. భారీ స్థాయిలో నిర్మించిన ఈ చిత్రాన్ని అనేక ప్రదేశాలలో, భారీ సెట్లతో, భారీ యాక్షన్ సన్నివేశాలతో చిత్రీకరించారు. ఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ళ కూడా ఈ తారాగణంలో భాగమై, ప్రముఖ పాత్రలలో కనిపించనున్నారు. వెట్రివేల్ పళనిస్వామి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, బి. అజనీష్ లోక్నాథ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ఎడిటర్ నవీన్ విజయ్ కృష్ణ, ప్రొడక్షన్ డిజైనర్ గాంధీ నడికుడికర్, ఫైట్ మాస్టర్స్ పీటర్ హెయిన్స్, రామ్ లక్ష్మణ్, చేతన్, పృథ్వీ.



## 'ఇరుముడి'...ఓ భావోద్వేగ ప్రయాణం

మాస్ మహారాజా రవితేజ లేటెస్ట్ మూవీ 'ఇరుముడి' ఆగస్టు 21న థియేటర్లలో విడుదల కానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఇరుముడి'లోని భక్తి భావానికి మరింత ఎనర్జీని జోడిస్తూ మేకర్స్ మోస్ట్ అవైటెడ్ 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేశారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో లాంచ్ చేసిన ఈ పాట.. అందరికీ సుపరిచితమైన అయ్యప్ప భక్తి గీతానికి కొత్త రూపాన్ని తీసుకొచ్చింది.అయ్యప్ప భక్తుల్లో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉన్న ఒరిజినల్ 'మల్లెపూల పల్లకి' పాటలోని భక్తి భావాన్ని అలాగే ఉంచుతూ 'ఇరుముడి' కోసం సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ కొత్త మ్యూజికల్ టచ్ ఇచ్చారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో రవితేజ మాట్లాడుతూ ఈ సినిమా ఒక మంచి ఎమోషనల్ రైడ్. నేను చెప్పడం కంటే సినిమా చూసిన తర్వాత మీరే చెబుతారు. ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ అద్భుతంగా చేశారు. ప్రతి క్యారెక్టర్కు ఇంపార్టెన్స్ ఉంటుంది. స్వాసిక నటన చూస్తే మీకు భయమేస్తుంది. అంత అద్భుతంగా చేసింది. నిజంగా కొన్ని క్యారెక్టర్స్ మీ మైండ్‌లో ఉండిపోతాయి. ఆగస్టు 21న సినిమా చూసినప్పుడు మీకే అర్థమవుతుంది. ఇందులో ప్రతి క్యారెక్టర్ చాలా బాగుంటుంది. ఈ సినిమాలో మీరు ఒక డిఫరెంట్ సాయికుమార్ ని చూస్తారు. సినిమా గురించి చాలా మాట్లాడుకుంటారు. జీవీ ప్రకాష్ బ్రహ్మాండమైన పాటలు ఇచ్చారు. నక్షత్ర ఫ్యూచర్లో చాలా పెద్ద హీరోయిన్ అవుతుంది అని అన్నారు. డైరెక్టర్ శివ నిర్వాణ ,నిర్మాత రవి శంకర్ ,డైరెక్టర్ బాబీ కొల్లి, మ్యూజిక్ డైరెక్టర్ జివి ప్రకాష్ కుమార్, హీరోయిన్ ప్రియా భవానీ శంకర్,బేబీ నక్షత్ర ,డైరెక్టర్ బుచ్చిబాబు సనా, ప్రొడ్యూసర్ ఎస్.కే.ఎన్, డైరెక్టర్ సాయి రాజేష్, డైరెక్టర్ రాహుల్ సాంకృత్యన్ పాల్గొన్నారు.

## 'మహేంద్రగిరి వారాహి'లో
### బ్రహ్మానందం స్పెషల్ అట్రాక్షన్



సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మహేంద్రగిరి వారాహి' మహేంద్రగిరి నేపథ్యంగా, వారాహి మాత డివైన్ పవర్ చుట్టూ సాగే ఈ కథలో ఎన్ను అంతుచిక్కని సంఘటనలు, రహస్యాలు, మిస్టరీతో ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించబోతుంది.ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా బ్రహ్మానందం పాత్రని పరిచయం చేస్తూ పవర్ఫుల్ గ్లిమ్స్ ని రిలీజ్ చేశారు. గ్లింప్స్‌లో బ్రహ్మానందం అమ్మవారిని ప్రార్థిస్తున్న భక్తుని పాత్రలో డివైన్ ఫుల్ గా కనిపించారు. అమ్మ వారాహి మా మహేంద్రగిరిని కాపాడు తల్లి అని ప్రార్థిస్తున్నా ఈ గ్లిమ్స్ చివర్లో అమ్మవారు దర్శనం గూజ్ బంప్స్ అనుభూతి కలిగించింది. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలివు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, సినిమాటోగ్రాఫర్: ప్రతాప్ ఆర్ కృష్ణ, ఎడిటర్: జునైద్ సిద్ధిఖీ, ఆర్ట్ డైరెక్టర్: కృష్ణ ఆర్ట్స్.



## '2కె లవర్స్' షూటింగ్ షురూ

ఎం బి ప్రొడక్షన్ హౌస్ బ్యానర్ మీద రాజేష్ నాయుడు దర్శకత్వంలో బిచ్చు నాయక్ నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెం.1 '2కె లవర్స్' (సోలె అఫ్ లవ్ ) పూజా కార్యక్రమాలు ఫిలిం నగర్ దైవ సన్నిధానం లో ఘనంగా జరిగింది. ఈ సినిమాలో మోహిత్ పెడాడ, శృతి శంకర్, సాయి కుమార్, తనికెళ్ల భరణి, ప్రణీత్ రెడ్డి, సప్తగిరి, రచ్చ రవి, మొట్టా రాజేంద్రన్, రమ్య పొందూరి, సూర్య, శివన్నారాయణ, ఆమని తదితరులు ముఖ్య పాత్రలను పోషించబోతున్నారు. ఈ మూవీకి రసూల్ భాయ్ కథను అందించారు.ప్రొడక్షన్స్ హౌస్ ప్రారంభించడం ఆనందంగా ఉంది. రసూల్ మంచి కథను అందించారు. రాజేష్ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. యేటర్ నుంచి ఇంటికి వెళ్లినా కూడా వెంటాడేలా మా సినిమాలోని కథ ఉంటుంది. అందరినీ హత్తుకునేలా మా మూవీ ఉంటుంది అని అన్నారు.రచయిత రసూల్, హీరో మోహిత్, హీరోయిన్ శృతి శంకర్ పాల్గొన్నారు. మోహిత్ పెడాడ, శృతి శంకర్, సాయి కుమార్, తనికెళ్ల భరణి, ప్రణీత్ రెడ్డి, సప్తగిరి, రచ్చ రవి, మొట్టా రాజేంద్రన్, రమ్య పొందూరి, సూర్య, శివన్నారాయణ, ఆమని తదితరులు నటిస్తున్నారు.

## బిందు మాధవి హీరోయిన్‌గా 'డార్క్ చాక్లెట్'



రానా దగ్గుబాటి, స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'డార్క్ చాక్లెట్' చిత్రాన్ని అందిస్తున్నారు. విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. శశాంక్ శ్రీవాస్తవయ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ కల్లో కల్లోలం సాంగ్ లాంచ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విశ్వదేవ్ మాట్లాడుతూ. 'కల్లో కల్లోలం' పాట ఈ సినిమాలో చాలా ముఖ్యమైన సందర్భంలో వస్తుంది. ఈ సాంగ్ సినిమాకు చాలా ఇంపార్టెంట్. వివేక్ సాగర్ చాలా అద్భుతమైన ట్యూన్ ఇచ్చారు. మా డైరెక్టర్ కూడా సాంగ్స్ విషయంలో చాలా పర్టిక్యులర్‌గా ఉంటారు. అనురాగ్ ఈ పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. తప్పకుండా ఈ పాట ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది. దర్శకుడు రాసింది రాసినట్టుగా తెరకెక్కించారు. మరోసారి చూడటానికి కూడా ఎదురుచూస్తున్నారు. రానా గారి సపోర్ట్ మాకు ఎప్పుడూ ఉంటుంది. బిందు మాధవి చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. కచ్చితంగా మిమ్మల్ని సర్ప్రైజ్ చేస్తారు అన్నారు.డైరెక్టర్ శ శాంక్ బిందు మాధవి, డైరెక్టర్ నందకిషోర్ , అనురాగ్ కులకర్ణి పాల్గొన్నారు.



## 'సాV3' టీజర్ లాంచ్

సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న సినిమా 'సాV3'. ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి. విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హైదరాబాద్ లో 'సాV3' సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత, తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యదర్శి అశోక్ కుమార్ మాట్లాడుతూ కృష్ణ మాయ సినిమా పట్ల ప్యాషన్ ఉన్న టెక్నీషియన్. నేను ప్రొడ్యూస్ చేసిన అన్ని సినిమాలకు వర్క్ చేశాడు. నటుడిగా, ఆర్ట్ డైరెక్టర్ గా నా మూవీస్ కు పనిచేశాడు. ఎంత కష్టమైన వర్క్ అయినా చేస్తాడు. సినిమా అంటే అతనికి అంత ఇష్టం. గతంలో రైల్వే స్టేషన్ అనే సినిమా చేశాడు. ఈ సినిమాతో మరింత మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నా. య టీజర్ చాలా బాగుంది. పవన్ కు ఈ సినిమా మంచి పేరు తేవాలి. అతన్ని చూస్తుంటే దుల్కర్ సల్మాన్ లా అనిపిస్తాడు అన్నారు. ప్రొడ్యూసర్ వి. విజయ మాట్లాడుతూ మా మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథులుగా వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. సుధావల్లి, నాగవర్ధిని మాకు ఎంతో సపోర్ట్ చేశారు. మీ అందరి సపోర్ట్ తో ఇలాంటి మంచి చిత్రాలు మరిన్ని ప్రొడ్యూస్ చేయాలని కోరుకుంటున్నా అన్నారు.డైరెక్టర్ కృష్ణ మాయ మాట్లాడుతూ సినిమా ప్రొడక్షన్ ఎలా చేయాలి అనేది నేను అశోక్ కుమార్ ని చూసి నేర్చుకున్నా. ఆయన నాకు గురువు. సినిమా దర్శకత్వం రామ్ గోపాల్ వర్మ, మణిరత్నం దగ్గర వర్క్ చేసినప్పుడు తెలుసుకున్నాను. మా ఆర్టిస్టులు సామ్రాట్, పవన్, లిఖిత ముగ్గురూ అద్భుతంగా నటించారు. మూవీ క్లైమాక్స్ లో సామ్రాట్ పర్ఫార్మెన్స్ చూడాల్సిందే. ఈ సినిమాను అన్ని విషయాల్లో సక్సెస్ ఫుల్ గా తీసుకెళ్తున్నాం. ఇది టీజర్ మాత్రమే సినిమాలో ఇంకా స్ట్రాంగ్ కంటెంట్ చూస్తారు. త్వరలోనే మా చిత్రాన్ని రిలీజ్ కు తీసుకొస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో సింగర్, బిగ్ బాస్ ఫేమ్ రాము రాథోడ్, నటుడు సంజయ్ తుమ్మ, నటి హారిక నటి రీతు చౌదరి,హీరో డీమోన్ పవన్, హీరోయిన్ లిఖిత, హీరో సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో కదం తొక్కిన పాడి రైతులు

**వేలాది మంది రైతుల భారీ ర్యాలీ**
**డెయిరీ భూముల బదలాయింపుపై అభ్యంతరం**

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ మిల్క్ డెయిరీకి సంబంధించిన భూములను తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ పేరుతో నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం భారీ ఆందోళన చేపట్టారు. భూభారతి పోర్టల్ లో డెయిరీ భూముల రికార్డులు మారిపోవడంతో వివాదం చెలరేగింది. కరీంనగర్ డెయిరీ భూములను ఖాళీ చేయాలని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ ఉత్తర్వులు జారీ చేయడంతో కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ యాజమాన్యం, ఉమ్మడి జిల్లా పాడి రైతులు పెద్ద సంఖ్యలో కరీంనగర్ కు తరలివచ్చారు. ధరణిలో కరీంనగర్ డెయిరీ పేరున ఉన్న భూములు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూభారతిలో తెలంగాణ ఫెడరేషన్ పేరుతో మార్చారని రైతులు ఆరోపించారు. వెంటనే రికార్డులను తిరిగి డెయిరీ పేరుతో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పద్మనగర్ లోని కరీంనగర్ డెయిరీ నుంచి ప్లకార్డులు, నినాదాలతో పాడి రైతులు ర్యాలీగా కలెక్టరేటు తరలివచ్చారు. సుమారు 4 వేల మంది రైతులు నిరసనలో పాలొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కలెక్టరేట్ కు చేరుకున్న వేల మంది పాడి రైతులు శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. అనంతరం కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో ప్రతినిధులు కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సర్వే నంబర్ 1221/ఎ. లోని మొత్తం భూమిలో కరీంనగర్ డెయిరీకి కేటాయించిన 22.18 ఎకరాలలో 11.3 ఎకరాలను కో–ఆపరేటివ్ ఫెడరేషన్ పేరుతో నమోదు చేయడం అన్యాయమని రైతులు పేర్కొన్నారు.. ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే రెవెన్యూ రికార్డులను మార్చారని ఆరోపించారు. డెయిరీ భవనాలు తమవేనంటూ వాటిని ఖాళీ చేయాలని ఫెడరేషన్ ఎండీ ఆదేశాలు జారీ చేయడం వల్ల పాడి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ డెయిరీపై ఆధారపడి లక్ష మంది పాడి రైతులు జీవిస్తున్నారని తెలిపారు.





**రైతులకు న్యాయం చేయాలి: చల్మెడ రాజేశ్వర రావు :** అనంతరం డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ కరీంనగర్ డెయిరీని నమ్ముకుని లక్ష మంది పాడి రైతులు జీవిస్తున్నారని అన్నారు. వారికి న్యాయం చేయాల్సిన ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. లాభాల్లో నడుస్తున్న సంస్థ విషయంలో ప్రభుత్వం ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. భూభారతి పోర్టల్లో తెలంగాణ ఫెడరేషన్ పేరుతో మార్చిన భూములను వెంటనే కరీంనగర్ డెయిరీ పేరుతో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పాడి రైతులకు పెండింగ్ లో ఉన్న లీటర్ కు రూ.4ల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతి పాడీ రైతుకు 50 శాతం సబ్సిడీపై రెండు పశువులను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. తాము శాశ్వతంగా ఉండకపోవచ్చని, అయితే పాడి రైతులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఐక్యంగా పోరాడాలని చల్మెడ రాజేశ్వర్ రావు పిలుపునిచ్చారు. న్యాయం జరిగే వరకు కలిసికట్టుగా భవిష్యత్ కార్యాచరణతో పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ప్రజారవాణాకు 'మీటికెట్' యాప్
### ఒకే వేదికపై ఆర్‌టిసి, మెట్రో, ఆటో, క్యాబ్ సేవలు: టిజిఎస్ ఆర్‌టిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజారవాణా సేవలను మరింత ఆధునికీకరించే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి) కీలక ముందడుగు వేసింది. మీసేవ ఆధ్వర్యంలో 'మీటికెట్' పేరుతో సమగ్ర డిజిటల్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఆర్‌టిసి, మెట్రోతో పాటు ఆటోలు, క్యాబ్ సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యం. ప్రయాణికులు 'మీటికెట్' ద్వారా ఆర్‌టిసి లేదా మెట్రో టికెట్లను పొందడంతో పాటు గమ్యస్థానానికి చేరుకునేందుకు అవసరమైన ఆటో లేదా క్యాబ్‌ను ముందుగానే బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో వేర్వేరు యాప్‌లు వినియోగించాల్సిన అవసరం లేకుండా ఒకే డిజిటల్ వేదికపై ప్రయాణ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**ఆర్‌టిసి సొంతంగా ఆటోలు నడపదు..**

ఆర్‌టిసి సొంతంగా ఆటోలను కొనుగోలు చేసి నడపబోతోందంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం స్పష్టం చేసింది. ఆర్‌టిసి స్వయంగా ఆటోలను కొనుగోలు చేయడం, నిర్వహించడం చేయదని, భవిష్యత్తులోనూ అలాంటి ప్రతిపాదన లేదని తెలిపింది. ఆటో, క్యాబ్ డ్రైవర్లు, ఇతర రవాణా సేవలందించేవారు 'మీటికెట్' ప్లాట్‌ఫామ్‌లో భాగస్వాములుగా చేరి ప్రయాణికులకు నేరుగా సేవలు అందించవచ్చు. ప్రయాణికులు చెల్లించిన మొత్తాన్ని సంబంధిత రవాణా విభాగాలు, భాగస్వాములకు ఆటోమేటిక్‌గా జమ చేసే విధంగా చెల్లింపు వ్యవస్థను రూపొందిస్తున్నారు. ప్రజలకు సులభమైన, వేగవంతమైన, సమగ్ర ప్రయాణ అనుభవాన్ని అందించడమే 'మీటికెట్' లక్ష్యమని టిజిఎస్ ఆర్‌టిసి పేర్కొంది.

# ఎన్‌డిఎకు జేబు సంస్థగా ఇసి

**ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ విమర్శ**
**ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పిఎసి సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**



**ప్రజాపక్షం/యాదాద్రి :** కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ హయాంలో సిబిఐ, ఇడి తరహాలోనే భారత ఎన్నికల సంఘం (ఈసీ) కూడా ఒక జేబు సంస్థగా మారిపోయిందని ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ కూడా బిజెపి కనుసన్నల్లోనే నడుస్తోందని ఆమె ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి శివారులోని ఒక హోటల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పిఎసి) సభ్యులు, ముఖ్య నాయకులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, పార్టీ బలోపేతంపై నాయకులు, కార్యకర్తలకు మీనాక్షి నటరాజన్ పలు కీలక సూచనలు, దిశానిర్దేశం చేశారు. ఓటు హక్కు కోల్పోతే తీవ్ర అన్యాయం ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు రాజీవ్ గాంధీ జయంతి రోజున నూతన ఓటర్ల నమోదు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని డిసిసి స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పునర్నిర్మాణం చేసి బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ అధిష్టానం క్షేత్రస్థాయిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. అందులో భాగంగానే ఎస్ఐఆర్ ప్రక్రియపై క్షేత్ర స్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కష్టపడిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, పార్టీ కోసం నిలబడి కష్టపడిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి.. ప్రస్తుతం పార్టీతో పాటు ప్రభుత్వంలోనూ వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నామని మీనాక్షి నటరాజన్ తెలిపారు. ప్రభుత్వంతో పార్టీని సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లాలని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని నాయకులకు సూచించారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరగకుండా చూడడంపై ఆమె స్పష్టమైన కార్యాచరణను వివరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని కంచుకోట అని, పార్టీ కోసం కష్టపడిన నిజమైన కార్యకర్తలకే త్వరలోనే రెండో విడత నామినేటెడ్ పదవులు కేటాయిస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకుని సేవ చేసిన ప్రతి కార్యకర్తకూ తగిన ప్రాధాన్యం దక్కుతుందని, త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కైనా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాల్లో 16 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, శాసనసభ్యులు కుంభ అనిల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పేరుతో మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కళ్యాణలక్ష్మి పథకంపై దాఖలైన డబ్లు.పి.నంబర్ 21732/2026లో ఈ నెల 12న హైకోర్టు సెప్టెంబర్ 9 వరకు మధ్యంతర స్టే ఇచ్చిందని మంత్రి తెలిపారు. కోర్టు ఆదేశాలను గౌరవిస్తూనే స్టే తొలగింపునకు ప్రభుత్వం న్యాయపరంగా చర్య లు చేపట్టిందన్నారు. డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నామని, సా నుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. పథకానికి సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన ఎనిమిది జిఓల్లో ఏవైనా లోపాలు ఉంటే ప్రభుత్వ తప్పిదా లేనని పేర్కొన్నా రు. కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల ద్వారా ఇప్పటివరకు 16,78,347 మంది లబ్ధిదారులకు రూ.16,375.87 కోట్లకు పైగా ప్రయోజనం అందించినట్లు మంత్రి తెలిపారు. బిసి వర్గాలకు రూ.7,803.05 కోట్లు, ఎస్‌సిలకు రూ.2,734.81 కోట్లు, ఎస్‌టిలకు రూ.1,801.48 కోట్లు, మైనార్టీలకు రూ.3,204.83 కోట్లు, ఇబిసిలకు రూ.831.70 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నోడల్ ఏజెన్సీ ద్వారా గ్రీన్ ఛానల్‌లో నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యం ఎందుకు జరిగిందనే అంశంపై విచారణ చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. అధికారుల స్థాయిలోనా, ప్రభుత్వ న్యాయపరమైన వ్యవహారాలను పర్యవేక్షించే విభాగంలోనా లోపం జరిగిందో తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పథకాన్ని ఎత్తివేయాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పొన్నం స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాన్ని రాజకీయాలకు అతీతంగా కొనసాగిస్తున్నామని అన్నారు. బిసి కులగణనపై కూడా రాజకీయాలు చేయడం సరికాదని, గతంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ఎన్ని ఇళ్లు ఇచ్చారు, ఎంతమందికి ఉపాధి కల్పించారనే అంశంపై చర్చకు సిద్ధమని మంత్రి సవాల్ చేశారు.

## ఎన్‌టిఎ తక్షణమే రద్దు

**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేపర్ లీక్‌లు, తప్పుడు ప్రశ్నాపత్రాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిన ఎన్‌టిఎ ను తక్షణమే రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు కేంద్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. జూన్ లో జరిగిన యుజిసి నెట్ ప్రవేశ పరీక్షలో చోటు చేసుకున్న తప్పులు,లోపాల కారణంగా ఇంగ్లీష్, సోషియాలజీ, కామర్స్ పేపర్ లను రద్దు చేస్తున్నట్లు ఎన్‌టిఎ ప్రకటించడం అంటే విద్యార్థుల జీవితాలతో చెలగటమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్,పరీక్షల్లో అవకతవకలు మొదలుకొనినేటి యుజిసి నెట్ ప్రశ్న పత్రాల తప్పులు,లోపల వరకు ఎన్‌టిఎ పరీక్షల నిర్వహణ పట్లతీవ్ర నిర్లక్ష్యంగా స్పష్టమవుతుందని పేర్కొన్నారు. వరుస వైఫల్యాలతో లో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే న్యాయ విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయాలని, ఎన్‌టిఎ వరుస తప్పిదాలతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని , ఎన్టీఏ అధికారులు చేస్తున్న తప్పులకు విద్యార్థులు బలి అవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌టిఎ సంస్థ నిత్యం పరీక్షల నిర్వహణలో తప్పులు చేస్తూ అవకతవకలు, అక్రమాలు చేస్తూన్న కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఒక సంస్థను రద్దు చేయడానికి చర్యలు తీసుకోవడానికి ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వానికి ఒక ఎన్‌టిఎ సంస్థ ముఖ్యమా లేక దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమా ఆలోచించాలని,దీనిపై ప్రధాని మోదీ వెంటనే దీనిపై స్పందించాలన్నారు. కొన్ని పరీక్షల నిర్వహణ కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో కాకుండా రాష్ట్రాలకు కూడా ఇవ్వాలని మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ డిమాండ్‌చేశారు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com